

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 243



ఆదివారం | 1-12-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య ఉ. 11.50 తదుపరి పాడ్యమి; నక్షత్రం: అనూరాధ మ. 2.24 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 8.18-10.00; దుర్ముహూర్తం: సా.4.07-4.51; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైతులూ.. ఉచ్చులో పడొద్దు

బీఆర్ఎస్ నాయకుల మాయమాటలను నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు





రైతు సదస్సులో ప్రజలకు సీఎం రేవంత్ అభివాదం

- గిరిజనులను అడ్డం పెట్టుకొని లగచర్లలో మంటలు రేపారు
- గతంలో భూసేకరణ చేయకుండానే ప్రాజెక్టులు కట్టారా?
- ఎవరు అడ్డొచ్చినా కొడంగల్‌కు పరిశ్రమలు తీసుకొస్తా
- 25 వేల ఉద్యోగాలిచ్చి.. అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా
- దేశంలో పది నెలల్లోపే 21 వేల కోట్ల రుణమాఫీ ఘనత మాదే
- సంక్షేమ పథకాల కోసం అప్పులు తేలేదు.. భూములు అమ్మలేదు
- అప్పుడు వరి వేస్తే ఉరే అన్నారు.. ఇప్పుడు బోనస్ ఇస్తున్నాం
- పాలమూరుకు ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తాం
- కేసీఆర్ ఎవరినీ కలవలే.. రేవంతన్నా అంటే పలుకుతున్నా
- రైతు సదస్సు ముగింపు సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులు బీఆర్ఎస్ పన్నిన ఉచ్చులో పడొద్దని, ఆ పార్టీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మి కేసుల పాలు కావొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూసేకరణ చేయకుండా పరిశ్రమల ఏర్పాటు ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. చరిత్రలో ఎక్కడా భూసేకరణ చేయనట్లుగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి హయాంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌కు భూసేకరణ చేయలేదా? అని నిలదీశారు. ఆ సమయంలో తాము కూడా ఇలాగే దాడులు చేసేలా ప్రజలను రెచ్చగొడితే ప్రాజెక్టులు కట్టేవారా? అని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోపే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత దేశంలో తమకే దక్కిందన్నారు. శనివారం.. మహబూబ్‌నగర్ సమీపంలోని అమిస్తాపూర్ వద్ద మూడు రోజులుగా జరుగుతున్న రైతు పండుగ ముగింపు ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న రూ.2 లక్షల రుణమాఫీ కింద రూ.2747 కోట్లను విడుదల చేశారు. భూత్పూరు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన రైతులకు లాంఛనంగా

నాలుగో విడత రూ.2747 కోట్ల రుణమాఫీ

మిగతా 12వ పేజీలో...

రూ.54 వేల కోట్లతో రైతుల జీవితాల్లో వెలుగు

- నిరుడు ఇదే రోజు మార్పు కోసం ఓటేశారు
- ఆ ఓటే రైతన్న చరిత్ర తిరగరాసింది: సీఎం

రైతు పండుగ విజయవంతం!

- పాలమూరులో భారీగా తరలివచ్చిన ప్రజలు
- సీఎం రాకకు ముందే నిండిన ప్రాంగణం
- కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

12

లగచర్లలో పారిశ్రామిక పార్కు!

13

- భూసేకరణకు ప్రకటన జారీ.. రైతుల ఆమోదంతోనే
- నోటిఫికేషన్‌లో ప్రభుత్వం స్పష్టత.. మంచి ప్యాకేజీ

కృష్ణా బోర్డును పట్టించుకోవద్దు

12

- 1005 టీఎంసీల్లో రాష్ట్రానికి 70శాతం దక్కాలి
- ట్రైబ్యునల్ ఎదుట సమర్థంగా వాదించండి
- శ్రీశైలంలో టెలిమెట్రీ యంత్రాలు: సీఎం రేవంత్



టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

- బీసీ ఐఏఎస్ అధికారికి అవకాశం
- ఐదేళ్లకు పైగా కొనసాగే చాన్స్
- స్పెషల్ సీఎస్ పదోన్నతితో వీడ్కోలు

13

317 జీవో సమస్యల పరిష్కారానికి సర్కారు పచ్చజెండా

దంపతులు, ఆరోగ్య కారణాలు, పరస్పర బదిలీలకు ఓకే

ఏడాది పాలన ఎటు?



కొత్త పలుకు!

తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతోంది. పార్టీ పరంగా రేవంత్ జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వపరంగా ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో కొంత విఫలమయ్యారని మాత్రం చెప్పవచ్చు. కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కేసీఆర్ ఉన్నప్పుడే క్షీణించింది. దీంతో పాత పథకాలతో పాటు కొత్త పథకాల అమలుకు నిధుల కొరత ఏర్పడింది.

పాత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూ కొత్త పథకాల అమలుకు పూనుకుంటే ప్రజలు హర్షిస్తారుగానీ, అమలులో ఉన్న పథకాలను నిలిపివేసి కొత్తగా ఎన్ని పథకాలు అమలు చేసినా ప్రజలు సంతృప్తి చెందరన్న మౌలిక సూత్రాన్ని సీఎం రేవంత్ విస్మరించారు. అందుబాటులో ఉన్న నిధులన్నింటినీ రుణమాఫీకి మళ్లించడం వల్ల పాత పథకాలకు నిధుల కొరత ఏర్పడింది. ఫలితంగా రైతు భరోసా వంటి పథకాల అమలు నిలిచిపోయింది.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పెదవి విరవడానికి పెన్షన్ల పెంపు వంటి హామీలతో పాటు అభివృద్ధి పథకాల అమలు నిలిచిపోవడం కూడా కారణంగా కనిపిస్తోంది. అనేక నీటి ప్రాజెక్టులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. ప్రభుత్వ నిర్ణయాల వల్ల రియల్ ఎస్టేట్ రంగమూ మందగించింది. రేవంత్ సీఎం అయిన కొత్తలో ఆయనకు ప్రజల్లో మంచి స్పందనే వచ్చింది. ప్రభుత్వాధినేతగా నిర్ణయాలు తీసుకొనే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడంతో విమర్శలను కొని తెచ్చుకుంటున్నారు. క్షణాల్లో అద్భుతాలు సృష్టించలేమన్న వాస్తవాన్ని గ్రహించాలి. లక్ష్యం ఎంత మంచిదైనా ఎంచుకొనే మార్గం కూడా ఉన్నతంగా ఉండాలి.

ముఖ్యమంత్రిగా రేవంత్ తన భాషను కూడా మార్చుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషనే ఇప్పుడు కూడా వాడితే ప్రజలు హర్షించరు. తాను ఇప్పుడు ముఖ్యమంత్రిని అన్న విషయం మరచిపోయి భాష విషయంలో కేటీఆర్‌తో పోటీపడటం, సవాళ్లు విసురుకోవడం తన స్థాయిని తగ్గించుకోవడమే అవుతుంది.

రేవంత్ తన ఏడాది పాలనను సమీక్షించుకొని లోపాలను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన సమయం! కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా నాలుగేళ్ల గడువు ఉంది. ప్రభుత్వంపై ప్రజల్లో కొంత మేర అసంతృప్తి ఉందికానీ వ్యతిరేకత మాత్రం ఏర్పడలేదు. రేవంత్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని, ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, తమ పాలనకోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని కేసీఆర్ అండ్ కో భావిస్తున్నారు కానీ క్షేత్రస్థాయిలో అంత సీన్ లేదు. గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులపై కోపం ఇంకా తగ్గలేదు.

4

ప్రతిపక్షంగా బీఆర్ఎస్ తొందరపడుతోందన్న అభిప్రాయం కూడా ప్రజల్లో ఉంది. 'నిన్నటిదాకా మీరే అధికారంలో ఉన్నారుగా? అప్పుడే ఏం కొంపలు మునిగాయని ఆందోళనలు చేస్తున్నారు?' అని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వాధినేతగా తన పాత్రకు ఈ ఏడాది కాలంలో ఏ మేరకు న్యాయం చేయగలిగాను? అని రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిచేసుకోవాలి. ప్రస్తుతానికి రేవంత్‌పై వ్యక్తిగతంగా క్రేజ్ తగ్గలేదు. ఏ ప్రభుత్వానికైనా ప్రతిపక్షం నుంచి ముప్పు రాదు. ప్రజల నుంచే ముప్పు ఉంటుంది. తమ అంచనాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయని ప్రభుత్వాలను విసిరికొట్టే శక్తి ప్రజలకు మాత్రమే ఉంది.

దొంగ.. బెయిల్

- నకిలీ బెయిల్‌తో జైలు నుంచి దర్జాగా బయటకు
- చంచల్‌గూడలో ఖైదీ మాయ.. అండర్ ట్రయలర్ సహకారం
- చోరీ కేసు నిందితుడికి బెయిల్ సెక్షన్‌లో విధుల అప్పగింత
- పాత బెయిల్ పత్రాలతో ఫోర్జరీ.. అధికారుల పరిశీలన పైపైనే
- పీటీ వారెంట్‌తో వెలుగులోకి.. ఖైదీ కోసం పోలీసుల గాలింపు

హైదరాబాద్ సిటీ/సైదాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అది చంచల్‌గూడ కేంద్ర కారాగారం.. అక్కడ ఉన్నతాధికారులు బెయిల్ విభాగంలో ఓ విచారణ ఖైదీకి అత్యంత కీలకమైన బాధ్యతలను అప్పగించారు. పేనుకు పెత్తనమిస్తే తలంతా గొరిగినట్లు.. ఆ విచారణ ఖైదీ నకిలీ బెయిల్ పత్రాలను పాస్ చేసి.. మరో అండర్ ట్రయలర్ విడుదలకు కారణమయ్యాడు. దీంతో అధికారులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. హైదరాబాద్ సంతోష్‌నగర్ హెచ్‌బీ కాలనీకి

మిగతా 3వ పేజీలో...

లంచాలకు సింగిల్‌విండో



- అధికారులందరి తరఫున ఒక్కడే వసూళ్లు
- సస్పెండైన ఏఈఈ నిఖేష్ కుమార్ బాగోతం
- 19 చోట్ల సోదాలు.. 150 కోట్ల ఆస్తులు!
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు
- అంటకాగిన ఉన్నతాధికార్లపైనా ఏసీబీ నజర్

హైదరాబాద్, నార్సింగ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగిల్ విండో అనుమతుల మంజూరు గురించి విని ఉంటాం.. కానీ, సింగిల్ విండో అవినీతి గురించి ఎప్పుడైనా విన్నారా? ఇరిగేషన్ శాఖలో ఏఈఈగా పని చేస్తూ సస్పెండైన ఓ వ్యక్తి.. దీనికి తెర తీశాడు. తన పై అధికారుల తరఫున కూడా ఆయనే రేటు మాట్లాడి అనుమతులు మంజూరు చేయించేవాడు. ఏసీబీ సోదాల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. అవినీతి కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఇరిగేషన్ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) నిఖేశ్‌కుమార్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తాజాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. గండిపేట జోన్‌లో

మిగతా 3వ పేజీలో...

ఉన్నత చదువుకు వెళ్తే.. ప్రాణమే పోయింది

14



- అమెరికాలో దుండగుల కాల్పులు.. ఖమ్మం విద్యార్థి మృతి
- ఎంబీఏ కోసం ఐదు నెలల క్రితమే విదేశానికి సాయితేజ

6న బీజేపీ భారీ సభ

- హైదరాబాద్‌లో నిర్వహణ.. నడ్డా రాక!
- ఏడాదిలో ఒక్క రేషన్ కార్డూ ఇవ్వలే..
- బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ పాలన: కిషన్‌రెడ్డి
- సర్కారు వైఫల్యాలపై నేటి నుంచి నిరసన

10



తమిళనాట తుఫాన్ బీభత్సం

- చెన్నై జల దిగ్బంధం.. ఎయిర్‌పోర్టు బంద్
- శంషాబాద్‌లో 10 విమానాలు రద్దు

2



'మహా' సంకటం

» ముహూర్తం ఖరారైనా మహా కొత్త సీఎంపై వీడని సందిగ్ధత

» డిసెంబరు 5 సాయంత్రం 5 గంటలకు సీఎం ప్రమాణం

» బీజేపీ నుంచే కొత్త సీఎం ఉంటారన్న అజిత్ పవార్



ముంబై, నవంబరు30: మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేతే అవుతారని ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ చెప్పారు. శివసేనతో పాటు తన పార్టీ నుంచి డిప్యూటీ సీఎంలు ఉంటారని తెలిపారు. అయితే ఇంకా మంత్రిత్వ శాఖల కేటాయింపులు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యం కావడం మహారాష్ట్రలో కొత్తకాదన్నారు. 1999లో నెల రోజుల సమయం పట్టిందని అజిత్ పవార్ గుర్తు చేశారు. నవంబరు 23న ఫలితాలు రాగానే బీజేపీ సీఎంగా దేవేంద్ర ఫడణవీస్‌కు అజిత్ పవార్ మద్దతు పలికారు. డిసెంబరు 5న సాయంత్రం 5 గంటలకు ముంబైలోని ఆజాద్ మైదానంలో మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం కొలువుతీరబోతుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవనకులే తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారని ఆయన వెల్లడించారు. అయితే ముఖ్యమంత్రిగా ఎవరు ప్రమాణం చేస్తారనేది మాత్రం చంద్రశేఖర్ వెల్లడించలేదు. మరోవైపు, ఢిల్లీలో బీజేపీ అధిష్ఠానంతో మహాయుతి నేతల సమావేశం తర్వాత ముంబై నుంచి తన సొంతూరు సతారాకు వెళ్లిపోయిన ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేకు ప్రస్తుతం అనారోగ్యంగా ఉందని శివసేన వర్గాలు తెలిపాయి. జ్వరం, వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయన డాక్టర్ల బృందం పర్యవేక్షణలో ఉన్నారని మాజీ మంత్రి ఉదయ్ సామంత్ తెలిపారు.

పాదయాత్రలో కేజ్రీవాల్‌పై దాడికి యత్నం

న్యూఢిల్లీ, నవంబరు 30: ఆప్ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్‌పై ఓ యువకుడు దాడికి యత్నించాడు. పార్టీ శ్రేణులతో కలసి కేజ్రీవాల్ పాదయాత్ర చేస్తుండగా.. ఏదో ద్రావణం ఆయనపై చల్లి పైకి దూసుకెళ్లాడు. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, ఆప్ నేతలు ఆ యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. శనివారం దక్షిణ ఢిల్లీలోని మాలవీయనగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి పాల్పడిన యువకుడిని అశోక్ ఝాగా పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. కేజ్రీవాల్‌పై చల్లింది నీరే అయి ఉంటుందని భావిస్తున్నారు. ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. 'ఢిల్లీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ దాడి వెనక బీజేపీ హస్తం ఉంది' అని ఆరోపించారు. ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ ఆప్ ఆరోపణలను తిప్పికొట్టారు. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సానుభూతి కోసం కేజ్రీవాల్ మళ్లీ పాత ట్రిక్కునే వాడారు. ఇప్పటికే చెంపదెబ్బలు, ఇంకు చల్లడం చూశాం. ఇప్పుడు అలాంటిదే మరొకటి. నిందితుడిని విచారిస్తే అన్ని విషయాలు బయటికొస్తాయి' అని వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్‌పై విచారణకు అన్ని అనుమతులు: ఈడీ

న్యూఢిల్లీ, నవంబరు 30: మద్యం విధానం కుంభకోణంలో కేజ్రీవాల్‌ను విచారించేందుకు అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని ఈడీ శనివారం న్యాయస్థానానికి తెలిపింది. ఆయనపై సీబీఐ కేసు నమోదు చేసిన సందర్భంగా తీసుకున్న అనుమతులు సమగ్రమైనవని పేర్కొంది. అవినీతి నిరోధక చట్టంతో పాటు, నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) ప్రకారం కూడా విచారణ జరిపేందుకు సమగ్ర అనుమతులు తీసుకున్నట్టు తెలిపింది. వీటితో పాటుగా దర్యాప్తులో భాగంగా వెలుగులోకి వచ్చే కొత్త నేరాలపైనా విచారణ చేసేందుకు కూడా ముందుగానే అనుమతులు పొందామని వివరించింది. తాను సీఎంగా పనిచేసిన సమయంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు వచ్చినందున ముందస్తు అనుమతులు తప్పనిసరి అని, కానీ ఈడీ ఆ పని చేయలేదని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు.

కశ్మీర్‌లో 4వేల కానిస్టేబుల్ పోస్టులకు 5.59 లక్షల మంది పోటీ

జమ్మూ, నవంబరు 30: జమ్మూకశ్మీర్‌లో 4,002 కానిస్టేబుల్ పోస్టులకు 5.59 లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సగటున ఒక్కో పోస్టుకు 139 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లో 4,002 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 20 జిల్లాల్లోని 856 కేంద్రాల్లో డిసెంబరు 1, 8, 22వ తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. డిసెంబరు 1న 2,62,863 మంది, డిసెంబరు 8న 1,67,609 మంది, డిసెంబరు 22న 1,28,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షను కట్టుదిట్టమైన భద్రత నడుమ అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఎన్నో ఏళ్ల తర్వాత కానిస్టేబుళ్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనందున వయసు కారణంగా తాము అవకాశం కోల్పోయామని పేర్కొంటూ కొంతమంది యువకులు శనివారం ధర్నాకు దిగారు. వయసు సడలింపు ఇవ్వాలని, పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

ఇస్రో-నాసా ఐఎస్ఎస్ మిషన్.. భారత వ్యోమగాములకు ప్రాథమిక శిక్షణ పూర్తి

బెంగళూరు, నవంబరు 30: భారత, అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థలు సంయుక్తంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు చేపట్టనున్న యాక్సియమ్-4 మిషన్‌కు ఎంపిక చేసిన ఇద్దరు భారతీయ వ్యోమగాములు విజయవంతంగా ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్నారని ఇస్రో వెల్లడించింది. గగన్‌యాత్రీలుగా పిలిచే ప్రైమ్ గ్రూపు కెప్టెన్ సుభాన్షు శుక్లా, బ్యాకప్ గ్రూపు కెప్టెన్ ప్రశాంత్ బాలక్రిష్ణన్ నాయక్ ఈ ఏడాది ఆగస్టు మొదటి వారం నుంచి అమెరికాలో శిక్షణ తీసుకుంటున్నారు. ప్రాథమిక దశలో మిషన్ సంబంధిత గ్రౌండ్ ఫెసిలిటీ టూర్లపై అవగాహన, విషన్ ప్రయోగ దశల అవలోకనం, స్పేస్‌ఎక్స్ సూట్ ఫిట్ తనిఖీలు, అంతరిక్ష ఆహార ఎంపికలపై శిక్షణ పూర్తి చేసుకున్నారని ఇస్రో తెలిపింది. తర్వాతి దశలో మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు చెందిన యూఎస్ ఆర్బిటల్ సెగ్మెంట్ మిగిలిన మాడ్యూల్స్‌ను పరిష్కరించడం, మైక్రో గ్రావిటీ వాతావరణంలో శాస్త్రీయ పరిశోధనలు చేయడంపై శిక్షణ ఇవ్వనున్నారు.

విచారణకు రావాలని వక్కలిగ స్వామిజీకి నోటీసు

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఓటు హక్కు రద్దు చేయాలని వ్యాఖ్యానించిన విశ్వ వక్కలిగ మహా సంస్థానం మఠాధిపతి చంద్రశేఖరనాథ స్వామిజీకి ఉప్పారపేట పోలీసులు నోటీసులు జారీ చేశారు. డిసెంబరు 2వ తేదీ ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని సూచించారు. దీంతో స్వామిజీ ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే ఆయన ముస్లింలకు క్షమాపణలు తెలిపారు. తాజాగా శనివారం ఆయన స్పందిస్తూ, తమ మఠానికి ముస్లింలు కూడా భక్తులుగా వస్తారన్నారు. నోటీసు విషయం తెలియదని, తనకు ఆరోగ్యం బాగా లేదని, కేన్సర్‌తో విశ్రాంతి తీసుకుంటున్నానని తెలిపారు.

9599687085

» రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు దేశవ్యాప్త హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ, నవంబరు 30: మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కోసం క్యాన్సర్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా కొందరు ప్రముఖ వైద్యులు బృందంగా ఏర్పడి హెల్ప్‌లైన్ నంబర్ 9599687085ను ప్రారంభించారు. దేశంలో రొమ్ము క్యాన్సర్‌పై ఏర్పాటు చేసిన మొట్టమొదటి హెల్ప్‌లైన్ ఇదే. ఇది ఎల్లవేళలా(24/7) అందుబాటులో ఉంటుంది. ఎవరైనా ఈ నంబర్‌కు కాల్ చేసి రొమ్ము క్యాన్సర్ పట్ల ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు. వైద్యుల సలహాలు తీసుకోవచ్చు. వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స అందించడానికి కూడా ఈ టోల్ ఫ్రీ నంబర్ దోహదం చేస్తుందని సీనియర్ వైద్యుడు అశీశ్ గుప్తా చెప్పారు. ఆయనే క్యాన్సర్ ముక్త్ భారత్ కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్నారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకుంటే 50% వరకు డిస్కౌంట్ ఉంటుందని ఆయన తెలిపారు. మహిళల్లో ఈ వ్యాధిని తొలిదశల్లోనే గుర్తించి చికిత్స అందించడం ఈ హెల్ప్‌లైన్ వెనుక ప్రధాన ఉద్దేశ్యమని ఆయన వివరించారు. 50-64ఏళ్ల మధ్య వయస్సున్న మహిళలకు రొమ్ము క్యాన్సర్ ముప్పు ఎక్కువని చెప్పారు. అయితే, ఇటీవలి కాలంలో నమోదైన కేసుల్లో 25% కేసులు 40 ఏళ్ల లోపు వారివేనని ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో భారతదేశంలో 2లక్షల మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడ్డారని అంచనా.

చెన్నై జలదిగ్బంధం

తమిళనాట పలు జిల్లాల్లోనూ తుఫాను బీభత్సం.. స్తంభించిన జనజీవనం

» చెన్నై విమానాశ్రయం మూసివేత

» విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి



చెన్నైలోని టి.నగర్‌లో జలమయమైన రోడ్లు

చెన్నై, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలు తమిళనాడు రాజధాని చెన్నైని ముంచేశాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి ప్రధాన ప్రాంతాల్లో సైతం ఎటుచూసినా చెరువులు, నదుల్లా కనిపిస్తున్నాయి. టీనగర్ తదితర ప్రాంతాలు సైతం జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. నగరంలో ప్రభుత్వ రవాణా స్తంభించింది. కొన్ని చోట్ల రోడ్లపై మోకాలి లోతు నీరు నిలిచిపోవడంతో పాదచారులు సైతం తిరగలేని పరిస్థితి నెలకొంది. మూడు రోజుల నుంచి వణికిస్తున్న ఫెంగల్ తుఫాను తీరానికి సమీపించేకొద్దీ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించడంతో తమిళనాడులోని 9 జిల్లాల్లో శుక్రవారం నుంచి విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. మరోవైపు, తుఫానుతో సముద్రం అల్లకల్లోలంగా తయారైంది. తీర ప్రాంతాల్లో 75-95 కి.మీ వేగంతో గాలులు వీయడంతో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల సముద్రపు అలలు 7 మీటర్ల ఎత్తుకు ఎగసిపడ్డాయి. తిరుచ్చెందూర్‌లో సముద్రపు నీరు 80 అడుగుల మేర వెనక్కి వెళ్లడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. చెన్నైలో విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు కూడా మూతబడ్డాయి. సహాయ చర్యల కోసం 30 వేల మంది పోలీసులు, 18 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. నగరంలోనూ, సముద్రతీర ప్రాంతాల్లోనూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చెన్నైలోని ప్యారీస్ ప్రాంతం విద్యుదాఘాతానికి ఓ వ్యక్తి మరణించారు. చెంగల్పట్టు,కాంచీపురం జిల్లాల్లోనూ ఒక్కొక్కరు చొప్పున విద్యుదాఘాతానికి గురై మరణించారు. ఆదివారం చెన్నైతో పాటు 7 జిల్లాలకు రెడ్ అలెర్ట్, 9 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు.


విమానాల మళ్లింపు..

ఈదురు గాలులతోపాటు రన్‌వేపై వరదనీరు చేరడంతో శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం ఉదయం వరకు చెన్నై విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. చెన్నై రావాల్సిన 10 విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. చెన్నై నుంచి బయలుదేరాల్సిన 55 విమాన సర్వీసులను రద్దు చేశారు. దీంతో అత్యవసరంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెన్నైలో శనివారం మధ్యాహ్నం నుంచి సబర్బన్ రైలు సేవలు సైతం పాక్షికంగా నిలిచిపోయాయి. కాగా, చెన్నైవ్యాప్తంగా వరదనీరు చేరడంతో ఉపాధిలేని కూలీలు, హోటళ్లు లేక సాధారణ ప్రజలు తీవ్ర అవస్థలు పడే అవకాశముందన్న కారణంగా శనివారం చెన్నైలోని అమ్మా క్యాంటీన్లలో ఉచితంగా ఆహారం అందించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలు జారీ చేశారు.

తీరం దాటిన ఫెంగల్ తుఫాను

శంషాబాద్ రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సమీపంలో శనివారం రాత్రి ఫెంగల్ తుఫాను తీరం దాటింది. ఫెంగల్ ప్రభావంతో తిరుపతిలో భారీ వర్షం కురిసింది. శ్రీవారి ఆలయ పరిసరాలు జలమయమయ్యాయి. ప్రతికూల వాతావరణ నేపథ్యంలో విశాఖ, తిరుపతితో పాటు పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇక, కృష్ణపట్నం వద్ద సముద్రం 20 అడుగులు ముందుకు వచ్చింది. కెరటాలు భూమి లోపలి నుంచి కోసుకుంటూ రావడంతో తీరంలో మత్స్యకారుల ఇళ్లు సంద్రంలో కలిసిపోయాయి. కాగా, ఫెంగల్ తుఫాను కారణంగా హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోనూ పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శంషాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన 7 విమానాలు, చెన్నై వెళ్లాల్సిన మరో మూడు విమానాలను శనివారం వాతావరణం అనుకూలించక రద్దు చేశారు. ముంబై నుంచి చెన్నై వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. అలాగే ఢిల్లీ నుంచి చెన్నై వెళ్లాల్సిన ఎయిరిండియా విమానాన్ని కూడా శంషాబాద్‌లో ల్యాండింగ్ చేయించారు.

లోకం తీరు



కేంద్ర మంత్రి సింధియాపై తేనెటీగల దాడి

» డ్రోన్ల కారణంగా కలిగిన ముప్పు

శివపురి, నవంబరు 30: కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాపై శనివారం తేనెటీగలు దాడి చేశాయి. అప్రమత్తంగా వ్యవహరించిన వ్యక్తిగత సిబ్బంది ఆయన చుట్టూ వలయంగా ఏర్పడి తువాళ్లు, చేతి రుమాళ్లు అడ్డంగా పెట్టి సురక్షిత ప్రాంతానికి తీసుకువెళ్లడంతో ప్రమాదం తప్పింది. సాయంత్రం 3.30 గంటల సమయంలో మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లాలో ఉన్న మాధవ్ నేషనల్ పార్కులోని చంద్రపాద సరస్సు వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. సరస్సులో కలుపు మొక్కలు తొలగించే వీడ్ హార్వెస్టర్ మిషన్ ప్రారంభం కోసం ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా ఫొటోలు తీయడం, భద్రత కోసం డ్రోన్ ఏర్పాటు చేశారు. డ్రోన్ సంచారం కారణంగా సమీపంలోని తేనెటీగలు చెల్లాచెదురయి దాడి చేశాయి. చివరకు ఆ యంత్రాన్ని ప్రారంభించకుండానే ఆయన వెనుదిరిగారు. ఈ ఘటనలో పోలీసులు సహా కొందరు తేనెటీగల కాటుకు గురయి గాయపడ్డారు.

ఈసీ.. మోదీ ఇంటి ముందు కుక్క

» మహారాష్ట్ర కాంగ్రెస్ నేత భాయ్ జగ్‌తప్ తీవ్ర వ్యాఖ్య



న్యూఢిల్లీ/పుణె, నవంబరు 30: ఎన్నికల కమిషన్‌పై మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత, శాసనమండలిలో ఆ పార్టీ ఉప నేత భాయ్ జగ్‌తప్ తీవ్ర విమర్శ చేశారు. ప్రధాని మోదీ ఇంటి ముందు కూర్చున్న కుక్క అని శుక్రవారం ఆయన వ్యాఖ్యానించారు. 'ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి నెలకొల్పిన వ్యవస్థలన్నీ మోదీ ప్రభావంతో కీలుబొమ్మలుగా మారాయి. మహారాష్ట్ర ప్రజలు బీజేపీ-శివసేన-ఎన్సీపీలతో కూడిన మహాయుతి సర్కారుకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. అయితే ఈవీఎంల ట్యాంపరింగ్‌తో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వేరుగా వచ్చాయి. ప్రధాని తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు బ్యాలెట్ పేపర్లు వాడాలన్నారు. మరి ఇప్పుడు ఏమైంది' అని నిలదీశారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. ఈసీ పరువుకు భంగం కలిగించే విధంగా మాట్లాడారని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మండిపడ్డారు. మహారాష్ట్ర బీజేపీ జగ్‌తప్‌పై ఈసీకి, ముంబై పోలీసు కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసింది. తన వ్యాఖ్యలపై పెద్దఎత్తున దుమారం రేగుతున్నా.. క్షమాపణ చెప్పేందుకు ఆయన నిరాకరించారు. మరోవైపు, మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న కాంగ్రెస్ ఆరోపణలను ఎన్నికల కమిషన్ (ఈసీ) ఖండించింది. వాటిలో వాస్తవం లేదని స్పష్టంచేసింది. ఆ పార్టీ లేవనెత్తిన అంశాలపై మంగళవారం (3న) చర్చలకు ఆహ్వానించింది. ఈసీ కార్యదర్శి ఎస్కే దాస్ కాంగ్రెస్ తరఫు న్యాయవాది ఉమర్ హోడాకు ఈ మేరకు శనివారం లేఖ రాశారు.

ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, ధనబలం: పవార్

మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్నికల యంత్రాంగాన్ని నియంత్రించేందుకు పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని.. ధన బలం కూడా ప్రయోగించారని ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్ ఆరోపించారు. ఇంత దుర్వినియోగం లోక్‌సభ ఎన్నికల్లో గానీ, మరే రాష్ట్ర ఎన్నికల్లో గానీ జరుగలేదని ధ్వజమెత్తారు. ఈవీఎంలలో అవకతవకలపై జ్యోతిబా ఫూలే నివాసంలో సీనియర్ సామాజిక కార్యకర్త బాబా అధవ్ చేపట్టిన మూడ్రోజుల నిరసన కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈవీఎంలలో అదనంగా కొన్ని ఓట్లు వేశారని మహా వికాస్ అఘాడీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో కొంత నిజముందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో అధికార దుర్వినియోగాన్ని చూస్తుంటామని.. అయితే డబ్బు, అధికార దుర్వినియోగంతో ఎన్నిక యంత్రాంగం మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకోవడం ఇంతకుముందెన్నడూ చూడలేదని చెప్పారు.

మతపరమైన ఉద్రిక్తతలపై తక్షణ చర్యలు తీసుకోండి

» ప్రధానికి విశ్రాంత ఉన్నతాధికారుల లేఖ

» మాజీ సీఈసీ, ఢిల్లీ మాజీ ఎల్జీ సంతకం

న్యూఢిల్లీ, నవంబరు 30: దేశంలో పెరుగుతున్న మతపరమైన ఉద్రిక్తతలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరుతూ ప్రముఖ విశ్రాంత ఐఏఎస్ అధికారులు, దౌత్యవేత్తలు, ప్రజాప్రతినిధుల బృందం ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాసింది. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో హిందూ-ముస్లిం సంబంధాలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేసింది. మతపరమైన విభేదాలను తీవ్రతరం చేసిన ఘటనల నేపథ్యంలో మైనారిటీ వర్గాలైన ముస్లింలు, కొంతవరకూ క్రైస్తవుల్లో తీవ్ర ఆందోళన, అభద్రతా భావం చోటు చేసుకున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి పాలనా యంత్రాంగం ముస్లింలపై హింస, వివక్షను ప్రోత్సహిస్తూ, వారిపట్ల పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. గొడ్డు మాంసం తీసుకెళ్తున్నారన్న ఆరోపణలపై వ్యక్తులను కొట్టి చంపడం, విద్వేష ప్రసంగాలు, ముస్లింల ఇళ్లను ధ్వంసం చేయడం వంటి ఘటనలు ఈ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. ముస్లింల యాజమాన్యంలో ఉన్న వ్యాపారాలపై దాడులు జరుగుతున్నాయని, ఇది దేశ ఆర్థిక, సామాజిక పతనానికి దారి తీస్తుందని హెచ్చరించారు. విభజన శక్తులకు వ్యతిరేకంగా దృఢమైన వైఖరి తీసుకోవాలని, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని గౌరవించేలా, చట్టబద్ధ పాలనను నిలబెట్టేలా చూడాలని కోరారు. ఇటువంటి అలజడుల నేపథ్యంలో సమాజం పురోభివృద్ధి చెందడం సాధ్యం కాదని, 'అభివృద్ధి చెందిన భారత్' కల నెరవేరబోదని ఆ లేఖలో పేర్కొన్నారు. లేఖపై సంతకాలు చేసిన 17మందిలో ప్రణాళికా సంఘం మాజీ కార్యదర్శి ఎన్‌సీ సక్సేనా, ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ, ఆర్మీ మాజీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఉద్దీన్ షా తదితరులు ఉన్నారు.

కల్యాణ వైభోగమే

పెళ్లి ఖర్చు ఎంతైనా.. తగ్గేదేలే.. దేశంలో వివాహ సగటు బడ్జెట్ 36.5 లక్షలు



» గతేడాది కంటే 7 శాతం పెరుగుదల

» వేదికలు, కేటరింగ్‌కే ఖర్చు ఎక్కువ

» 2 నెలల్లో రూ. 6 లక్షల కోట్ల వ్యాపారం

» వెడ్‌మీగుడ్ సంస్థ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 30: ఖర్చుకు తగ్గేదేలే. పెళ్లి వేడుక అదిరిపోవాలి. ఇదే ట్రెండ్ ప్రస్తుతం వివాహం చేసుకునే జంటల్లో కనిపిస్తోంది. వివాహ వేడుకను జీవితంలో ఓ మధుర జ్ఞాపకంలా నిలుపుకోవడానికి ఖర్చుకు వెనుకాడటం లేదు. వివాహ వేడుకల తీరు కల్యాణ మండపాలు, కన్వెన్షన్ సెంటర్లు దాటి డెస్టినేషన్ వెడ్డింగ్ వరకు వచ్చింది. ప్రీ వెడ్డింగ్ షూట్లు, హల్దీ ఫంక్షన్లతో హడావుడి కూడా బాగా పెరిగింది. అలాగే బడ్జెట్ కూడా పెరిగింది. వేలు, లక్షలు దాటి కోట్లకు చేరింది. ఇటీవలే మనం చూశాం.. మన దేశ కుబేరుడు ముకేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ కల్యాణాన్ని న భూతో న భవిష్యతి అన్నట్లే చేశారు. ఈ పెళ్లికి సుమారు రూ. 5 వేల కోట్లు ఖర్చు అయిందని అంచనా వేశారు. వివాహం అద్వితీయంగా చేసుకోవాలనే ఆలోచనతో ప్రజలు ఖర్చుకు వెనుకాడటం లేదు. ఈ ఏడాది భారతీయుల వివాహ బడ్జెట్ గణనీయంగా పెరిగింది. అది సగటున రూ. 36.5 లక్షలకు పెరిగిందని వెడ్‌మీగుడ్ అనే వెడ్డింగ్ ప్లానింగ్ కంపెనీ అధ్యయనంలో వెల్లడైంది. అదే డెస్టినేషన్ వెడ్డింగ్ అయితే సగటున రూ. 51 లక్షలుగా ఉందని ఆ కంపెనీ తెలిపింది. గతేడాది కంటే ఇది 7 శాతం పెరిగిందని అంచనా వేసింది. వేదిక, కేటరింగ్ ఖర్చులు ఏటేటా 10 శాతం చొప్పున పెరగడమే పెళ్లి బడ్జెట్ హెచ్చు అవడానికి మూల కారణమని వెల్లడించింది. జ్యూయలరీ, డెకరేషన్‌కు కూడా బాగానే వ్యయం అవుతోంది. డెస్టినేషన్ వెడ్డింగ్ కాన్సెప్ట్ వచ్చాక ఇప్పుడు పెళ్లి వేడుకకు కోటి రూపాయలు ఖర్చు సాధారణం అయిపోయింది. సెలబ్రిటీల వెడ్డింగ్‌ల ప్రభావం కూడా దీనిపై ఉంది. తమ పెళ్లి వేడుక లాంటిది మరొకటి ఉండకూడదని కూడా భావిస్తూ జంటలు ఖర్చుకు వెనుకాడటంలేదు. "ఎంత వీలైతే అంత గొప్పగా వివాహ వేడుక చేసుకోవాలని అంతా భావిస్తున్నారు. వేదికకు ఎక్కువ బడ్జెట్ కేటాయిస్తున్నారు. దాని తర్వాత కేటరింగ్‌కు, మంచి వెడ్డింగ్ ప్లానింగ్ ఏజెన్సీకి ఖర్చు చేస్తున్నారు. మంచి ఇల్లు కొనడానికి, పిల్లలకు ఘనంగా పెళ్లి చేయడానికే తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారు" అని టైలర్‌మేడ్‌ఎక్స్‌పీరియన్స్ అనే సంస్థ ఫౌండర్ శంశాక్ గుప్తా తెలిపారు. "ప్రస్తుతం వివాహం స్వభావం మారిపోయింది. పెళ్లిళ్లలో చిందులకు జెనరేషన్ జెడ్ తరం జంటలు మక్కువ చూపుతున్నాయి. రెస్టారెంట్లపైన కాక్‌టైల్ పార్టీలా పెళ్లి వేడుకను మార్చేస్తున్నారు. థీమ్డ్ వెల్‌కం డిన్నర్లను చూస్తే పాశ్చాత్య ప్రభావం మన వాళ్లపైన ఎలా ఉందో తెలుస్తోంది" అని వెడ్‌మీగుడ్ కోఫౌండర్ మెహెక్ సాగర్ సహానీ అన్నారు.

ఇటీవల దేశంలో కొంతమంది సెలబ్రిటీల వివాహ ఖర్చు ఇలా..

ఇషా అంబానీ, ఆనంద్ పిరామిల్: **రూ. 700 కోట్లు**
సుశాంతో రాయ్, సీమంతో రాయ్: **రూ. 554 కోట్లు**
బ్రాహ్మణిరెడ్డి, రాజీవ్ రెడ్డి: **రూ. 500 కోట్లు**
శృష్టి మిత్తల్, గుల్‌రాజ్ బెహల్: **రూ. 500 కోట్లు**
వనిశా మిత్తల్, అమిత్ భాటియా: **రూ. 240 కోట్లు**
సోనమ్ వశ్వానీ, నవీన్ ఫాబియానీ: **రూ.210 కోట్లు**
విరాట్ కోహ్లీ, అనుష్కా శర్మ: **రూ. 100 కోట్లు**
అదెల్ సజన్, సనా ఖాన్: **రూ. 100 కోట్లు**
రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్: **రూ. 77 కోట్లు**

రెండు నెలల్లో 48 లక్షల పెళ్లిళ్లు


వివాహాల బడ్జెట్ పెరగడంతో కొత్త ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. ప్రత్యేకమైన కేటరింగ్ చేసే వారికి, ఆర్టిస్టులకు ఎక్కువ అవకాశాలు దక్కుతున్నాయి. నవంబరు, డిసెంబరు నెలల్లో సుమారు 48 లక్షల వివాహాలు జరుగుతాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్(సీఏఐటీ) అంచనా వేసింది. ఈ వివాహాల ద్వారా సుమారు రూ. 6 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని లెక్కలుగట్టింది.

అధ్యయన వివరాలు ఇవీ..

సర్వేలో పాల్గొన్న జంటలు: **3,500**
కోటి కన్నా ఎక్కువ ఖర్చు చేస్తామన్న వారు: **9%**
50 లక్షల నుంచి రూ. కోటి ఖర్చు : **9%**
15 లక్షల కన్నా తక్కువ చేస్తామన్నవారు: **40%**
15 లక్షల నుంచి రూ. 25 లక్షలు ఖర్చు చేస్తామన్నవారు: **19%**
25 లక్షల నుంచి రూ. 50 లక్షలు ఖర్చు చేస్తామన్నవారు: **23%**
పెళ్లికి వ్యక్తిగత, కుటుంబ సేవింగ్స్ మాత్రమే ఖర్చు చేస్తామన్నవారు: **82%**
లోన్లు తీసుకుంటామన్నవారు: **12%**
ఆస్తులు అమ్మి పెళ్లి చేసుకుంటాం అన్నవారు:**6%**

యుద్ధ రంగం నుంచి ఉక్రెయిన్ సైనికుల పలాయనం

లక్ష మందికి పైగా వెనక్కి



నాటోలో కలపండి

రష్యాతో యుద్ధాన్ని ముగించాలంటే.. తమ దేశ భూభాగాన్ని నాటో పరిధిలోకి తీసుకురావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. మా భూభాగానికి భద్రత కల్పిస్తామని నాటో హామీ ఇవ్వాలని, అప్పుడే తాము కాల్పుల విరమణకు అంగీకరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అయితే.. తన సూచనను నాటో పరిగణనలోకి తీసుకుంటుందా? అని చెప్పలేమని, అసలు తమను నాటోలో చేర్చుకుంటారో? లేదో? కూడా చెప్పలేని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు.

కీవ్, నవంబరు 30: దాదాపు మూడేళ్లుగా 'తెగదు-ముడిపడదు' అన్నట్లుగా రష్యాతో యుద్ధం కొనసాగుతుండడంతో.. ఉక్రెయిన్ సైనికులు కదనరంగం నుంచి జారుకుంటూ.. కాలికి బుద్ధిచెబుతున్నారు. గడిచిన ఆర్నెల్లుగా ఈ జాడ్యం మరింతగా పెరిగిందని ఉక్రెయిన్ సైన్యాధికారులు చెబుతున్నారు. ఈ కారణంతో వుహెల్డర్ వంటి కీలక భూభాగాలను ఉక్రెయిన్ కోల్పోవాల్సి వచ్చిందంటున్నారు. ఒకవేళ కాల్పుల విరమణకు రష్యాతో చర్చలు జరిగితే.. తాజా పరిణామాలు తమకు ప్రతికూలంగా మారే ప్రమాదాలున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2022 ఫిబ్రవరి 24న రష్యా దురాక్రమణ ప్రారంభమైనప్పటి నుంచి లక్ష మందికి పైగా ఉక్రెయిన్ సైనికులు చెప్పాపెట్టకుండా విధులకు ఎగనామం పెట్టినట్లు అధికారిక గణాంకాలు చెబుతుండగా.. అనధికారికంగా ఈ సంఖ్య 2 లక్షలకు పైనే ఉంటుందని అంచనా. రష్యాతో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్ సైన్యం పలచబడుతోంది. మరణాలు, గాయాలతోపాటు.. అనారోగ్య సమస్యలతో సెలవులు పెట్టి, తిరిగి రానివారు.. చెప్పాపెట్టకుండా వెళ్లిపోయినవారి వల్ల ఈ పరిస్థితి నెలకొందని 72 బ్రిగేడ్‌కు చెందిన ఓ అధికారి వెల్లడించారు.

యుద్ధం భయానకం

రష్యా దాడులు భయానకంగా ఉంటున్నాయని, వాటిని తట్టుకుని, ఎదురుదాడి చేసే వనరులు తమ వద్ద లేవని సైన్యంలో విధులకు ఎగనామం పెట్టిన సెర్హీ నెజ్జిలోవ్ అనే సైనికుడు పేర్కొన్నారు. "క్షేత్రస్థాయిలో పరిస్థితులు దారుణంగా ఉంటున్నాయి. రష్యా మాపై 50 షెల్స్‌ను ప్రయోగిస్తే.. మా సామర్థ్యం ఒక షెల్ మాత్రమే.! రష్యా దాడుల్లో మా తోటి సైనికుల శరీరాలు ఛిద్రమవ్వడం చూశాను. అరకొర వనరులతో మా పరిస్థితి కూడా అలాగే తయారవుతుందనే ఆందోళనతో బయటకు వచ్చాను. మా పై అధికారులు క్షేత్రస్థాయిలో ఉండరు. మాకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంటారు. రేడియో సెట్ల ద్వారా ఆదేశాలు జారీ చేస్తారు" అని వివరించారు. సైన్యం కంపెనీల్లో 120 మంది సైనికులు ఉంటారని.. ప్రస్తుతం ఒక్కో కంపెనీలో వారి సంఖ్య 10కి పడిపోయిందని ఓ ఉన్నతాధికారి వివరించారు.

ప్రపంచ మద్దతు కూడగట్టండి

» బంగ్లా దాడులపై కేంద్రానికి ఆరెస్సెస్ వినతి

న్యూఢిల్లీ, నవంబరు 30: బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మద్దతు కూడగట్టాలని ఆరెస్సెస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అన్యాయంగా అరెస్టు చేసిన ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబళే శనివారం డిమాండ్ చేశారు. 'బంగ్లాదేశ్‌లో హిందువులపై ఇస్లామిక్ ఛాందసవాదులు చేస్తున్న దాడులు, హత్యలు, దోపిడీలు, దహనాలు, అమానవీయ దౌర్జన్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ చర్యలను ఆరెస్సెస్ ఖండిస్తోంది' అని ఆయన పేర్కొన్నారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం, ఇతర ఏజెన్సీలు హింసను అంతం చేయలేని నిశ్శబ్ద ప్రేక్షకులుగా మిగిలిపోయాయని ఆరెస్సెస్ ఆరోపించింది. కాగా, బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రత కోసం ప్రపంచ వ్యాప్తంగా 150కి పైగా దేశాల్లోని లక్షలాది మంది ఇస్కాన్ భక్తులు ఆదివారం (డిసెంబరు 1న) ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇదిలాఉండగా, చట్టోగ్రామ్‌లో శుక్రవారం వందలాది మంది ఆందోళనకారులు హిందూ వ్యతిరేక, ఇస్కాన్ వ్యతిరేక నినాదాలు చేస్తూ.. మూడు దేవాలయాలపై దాడికి పాల్పడ్డారు.

లంచాలకు సింగిల్ విండో

(మొదటిపేజీ తరువాయి)

ఏఈఈగా విధులు నిర్వహిస్తున్న హేరూర్ నిఖేష్ కుమార్.. ఇంటి నిర్మాణానికి ఎన్‌ఓసీ ఇవ్వటానికి ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఈ ఏడాది మే 30న పట్టుకున్నారు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న నిఖేష్ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు నిఖేష్ నివాసంతోపాటు అతడి బంధువులు, స్నేహితుల నివాసాలు, కార్యాలయాల్లో కలిపి మొత్తం 19 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఆస్తులకు సంబంధించిన పలు పత్రాల్ని స్వాధీనం చేసుకున్నారు. ఐదు ప్రాంతాల్లో ఇంటి స్థలాలు, 6.5 ఎకరాల వ్యవసాయ భూమి, ఖరీదైన అపార్ట్‌మెంట్లలో ఆరు ఫ్లాట్లు, రెండు వ్యాపార సముదాయాలు నిఖేష్ కుమార్‌కు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న పత్రాల ప్రకారం స్థిర, చర ఆస్తులు కలిపి మొత్తం రూ.17.74 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. మార్కెట్ ధర ప్రకారం వీటి విలువ రూ.150 కోట్లకుపైగా ఉంటుందని భావిస్తున్నారు. సోదాల్లో గుర్తించిన ఆస్తులు కాకుండా బంగారం, బ్యాంకు లాకర్లు, బ్యాంకు ఖాతాల్లో నగదు నిల్వలపైనా ఏసీబీ విచారణ కొనసాగుతోంది.

వాటాలు వేసి పంపకాలు

పదేళ్ల క్రితం ఇరిగేషన్ శాఖలో చేరిన నిఖేష్ కుమార్ 2021 నుంచి గండిపేట జోన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గండిపేట జోన్ హైదరాబాద్ శివారుప్రాంతం కావడంతో అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. చెరువులు, కుంటల సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్మాణాలు చేపట్టేందుకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనలు ఆటంకంగా ఉండటంతో.. వారి నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసి ఎన్‌ఓసీ ఇచ్చేలా నిఖేష్ డీల్ కుదుర్చుకునేవాడని ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. పేరుకే ఏఈఈగా విధులు నిర్వహిస్తున్నా.. తన పై అధికారుల్ని సైతం ఒప్పించి ఫైల్ ఓకే చేయించేలా ఏక మొత్తంలో బేరం కుదుర్చుకునేవాడని తేలింది. కొన్ని సందర్భాల్లో ఒక్కో ఎన్‌ఓసీకి రూ.50 లక్షల వరకు కూడా వసూలు చేసినట్లు సమాచారం. వసూలు చేసిన మొత్తంలో సగానికిపైగా తాను తీసుకుని మిగిలిన దాంట్లో పైఅధికారులకు వాటాలు ఇచ్చేవాడని తెలుస్తోంది. కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో రూ.2.50 కోట్ల విల్లాను నిఖేష్ కొన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఇరిగేషన్ విభాగంలో ఆయనతోపాటు పనిచేసే మరో ఐదుగురికి కూడా ఇక్కడే విల్లాలు ఉన్నాయి. దీనిపైనా ఏసీబీ విచారణ జరుపుతోంది.

పలువురు బినామీలు

అక్రమంగా సంపాదించిన మొత్తాన్ని కాపాడుకోవడానికి నిఖేష్ బినామీలను పెట్టుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. దీంట్లో భాగంగా, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తన చిన్ననాటి స్నేహితులను, బంధువులను ఎంచుకునేవాడు. వారికి రూ.5-10 లక్షల వరకు సహాయం చేసి వారి పేరుతో విలువైన ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఏసీబీ సోదాల్లో వెల్లడైంది. స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాల ఆధారంగా బినామీలకు నోటీసులు జారీ చేసి విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు గండిపేట జోన్‌లో ఇరిగేషన్ విభాగం జారీ చేసిన అన్ని ఎన్‌ఓసీలపైనా ఏసీబీ దృష్టి సారించింది. నిఖేశ్‌తోపాటు ఉన్నతాధికారుల ప్రమేయంపైనా లోతుగా విచారణ జరుపుతోంది.

ఫేక్ బెయిల్‌తో జైలు నుంచి బయటకు

(మొదటిపేజీ తరువాయి)

చెందిన మీర్ సుజాత్ అలీఖాన్‌పై చీటింగ్ కేసులున్నాయి. జంతువుల హత్య, వాటికి విషం పెట్టడం వంటి నేరాలకు సంబంధించి గతంలో అరెస్టయిన సుజాత్ అలీ.. చంచల్‌గూడ జైలులో అండర్ ట్రయల్(యూటీ 5549)గా ఉన్నాడు. అక్టోబరు 17న ఆ కేసులో బెయిల్ రావడంతో విడుదలయ్యాడు. నవంబరు 2న నార్సింగ్ ఠాణాలో.. బీఎన్ఎస్‌లోని సెక్షన్లు 318, 144, 338, 336(3), 340(2) కింద కేసు నమోదైంది. పోలీసులు అతణ్ని అరెస్టు చేసి, చంచల్‌గూడ జైలుకు రిమాండ్ చేశారు. అండర్ ట్రయలర్(యూటీ 6687)గా ఉన్న సుజాత్ అలీ.. బెయిల్ విభాగంలో పనిచేసే రాము అనే మరో విచారణ ఖైదీ(యూటీ 4831)ని మచ్చిక చేసుకున్నాడు. ఆ తర్వాత.. పాత బెయిల్ పేపర్లను ఫోర్జరీ/ట్యాంపర్ చేసి ఇస్తే.. దాన్ని పాస్ చేయాలని.. అందుకు భారీ మొత్తంలో ప్రతిఫలం ఇస్తానంటూ రాముతో ఒప్పందం కుదుర్చుకున్నాడు.

కుతంత్రం అమలైందిలా..

ములాఖత్ సమయంలో తన వారిని కలిసిన సుజాత్ అలీ.. వ్యూహాన్ని వారికి వివరించి.. పాత బెయిల్ పత్రాలను ట్యాంపర్ చేయించాడు. కొత్త తేదీలతో తాజా కేసులో బెయిల్ వచ్చినట్లుగా పత్రాలను సృష్టించాడు. అలా తయారు చేసిన నకిలీ బెయిల్ పత్రాలను రాముకు అందజేశాడు. రాము ఆ పత్రాలు కోర్టు నుంచి వచ్చినట్లుగా ధ్రువీకరిస్తూ.. స్టాంపింగ్ చేశాడు. దాంతో.. ఉన్నతాధికారులు ఆ బెయిల్ పత్రాలు నిజమైనవేనని భావించి, నవంబరు 26న సుజాత్ అలీని విడుదల చేశారు.

పీటీ వారెంట్‌తో వెలుగులోకి

నిజానికి విడుదలైన సుజాత్ అలీపై జైళ్ల శాఖ అధికారులు మరోమారు ఫోకస్ చేసి ఉండేవారు కాదు. అయితే.. 'కానూన్ కా హాత్ లంబా హోతాహై' అన్నట్లుగా మూడ్రోజుల్లోనే సుజాత్ అలీ మోసం వెలుగులోకి వచ్చింది. మరో చీటింగ్ కేసులో దర్యాప్తు అధికారులు కోర్టు అనుమతితో సుజాత్ అలీని కస్టడీలోకి తీసుకునేందుకు పీటీ వారెంట్ దాఖలు చేశారు. దానికి కోర్టు ఆమోదించడంతో.. నవంబరు 29న పీటీ వారెంట్‌తో చంచల్‌గూడ జైలుకు చేరుకుని, సుజాత్ అలీని తమకు అప్పగించాలంటూ చంచల్‌గూడ జైలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దాంతో జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఖంగుతిన్నారు. జైలులో ఉన్నవారికే పీటీ వారెంట్ వర్తిస్తుంది. అలాంటిది విడుదలైన సుజాత్ అలీకి పీటీ వారెంట్ రావడంపై ఆశ్చర్యపోయారు. దీనిపై ఆరా తీస్తే.. అతని బెయిల్ పత్రాలు నకిలీవని తేలింది. దీంతో.. జరిగిన మోసాన్ని గుర్తించి, డబీర్‌పుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు ఏం చేయాలా? అని తలలు పట్టుకుంటున్నారు. సుజాత్ అలీని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

తప్పెవరిది?

సుజాత్ అలీ నకిలీ బెయిల్ పత్రాల వ్యవహారం రాష్ట్ర జైళ్ల శాఖలో సంచలనంగా మారింది. నిజానికి ఈ వ్యవహారాలను జైలు సూపరింటెండెంట్ పర్యవేక్షించాలి. అయితే.. ప్రస్తుత సూపరింటెండెంట్ కుమార్తె పెళ్లి కారణంగా వారం రోజుల క్రితం నుంచే సెలవుల్లో ఉన్నారు. కేంద్ర కారాగారంలో.. అందులోనూ వీవీఐపీ ఖైదీలు ఉండే జైలులో సూపరింటెండెంట్ సెలవులో ఉంటే.. మరో జైలు సూపరింటెండెంట్ లేదా సీనియర్ డీఎస్పీకి బాధ్యతలను అప్పగించాలి. ఉన్నతాధికారులు అలా చేయకుండా.. నిత్యం బిజీగా ఉండే డీఐజీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఇక కీలకమైన బెయిల్ విభాగంలో దొంగతనం కేసులో అరెస్టయిన విచారణ ఖైదీ రాముకు బాధ్యతలను అప్పగించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. జైళ్ల శాఖ నిబంధనల ప్రకారం.. విచారణ ఖైదీలకు ఎలాంటి బాధ్యతలను అప్పగించకూడదు. జైళ్ల కర్మాగారాల్లోనూ పనులు చేయించకూడదు. చంచల్‌గూడలో ఆ నిబంధనలను తుంగలో తొక్కినట్లు స్పష్టమవుతోంది. ఇక బెయిల్ పత్రాలను పరిశీలించాల్సిన అధికారులు కూడా ఖైదీ స్టాంపు వేయడంతో గుడ్డిగా ఆమోదించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై జైళ్ల శాఖ డీఐజీ వివరణకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా.. ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. ఇతర అధికారులు, సిబ్బంది ఈ విషయాన్ని ధ్రువీకరించడానికి సుముఖత కనబర్చడం లేదు.

పాలను సరఫరా చేయగలరా..? లేదా..?

మూడు నెలలు అవకాశం ఇస్తున్నాం

అప్పటికీ మారకపోతే కఠిన చర్యలు

విజయ డెయిరీకి మంత్రి సీతక్క హెచ్చరిక

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): "అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన మేర పాలను ఇవ్వగలరా.. లేదా.? ప్రభుత్వం కోరినంత సరఫరా చేసేంత సామర్థ్యం ఉందా.. లేదా..? డిమాండ్‌కు అనుగుణంగా పాలను పంపించే శక్తి లేకపోతే.. ప్రస్తుతం మీకు ఇస్తున్న ఆర్డర్‌లో కొంత తగ్గించి ఇతర సంస్థల ద్వారా సేకరించమంటారా..?" అని విజయ డెయిరీ ప్రతినిధులను మంత్రి సీతక్క ప్రశ్నించారు. మరో మూడు నెలల పాటు అవకాశం ఇస్తున్నామని, అప్పటి వరకు పాల సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆ తర్వాత కూడా పాల సరఫరా సంతృప్తికరంగా లేకపోతే కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గత డిసెంబరు నుంచి ఇప్పటి వరకు 1.67 కోట్ల లీటర్ల పాల కోసం ఆర్డర్ చేయగా 1.56 కోటి లీటర్లనే విజయ డెయిరీ సరఫరా చేయగలిగిందన్నారు. కొన్ని అంగన్ వాడీ సెంటర్లకు సకాలంలో పాలు సరఫరా కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య లక్ష్మి పథకంపై శనివారం మంత్రి సీతక్క సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పాలను సీతక్క తాగారు. పాల నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి.. సరఫరా విషయంలో అలసత్వం వహించొద్దని అన్నారు. కాగా, అంగన్‌వాడీలకు రూ.57కి లీటరు పాలను అందిస్తున్నామని, ధరలను సవరించాలని విజయ డెయిరీ ప్రతిపాదించగా.. మంత్రి తిరస్కరించారు. మూడు నెలలు అంతరాయం లేకుండా పాలను సరఫరా చేసిన తర్వాత, మరోసారి సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ(ఓఅండ్‌ఎం) పోస్టు పూర్తి అదనపు బాధ్యతలను సీనియర్ చీఫ్ ఇంజనీర్ల(సీఈ) అయిన అంజద్ హుస్సేన్, శ్రీనివాస్‌ల్లో ఒకరికి అప్పగించాలని ఆ శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఇన్నాళ్లు ఈఎన్‌సీ(ఓఅండ్‌ఎం)గా పనిచేసిన బి.నాగేంద్రరావు పదవీకాలం శనివారంతో ముగిసింది.

'సరగసీ' మహిళ మృతి కేసులో

నిందితుడికి రిమాండ్

- సరగసీకి కుదిరిన ఒప్పందం రూ.10లక్షలు.. రూ. 50 వేలు అడ్వాన్స్

రాయదుర్గం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సరగసీకి అంగీకరించి హైదరాబాద్ వచ్చి ప్రమాదవశాత్తు 9వ అంతస్తు నుంచి పడి మహిళ మృతిచెందిన ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆమె మృతికి కారణమైన నిందితుడు రాజేశ్‌బాబు(54)ను ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు శనివారం రిమాండుకు తరలించారు. సందీప్ అనే మధ్యవర్తి ద్వారా ఒడిశాకు చెందిన ఆశ్రితాసింగ్ (25), సంజయ్‌సింగ్ దంపతులు రాజేశ్‌బాబు దంపతులకు సరగసీ ద్వారా బిడ్డను కనిచ్చేందుకు ఒప్పుకున్నారు. ఈమేరకు రూ.10 లక్షలకు ఒప్పందం కుదరగా... ఆశ్రిత భర్తకు రాజేశ్‌బాబు రూ.50వేలు అడ్వాన్స్ ఇచ్చినట్లు తెలిసింది. అక్టోబరు 24నే నగరానికి వచ్చిన ఆశ్రిత కుటుంబాన్ని రాజేశ్‌బాబు... తాను నివాసముండే గచ్చిబౌలిలోని మైహోం భూజ అపార్ట్‌మెంట్‌లో 7వ అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో ఉంచాడు. సరగసీ ద్వారా బిడ్డను కనేందుకు కోర్టు అనుమతులు పొందాలని దానికి కొంత సమయం పడుతుందన్నాడు. అయితే సరగసీ పూర్తయ్యే వరకు భార్యభర్తలు ఒక దగ్గర ఉండటం మంచిదికాదని డాక్టర్లు చెప్పారని ఆశ్రితను 9వ అంతస్తులోని ఫ్లాట్‌కు మార్చాడు. డిసెంబరు 5లోపు కోర్టు ఆదేశాలు వస్తాయని.. అవి వచ్చిన వెంటనే సరగసీ ప్రక్రియ మొదలవుతుందని చెప్పాడు. కాగా, గదిలో ఒంటరిగా ఉన్న ఆశ్రిత మానసికంగా కుంగిపోయింది. భర్త, బిడ్డకు దూరంగా ఉండటం, వివిధ రకాల వైద్య పరీక్షలకోసం ఆస్పత్రులకు తిప్పుతుండటంతో మరింత భయాందోళనకులోనైంది. ఈక్రమంలో ఒంటరిగా తాను మానసికంగా చిత్రవధ అనుభవిస్తున్నానని ఈనెల 26న రాత్రి తన భర్తకు ఫోన్ చేసి చెప్పింది. ఎలాగోలా కొద్దిరోజులు ఓర్చుకోవాలని భర్త సర్దిచెప్పాడు. అయితే ఆమె ఎలాగైనా అక్కడి నుంచి బయటపడాలనుకుంది. కిటికీలోంచి చీరలు ఒకదానికొకటి ముడివేసి 7వ అంతస్తుకి దిగితే అక్కణ్నుంచి భర్తతో కలిసిపారిపోవచ్చనుకుంది. దిగే ప్రయత్నంలో కిందపడి మృతిచెందింది. సరగసీ పేరుతో మహిళను గదిలో బంధించి, ఆమె మృతికి కారణమైన నిందితుడు రాజేశ్... ఏపీకి చెందిన ఓ ప్రముఖ రాజకీయనేతకు తోడల్లుడని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. అయితే నిందితుడు ఆశ్రితపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చినప్పటికీ పోలీసులతో ఆమె భర్త ఆ విషయం చెప్పలేదని, మానసికంగానే వేధించినట్లు తెలిపినట్లు పోలీసువర్గాలు పేర్కొన్నాయి.

భూగర్భ జల శాఖలో పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వెల్లడి

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భూగర్భజల శాఖలో వివిధ నాన్ గెజిటెడ్ హోదాల్లో 25 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయినట్టు టీజీపీఎస్సీ తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి 2022 నవంబరులో నోటిఫికేషన్ విడుదల చేయగా.. తుది ఇంటర్వ్యూలు ఇటీవలే పూర్తయ్యాయి. ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్లో ఉంచారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

ఏడాది పాలన ఎటు?

తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతోంది. రాష్ట్ర విభజన తర్వాత తొమ్మిదిన్నరేళ్లు ప్రతిపక్షానికే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో రేవంత్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించారని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి పదవి చేపట్టాలన్న తన లక్ష్యాన్ని కూడా ఆయన నెరవేర్చుకున్నారు. అనూహ్యంగా ప్రతిపక్షానికి పరిమితమైన భారత రాష్ట్ర సమితి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. గతంలో మంత్రి పదవి చేపట్టిన అనుభవం కూడా లేని రేవంత్‌రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను ఇప్పుడు సమీక్షించుకుందాం! పార్టీలో ఎంతో మంది సీనియర్లు ఉన్నప్పటికీ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టుబట్టి మరీ రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారు. ఆ పదవిపై ఆశలు పెట్టుకున్న భట్టి విక్రమార్క, ఉత్తమకుమార్ రెడ్డి వంటివారు సర్దుకుపోవాల్సిన పరిస్థితి. రేవంత్‌రెడ్డి కూడా పార్టీలో తనపై అసంతృప్తి ఏర్పడకుండా సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తున్నారు. పార్టీ పరంగా రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వపరంగా ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో మాత్రం కొంత విఫలమయ్యారని మాత్రం చెప్పవచ్చు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ప్రజల్లో అంచనాలు అమాంతం పెరిగాయి. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చింది. అయితే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కేసీఆర్ ఉన్నప్పుడే క్షీణించింది. దీంతో పాత పథకాలతో పాటు కొత్త పథకాల అమలుకు నిధుల కొరత ఏర్పడింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దూకుడుగా వ్యవహరించడాన్ని ప్రజలు హర్షిస్తారుగానీ ప్రభుత్వాధినేతగా ఆచితూచి వ్యవహరించాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడం వల్ల రేవంత్‌రెడ్డి కొన్ని సమస్యలను కొని తెచ్చుకున్నారు. రైతులకు రుణ మాఫీ అమలు విషయంలో ముఖ్యమంత్రి తొందరపడ్డారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు పన్నిన ఉచ్చులో రేవంత్ చిక్కుకున్నారు. పాత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూ కొత్త పథకాల అమలుకు పూనుకుంటే ప్రజలు హర్షిస్తారుగానీ, అమలులో ఉన్న పథకాలను నిలిపివేసి కొత్తగా ఎన్ని పథకాలు అమలు చేసినా ప్రజలు సంతృప్తి చెందరన్న మౌలిక సూత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించారు. అందుబాటులో ఉన్న నిధులన్నింటినీ రైతు రుణ మాఫీకి మళ్లించడం వలన పాత పథకాలకు నిధుల కొరత ఏర్పడింది. ఫలితంగా రైతు భరోసా వంటి పథకాల అమలు నిలిచిపోయింది. దీనిపై ప్రజల్లో, ముఖ్యంగా రైతుల్లో అసంతృప్తి నెలకొంది. ఈ పరిస్థితిని గ్రహించిన రేవంత్‌రెడ్డి రైతు భరోసా ఇవ్వటానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పెదవి విరవడానికి పెన్షన్ల పెంపు వంటి హామీలతోపాటు అభివృద్ధి పథకాల అమలు నిలిచిపోవడం కూడా కారణంగా కనిపిస్తోంది. అనేక నీటి పారుదల ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా నిలిచిపోయాయి. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యం లోపించడంతో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కోసం వెతుక్కోవలసిన పరిస్థితి! కేసీఆర్ పాలనలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు కూడా చెల్లింపులకు నోచుకోలేదు. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాల వల్ల రియల్ ఎస్టేట్ రంగం మందగించింది. ఈ కారణాల వల్ల ప్రజల వద్ద నగదు చెలామణీ తగ్గిపోయింది. ఫలితంగా ప్రజల్లో ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ లోపించింది.

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌తో భారతీయ జనతా పార్టీ ఇక తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టిసారించే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో రేవంత్‌రెడ్డికి బీజేపీ నుంచి కూడా సవాళ్లు ఎదురవుతాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదేలైన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరింత ఆచితూచి అడుగులు వేయాలి. తన ప్రభుత్వంపై ప్రస్తుతానికి సణుగుడుకే పరిమితమైన ప్రజల్లో వ్యతిరేకత నెలకొనకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దృష్టి కేంద్రీకరించాలి. లేని పక్షంలో ఇంటా బయటా ఆయనకు సమస్యలు తప్పవు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. తమ పార్టీ పట్ల ప్రజల్లో ఏడాది గడచినా సానుకూలత ఏర్పడకపోవడానికి కారణాలను అన్వేషించుకోవాలి. స్థానిక నాయకులను చూస్తేనే ప్రజలకు గతం గుర్తుకొస్తున్నందున కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించే విషయాన్ని కూడా కేసీఆర్ ఆలోచించాలి.

ఏడాదిలోనే ఎందుకీ మార్పు...

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొత్తలో ఆయన వ్యవహార శైలి పట్ల ప్రజల్లో మంచి స్పందనే వచ్చింది. అయితే ప్రభుత్వాధినేతగా నిర్ణయాలు తీసుకొనే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడంతో ఆయన విమర్శలను కొని తెచ్చుకుంటున్నారు. ఉదాహరణకు 'హైడ్రా' ఏర్పాటు! చెరువులు, కుంటల పరిరక్షణకు హైడ్రా ఏర్పాటును అందరూ స్వాగతించారు. ఎప్పుడయితే పేదలు, మధ్యతరగతి వాళ్లు నిర్మించుకున్న, కొనుగోలు చేసిన ఇళ్లను కూల్చే ప్రయత్నం జరిగిందో అప్పటి నుంచి హైడ్రాపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. ఫాం హౌజ్‌లను కూల్చివేసినప్పుడు స్వాగతించిన వాళ్లు సామాన్య ప్రజల ఇళ్ల జోలికి వచ్చేసరికి వ్యతిరేకించారు. అదే సమయంలో మూసీ ప్రక్షాళన తెరమీదకు రావడంతో ప్రజల్లో ప్రభుత్వంపై అపోహలు నెలకొన్నాయి. మూసీ ప్రక్షాళన- హైడ్రా వంటి ఆపరేషన్లను ఒకే పర్యాయం అమలు చేయాలనుకోవడమే ప్రభుత్వం చేసిన తప్పు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆరేడు నియోజక వర్గాలకు సాగునీరు అందించే మూసీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందిగానీ, మొదటగా మూసీకి ఇరువైపులా ఉన్న ఇళ్లను కూల్చివేయబోతున్నట్టుగా వాటిపై ఎరుపు రంగు అక్షరాలతో మార్కింగ్ చేయించడం మరో తప్పిదం. నిజానికి ఈ చర్యకు హైడ్రాతో సంబంధం లేదు. అయినా హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతలు జరగబోతున్నాయన్న ప్రచారం జరిగింది. దీంతో మూసీ ప్రక్షాళనను ప్రజలు అపార్థం చేసుకున్నారు. నిజానికి ప్రభుత్వం కూడా ముందుగా అక్రమణల తొలగింపు జోలికి వెళ్లకుండా ఉండాల్సింది. పై నుంచి, కింది నుంచి మూసీ ప్రక్షాళన పనులు చేపట్టి ఉంటే ఈ ప్రాజెక్టును ప్రజలు అర్థం చేసుకొని స్వాగతించే వారు. సినిమాల్లో చూపించినట్టుగా ముఖ్యమంత్రిగా క్షణాల్లో అద్భుతాలు సృష్టించలేమన్న వాస్తవాన్ని రేవంత్‌రెడ్డి గ్రహించాలి. లక్ష్యం ఎంత మంచిదైనా దాన్ని చేరుకోవడానికి ఎంచుకొనే మార్గం కూడా ఉన్నతంగా ఉండాలి. ప్రభుత్వం అంటే ప్రతిపక్షాల నుంచి రాజకీయ చికాకులు ఎదురవడం సహజం. మూసీ ప్రక్షాళన, హైడ్రా ప్రాజెక్టు విషయంలో కూడా రాజకీయం మొదలైంది. ముఖ్యమంత్రి దుందుడుకుగా వ్యవహరించడమే అందుకు కారణం. దీంతో ప్రభుత్వాధినేతగా రేవంత్‌రెడ్డి పరిణతితో వ్యవహరించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది.

'మాట' మారాలి...

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తన భాషను కూడా మార్చుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషనే ఇప్పుడు కూడా వాడితే ప్రజలు హర్షించరు. తాను ఇప్పుడు ముఖ్యమంత్రిని అన్న విషయం మరచిపోయి భాష విషయంలో కేటీఆర్‌తో పోటీ పడటం, సవాళ్లు విసురుకోవడం తన స్థాయిని తగ్గించుకోవడమే అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ముతక భాషను వినీవినీ ప్రజలు విసుగు చెందారు. ఇప్పుడు అక్కడ ప్రభుత్వం మారిన తర్వాత బూతులు పోయాయి. నాటి ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తున్నాయి. ఆమోదయోగ్యం కాని భాషను ఇప్పుడు తెలంగాణలో వాడుతున్నారు. ప్రతిపక్షానికి పరిమితమవాల్సి వస్తుందని ఊహించని కేటీఆర్‌వంటి వారిలో అసహనం ఏర్పడటం సహజం. సీనియర్ అధికారులను కూడా కేటీఆర్ వాడూ వీడూ అని సంబోధించడాన్ని ప్రజలు హర్షించడం లేదు. ఇలాంటి పద ప్రయోగాలు అహంభావానికి నిదర్శనంగా నిలుస్తాయి. అలాంటప్పుడు భాష విషయంలోగానీ, సవాళ్ల విషయంలోగానీ కేటీఆర్‌తో ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి పోటీపడకూడదు. ముఖ్యమంత్రి తన భాషను సరిదిద్దుకోవాలని, హుందాతనాన్ని ప్రదర్శించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మొత్తమ్మీద నాలుగైదు విషయాలలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తొందరపాటు ప్రదర్శించింది. అదే సమయంలో పాత పథకాల అమలు నిలిచిపోవడం కూడా ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఏర్పడటానికి కారణమైంది. రేవంత్‌రెడ్డి తన ఏడాది పాలనను సమీక్షించుకొని లోపాలను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన సమయం!



బీఆర్‌ఎస్ పరిస్థితి ఏమిటి...

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా నాలుగేళ్ల గడువు ఉంది. ప్రభుత్వంపై ప్రజల్లో కొంత మేర అసంతృప్తి ఉందికానీ వ్యతిరేకత మాత్రం ఏర్పడలేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని, ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, తమ పాలనకోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని కేసీఆర్ అండ్ కో భావిస్తున్నారు కానీ క్షేత్రస్థాయిలో అంత సీన్ లేదు. గ్రామీణ ప్రాంతాల్లో భారత రాష్ట్ర సమితి నాయకులపై కోపం ఇంకా తగ్గలేదు. రేవంత్‌రెడ్డి ఏడాది పాలనను బేరీజు వేసుకుంటే ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి లేని మాట వాస్తవమే కానీ, భారత రాష్ట్ర సమితి పట్ల మాత్రం సానుకూలత ఏర్పడలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. కేసీఆర్ తొలి విడత పాలనలో క్రమశిక్షణ కనిపించేది. ఎమ్మెల్యేలలో భయం ఉండేది. ఫలితంగా వారు అరాచకాలకు పాల్పడటానికి సాహసించే వారు కాదు. ప్రజల్లో ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్ ఉండేది. ఉద్యోగులు, నిరుద్యోగులు స్వేచ్ఛ అనుభవించారు. కేసీఆర్ అంటే భయం కారణంగా ఎమ్మెల్యేలు, నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించారు. మలి విడత పాలన ఇందుకు పూర్తి భిన్నంగా ఉండింది. అధికార పార్టీ నాయకుల అరాచకాలు తారస్థాయికి చేరాయి. మంత్రులు, ఎమ్మెల్యేలను కేసీఆర్ జనం మీదకు వదిలేశారు. దీంతో వారంతా ప్రజాకంటకులుగా మారిపోయారు. ఉద్యోగ వర్గాలపై కూడా నిర్బంధాలు ఉండేవి. ప్రజల హక్కులకు భంగం వాటిల్లింది. ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఇటు ప్రజలకు, అటు ఉద్యోగులకు కల్పించారు. తొలి విడత పాలనలో కేసీఆర్ అంటే పార్టీ నాయకులకు భయం ఉండగా, మలి విడత పాలనలో కేసీఆర్ అండ్ కో అంటే ప్రజలు భయపడే పరిస్థితి. ఈ కారణంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై పూర్తి స్థాయి సంతృప్తి లేనప్పటికీ భారత రాష్ట్ర సమితి పట్ల ఇంకా సానుకూలత ఏర్పడటం లేదు. ఏడాది క్రితం పరిస్థితులను అప్పుడే ఎలా మరచిపోతామని ఆయా వర్గాలవారు వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా చేయకపోయినా స్వేచ్ఛను అనుభవిస్తున్నామని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ తొందరపడుతోందన్న అభిప్రాయం కూడా ప్రజల్లో ఉంది. 'నిన్నటిదాకా మీరే అధికారంలో ఉన్నారుగా? అప్పుడే ఏం కొంపలు మునిగాయని ఆందోళనలు చేస్తున్నారు?' అని భారత రాష్ట్ర సమితి నాయకులను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం ఎలా ఉన్నప్పటికీ ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. బీఆర్‌ఎస్ నాయకులకు ఆరాటం ఉంటే ఉండవచ్చునుగానీ ప్రభుత్వాన్ని ఇప్పటికిప్పుడు మార్చేయాలన్న ఆరాటం ప్రజలకు ఉండదు కదా! ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికి ఏడాది అనుభవం వచ్చింది. ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్‌కు కూడా ఏడాది అనుభవం వచ్చింది. ఇప్పుడు ఉభయ పక్షాలూ ఈ ఏడాదిలో తప్పొప్పులను సమీక్షించుకోవడం అవసరం. ప్రభుత్వాధినేతగా తన పాత్రకు ఈ ఏడాది కాలంలో ఏ మేరకు న్యాయం చేయగలిగాను? అని రేవంత్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి. లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిచేసుకోవాలి. ప్రస్తుతానికి ప్రజల్లో రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగతంగా క్రేజ్ తగ్గలేదు. ముఖ్యమంత్రిగా ఆయన ఎంత వరకు సక్సెస్ అవుతారా అని ప్రజలు బేరీజు వేసుకునే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించి అందుకు అనుగుణంగా దిద్దుబాటు చర్యలు తీసుకుంటే ఇటు పార్టీ పైనా, అటు ప్రభుత్వంపైనా ఆయనకు పట్టు పెరుగుతుంది. ఏ ప్రభుత్వానికైనా ప్రతిపక్షం నుంచి ముప్పు రాదు. ప్రజల నుంచే ముప్పు ఉంటుంది. తమ అంచనాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయని ప్రభుత్వాలను విసిరికొట్టే శక్తి ప్రజలకు మాత్రమే ఉంది. కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడినందునే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగలిగింది. కాకపోతే కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం ఎలా అని ప్రజలు సందిగ్ధంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి తనను తాను ప్రత్యామ్నాయంగా ఆవిష్కరించుకున్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌తో భారతీయ జనతా పార్టీ ఇక తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టిసారించే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో రేవంత్‌రెడ్డికి బీజేపీ నుంచి కూడా సవాళ్లు ఎదురవుతాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదేలైన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరింత ఆచితూచి అడుగులు వేయాలి. తన ప్రభుత్వంపై ప్రస్తుతానికి సణుగుడుకే పరిమితమైన ప్రజల్లో వ్యతిరేకత నెలకొనకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దృష్టి కేంద్రీకరించాలి. లేని పక్షంలో ఇంటా బయటా ఆయనకు సమస్యలు తప్పవు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. తమ పార్టీ పట్ల ప్రజల్లో ఏడాది గడచినా సానుకూలత ఏర్పడకపోవడానికి కారణాలను అన్వేషించుకోవాలి. స్థానిక నాయకులను చూస్తేనే ప్రజలకు గతం గుర్తుకొస్తున్నందున కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించే విషయాన్ని కూడా కేసీఆర్ ఆలోచించాలి. తొమ్మిదిన్నరేళ్లు అధికారం చెలాయించిన కేటీఆర్ వంటి వారు గతాన్ని మరచి అధికారులపై విరుచుకుపడటం వల్ల ప్రయోజనం ఉండదు. అధికారులను హెచ్చరించడం వేరు – దూషించడం, పరుష పదజాలం వాడటం వేరు అని కేటీఆర్ వంటి వారు గుర్తించాలి.

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికి ఏడాది అనుభవం వచ్చింది. ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్‌కు కూడా ఏడాది అనుభవం వచ్చింది. ఇప్పుడు ఉభయ పక్షాలూ ఈ ఏడాదిలో తప్పొప్పులను సమీక్షించుకోవడం అవసరం.

రేవంత్‌రెడ్డి ఏడాది పాలనను బేరీజు వేసుకుంటే ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి లేని మాట వాస్తవమే కానీ, భారత రాష్ట్ర సమితి పట్ల మాత్రం సానుకూలత ఏర్పడలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. కేసీఆర్ తొలి విడత పాలనలో క్రమశిక్షణ కనిపించేది. ఎమ్మెల్యేలలో భయం ఉండేది. ఫలితంగా వారు అరాచకాలకు పాల్పడటానికి సాహసించేవారు కాదు. ప్రజల్లో ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్ ఉండేది. మలి విడత పాలన ఇందుకు పూర్తి భిన్నంగా ఉండింది. అధికార పార్టీ నాయకుల అరాచకాలు తారస్థాయికి చేరాయి. మంత్రులు, ఎమ్మెల్యేలను కేసీఆర్ జనం మీదకు వదిలేశారు. దీంతో వారంతా ప్రజాకంటకులుగా మారిపోయారు. ఉద్యోగ వర్గాలపై కూడా నిర్బంధాలు ఉండేవి. ప్రజల హక్కులకు భంగం వాటిల్లింది. ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఇటు ప్రజలకు, అటు ఉద్యోగులకు కల్పించారు. తొలి విడత పాలనలో కేసీఆర్ అంటే పార్టీ నాయకులకు భయం ఉండగా, మలి విడత పాలనలో కేసీఆర్ అండ్ కో అంటే ప్రజలు భయపడే పరిస్థితి. ఈ కారణంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై పూర్తి స్థాయి సంతృప్తి లేనప్పటికీ భారత రాష్ట్ర సమితి పట్ల ఇంకా సానుకూలత ఏర్పడటం లేదు.

అలవోకగా జగన్ అబద్ధాలు...

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల విషయానికి వద్దాం! అదానీ కంపెనీతో సోలార్ పవర్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్న వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిస్సిగ్గుగా బుకాయింపునకు తెగబడుతున్నారు. తక్కువ ధరకు ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా లక్ష కోట్లకు పైగా సంపద సృష్టించానని, అందుకు తనను సన్మానించాల్సింది పోయి రాళ్లు వేస్తారా అని అమాయకత్వం ప్రదర్శించే ప్రయత్నం చేశారు. ఈ మాటలు విన్నాక, ప్రజలు వెర్రివాళ్లని ఆయన కచ్చితంగా భావిస్తున్నారని అర్థమవుతుంది. ట్రాన్స్‌మిషన్ నష్టం వగైరా అదనపు భారాలను పక్కన పెట్టినా ఒక యూనిట్ రెండు రూపాయలా 49 పైసలకు 25 ఏళ్లపాటు కొనుగోలు చేసేలా జగన్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇంతా చేసి విద్యుత్ సరఫరా ఇంకా ప్రారంభం కూడా కాలేదు! కానీ, బహిరంగ మార్కెట్‌లో సౌర విద్యుత్ ధర ఇప్పటికే రెండు రూపాయలకు పడిపోయింది. మునుముందు మరింత తగ్గవచ్చు. జగన్ బాబూ ఇప్పుడు చెప్పు! లక్ష కోట్ల రూపాయల సంపదను సృష్టించావా? ప్రజల నెత్తిన 25 ఏళ్ల పాటు లక్షల కోట్ల భారాన్ని వేశావా? వచ్చే పదేళ్లలో సౌర విద్యుత్ రేటు యూనిట్ రూపాయిన్నరకు పడిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డి సంపద సృష్టించారా? ప్రజల జేబులు గుల్ల చేశారా? అబద్ధాలకు చొక్కా ప్యాంట్ తగిలిస్తే జగన్‌రెడ్డి కనిపిస్తారు. ఈ స్థాయిలో అలవోకగా అబద్ధాలు చెప్పడంలో ఆరితేరిన జగన్‌కు డాక్టరేట్ ఇవ్వాల్సిందే. అమెరికా ఏజెన్సీలు తన పేరు ఎక్కడా ప్రస్తావించలేదని జగన్ మరో పచ్చి అబద్ధం చెప్పారు. ఎస్‌ఈసీ తన ఫిర్యాదులో 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి' జగన్మోహన్‌రెడ్డికి లంచం ఇచ్చారని పేర్కొనడం వాస్తవం కాదా? జగన్‌రెడ్డి ధన దాహం ఏ పాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు అమాయకత్వం నటించినా నమ్మేవాళ్లు ఎవరూ లేరు. ప్రతిఫలం లేకుండా అతను ఏ పనీ చేయడన్న విషయం అందరికీ తెలిసిందే. కాకినాడ, గంగవరం పోర్టులు చేతులు మారడం వెనుక ఏమి జరిగిందో అందరికీ ఎరుకే. అదానీకి కేంద్ర ప్రభుత్వంలో ఉన్న పలుకుబడిని అడ్డుపెట్టుకొని విద్యుత్ కొనుగోలు ఒప్పందం నుంచి తప్పించుకోవచ్చునని జగన్‌రెడ్డి భావిస్తుండవచ్చు. చేసిన పాపాలు వెంటాడుతూనే ఉంటాయి. సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం విషయమై తనపై అవాస్తవాలు ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' పత్రిక 48 గంటల్లో క్షమాపణ చెప్పకపోతే వంద కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా వేస్తానని ఆయన హెచ్చరించడం వింతగా ఉంది. వంద కోట్లు ఏమి ఖర్మ – లంచంగా తీసుకున్న 1750 కోట్ల రూపాయలు సరిపోలేదనుకుంటే అంతే మొత్తానికి పరువు నష్టం దావా వేసుకోవచ్చు. నిజానికి జగన్‌రెడ్డి మాపై పరువు నష్టం దావా వేయడం కాదు– ఆంధ్రప్రదేశ్ ప్రజలే ముందుకొచ్చి ఈ దిక్కుమాలిన విద్యుత్ ఒప్పందం కుదుర్చుకొని తమపై మోయలేని భారం వేసినందుకు జగన్‌రెడ్డిపై దావా వేయడంతో పాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు చొరవ తీసుకోవాలి. అదానీ–జగన్ డీల్ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉండబోతున్నదో తెలియదు. ఈ ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలన్న పాపులర్ డిమాండ్ ఉంది. అయితే ఒప్పందంలో చేర్చిన నిబంధనల ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే అదానీ కంపెనీకి మూడు వేల కోట్ల రూపాయలను నష్టపరిహారం కింద చెల్లించాల్సి వస్తుంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. జగన్‌రెడ్డి తన స్వార్థం కోసం ప్రజలనే కాదు– ప్రస్తుత ప్రభుత్వాన్ని కూడా ఇరికించారు. ఒకవేళ ఒప్పందం రద్దయితే నష్టపరిహారంగా లభించే మూడు వేల కోట్ల రూపాయలలో లంచంగా ఇచ్చిన సొమ్ము పోయినా అదానీ కంపెనీకి 1250 కోట్ల రూపాయలు మిగులుతాయి. అంటే ఈ ఒప్పందం అమలు అయినా కాకపోయినా అటు జగన్, ఇటు అదానీ కోల్పోయేదీ ఏమీ లేదు. ప్రజలు మాత్రం అదనపు భారాన్ని మోయాల్సిందే. ప్రభుత్వాలు లంచాలకు ఆశపడి స్వార్థం కోసం తీసుకునే నిర్ణయాల వల్ల తాము మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడితే ప్రజలకు ఉన్న వెసులుబాటు ఏమిటి? తమకు నష్టం కలిగించిన పాలకులను న్యాయస్థానాలకు లాగే వెసులుబాటు ప్రజలకు ఉంటుందా లేదా? అన్నది న్యాయ నిపుణులు చెప్పాలి. ఇటువంటి వెసులుబాటు ప్రస్తుతం లేని పక్షంలో ఆ దిశగా చట్టాలను సవరించాల్సిన అవసరం ఉంది. అలా జరిగినప్పుడు మాత్రమే పాలకుల్లో జవాబుదారీతనం వస్తుంది. లేనిపక్షంలో ఏమరుపాటుతో అధికారం కట్టబెట్టిన పాపానికి సదరు పాలకులు చేసే పాపాలకు ప్రజలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది.

కేంద్రం, రాష్ట్రం చేతిలో జగన్ భవిష్యత్తు...

అదానీ–జగన్ డీల్ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలియదు. ఈ అంశంపై చర్చ జరగకుండానే పార్లమెంటు ఉభయ సభలూ వాయిదా పడుతున్నాయి. దీంతో కేంద్ర వైఖరి ఏమిటో తెలియని పరిస్థితి. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రాన్ని ధిక్కరించి చర్యలు తీసుకొనే స్థితిలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లేదు. అందుకే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా జగన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం లేదు. మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. నిజానికి ఇందులో పరిశీలించాల్సింది ఏమీ లేదు. రాజకీయంగా ఎదురవుతున్న పరిస్థితుల గురించి చెప్పుకోలేరు కనుక పరిశీలిస్తున్నామని ప్రభుత్వంలో ఉన్నవారు చెప్పుకొంటున్నారు. గజం మిథ్య పలాయనం మిథ్యగా ఈ వ్యవహారం ముగిసినా ఆశ్చర్యపడాల్సిన అవసరం ఉండదు. అదానీని మినహాయించి జగన్‌రెడ్డికి మాత్రం ఈ కుంభకోణాన్ని పరిమితం చేయడంలోని సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం దృష్టి పెడుతుందేమో తెలియదు. ప్రభుత్వ నిర్ణయాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించే హక్కు పౌరులకు ఉంటుంది. ఈ విద్యుత్ కొనుగోలు ఒప్పందం కూడా ప్రభుత్వ నిర్ణయమే. రాష్ట్రంలోని ప్రతి పౌరుడిపై దీని ప్రభావం ఉంటుంది. ఈ కారణంగా ప్రభుత్వ నిర్ణయ బాధితులుగా ఎవరైనా కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉందో లేదో న్యాయ నిపుణులు చెప్పాలి. ఈ వ్యవహారంలో జగన్‌రెడ్డి ఘీంకరింపులు, హూంకరింపులు ఎలా ఉన్నా ప్రజా క్షేత్రంలో ఆయన దోషిగా నిలబడక తప్పదు. లంచం తీసుకోకుండా ఆయన ఈ ఒప్పందం కుదుర్చుకున్నారంటే ఒక్కరు కూడా నమ్మరు. ఆయన మద్దతుదారులకు కూడా ఈ విషయంలో క్లారిటీ ఉంటుంది. అదానీతో డీల్స్ కుదుర్చుకుంటే తాను సేఫ్‌గా ఉంటానని జగన్‌రెడ్డికి తెలుసు. అందుకే రాష్ట్రంలోని వనరులన్నీ అదానీకి దోచి పెట్టడానికి జగన్‌రెడ్డి తెగబడ్డారు. ఉభయకుశలోపరి అంటే ఇదే! వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలి వానకు కుప్పకూలుతుంది అంటారు. తండ్రి అధికారంలో ఉన్నప్పటి నుంచి అక్రమ సంపాదనకు అలవాటు పడిన జగన్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా తీసుకున్న నిర్ణయంతో వలలో చిక్కారు. గతంలో 'నేను అధికారంలో ఉన్నానా? లంచాలు తీసుకోవడానికి!' అని బుకాయించేవారు. ఇప్పుడు ఆయన అధికారంలో ఉన్నప్పుడే ఇది జరిగింది కనుక అదే బుకాయింపు కుదరదు. అయితే ఇంకో నాలుగు రోజులు పోతే ప్రజలు కూడా అలవాటు ప్రకారం ఈ కుంభకోణాన్ని మరచిపోవచ్చు. జగన్ ధీమా కూడా అదే. తన రాజకీయ ప్రత్యర్థి ఇంత కాలానికి తన చేతికి చిక్కినందున ఈ మహదావకాశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వదులుకుంటారా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. కేంద్ర పెద్దలను నొప్పించకుండా ఒప్పించగలిగితే తన రాజకీయ ప్రత్యర్థిని దెబ్బ కొట్టే అవకాశం చంద్రబాబుకు లభిస్తుంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడానికి అదానీ సిద్ధపడితే మాత్రం జగన్‌రెడ్డి సేఫ్ అవుతారు. ఈ కుంభకోణం కోల్డ్ స్టోరేజీకి చేరుతుందా? లేక జగన్ మెడకు చుట్టుకుంటుందా? అన్నది తేలాలంటే మరికొద్ది రోజులు వేచిచూడాల్సిందే!

ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ముతక భాషను వినీవినీ ప్రజలు విసుగు చెందారు. ఇప్పుడు అక్కడ ప్రభుత్వం మారిన తర్వాత బూతులు పోయాయి. నాటి ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తున్నాయి. ఆమోదయోగ్యం కాని భాషను ఇప్పుడు తెలంగాణలో వాడుతున్నారు. ప్రతిపక్షానికి పరిమితమవాల్సి వస్తుందని ఊహించని కేటీఆర్ వంటి వారిలో అసహనం ఏర్పడటం సహజం. సీనియర్ అధికారులను కూడా కేటీఆర్ వాడూ వీడూ అని సంబోధించడాన్ని ప్రజలు హర్షించడం లేదు. ఇలాంటి పద ప్రయోగాలు అహంభావానికి నిదర్శనంగా నిలుస్తాయి. అలాంటప్పుడు భాష విషయంలోగానీ, సవాళ్ల విషయంలోగానీ కేటీఆర్‌తో ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి పోటీపడకూడదు. ముఖ్యమంత్రి తన భాషను సరిదిద్దుకోవాలని, హుందాతనాన్ని ప్రదర్శించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అంబేద్కర్ బాటలో జన బాంధవి



సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురవుతున్న దళిత ఆదివాసీల గొంతుకగానే కాక అణిచివేతకు గురి అవుతున్న మహిళల పక్షాన దిక్సూచిగా, వెనుకబాటుకు గురవుతున్న తెలంగాణ ప్రాంత ప్రజల నాయకురాలిగా, పోరాటాలకు ఆలవాలంగా, ప్రగతిశీల నాయకురాలిగా చరిత్రలో నిలిచిన ఈశ్వరీబాయి సదా స్మరణీయురాలు.

నా చిన్ననాటి రోజుల్లో (1970 దశకం) మా నాన్న తరచూ ఒక మహిళా నాయకురాలి తెగువ గురించి చెబుతూ ఉండేవారు. ఆ రోజుల్లో ప్రచార మాధ్యమాలు అంతగా అభివృద్ధి చెందలేదు. కేవలం రేడియో, పత్రికలు మాత్రమే ఉండేవి. అయినా ఆ మహిళా నాయకురాలి పేరు మాత్రం తెలుగు వారి నోట తరచూ వినిపించేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ అన్యాయాలు జరిగినా స్వయంగా ఆ ప్రాంతాల్లో హాజరై బాధితులకు అండగా నిలిచేవారు ఆమె. ఆ మానవీయురాలు ఈశ్వరీబాయి. అన్యాయానికి గురవుతున్న వారి పట్ల తనదైన శైలిలో స్పందించి వారికి బాసటగా నిలిచిన ధీశాలి ఈశ్వరీబాయి. ఉద్యమాల ద్వారా హక్కులను సాధించుకోవాలనేది ఆమె అభిమతం. అందుకే తెలుగు నేలపై నాలుగు దశాబ్దాల పాటు ఉద్యమాలకు ఊపిరిగా నిలిచారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురవుతున్న దళిత ఆదివాసీల గొంతుకగానే కాక అణిచివేతకు గురి అవుతున్న మహిళల పక్షాన దిక్సూచిగా, వెనుకబాటుకు గురవుతున్న తెలంగాణ ప్రాంత ప్రజల నాయకురాలిగా పోరాటాలకు ఆలవాలంగా, ప్రగతిశీల నాయకురాలిగా చరిత్రలో నిలిచిన ఈశ్వరీబాయి సదా స్మరణీయురాలు.

నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఈశ్వరీబాయి స్త్రీలకు స్వేచ్ఛ సమానత్వం కరువైన రోజుల్లో ఒక దళిత మహిళగా పోరాట స్ఫూర్తిని కొనసాగించి మహిళా లోకానికి వెన్నుదన్నుగా నిలిచారు. మహిళా సాధికారత కొరకు పరితపించారు. స్వయంప్రతిపత్తి కొరకు మహిళా సంఘాలను స్థాపించి ఆర్థిక స్వావలంబన సాధించాలని ఉద్బోధించారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి సమాజంలో తల ఎత్తుకు తిరగాలని ఆమె అభిలషించారు. జీవితంలో వ్యక్తిగతంగా అనేక ఇబ్బందులను, ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. చిన్న వయసులోనే పెళ్లి కావడం, కొద్ది కాలానికే భర్త మరణించడంతో ఆమె ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. అయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో రాజకీయరంగంలో ప్రవేశించి రాణించడమే కాకుండా, ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. తాను ఎదుర్కొన్న సవాళ్లు మరెవరూ ఎదుర్కోరాదనే సంకల్పంతో మహిళల అభ్యున్నతిపై ఆమె ప్రత్యేక దృష్టి పెట్టారు. రాత్రి వేళల్లో సైతం ప్రతి గల్లీ తిరుగుతూ మహిళా చైతన్యానికి పాటుపడ్డారు. సమాజంలో వేళ్లూనుకున్న పురుషాధిక్య భావజాలాన్ని వ్యతిరేకిస్తూ మహిళల వెన్ను తట్టారు. స్త్రీ విద్య, వితంతు వివాహాలు, మహిళల ఆర్థిక ప్రగతి మహిళల పట్ల జరుగుతున్న అమానుషాలపై ఈశ్వరీబాయి తన జీవితాంతం కృషి చేశారు.

అణచివేతకు, అవహేళనలకు, అవమానాలకు, ఛీత్కారాలకు, అంటరానితనానికి గురికాబడుతున్న దళిత ఆదివాసి వర్గాల సమస్యలపై తనదైన శైలిలో స్పందిస్తూ పోరాటపటిమతో ఆ వర్గాల వారికి నాయకత్వం వహించిన మహిళా మణిగా ఈశ్వరీబాయి కీర్తిని సంపాదించారు. దళితులపై దమన కాండలు జరిగిన ప్రతి సందర్భంలోనూ వాటిని దీటుగా ఖండించి చట్టసభలో ప్రభుత్వాలను నిలదీసి బాధితుల హక్కులపై గళమెత్తిన ఈశ్వరీబాయి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు నిజమైన వారసురాలిగా నిలిచారు. ఆనాడు కంచికచర్ల కోటేశు సజీవ దహనం విషయంలో అసెంబ్లీని గడగడలాడించిన ఆమె పోరాట పటిమ విమర్శకుల మన్ననలను సైతం అందుకుంది. దళిత ఉద్యమాల సందర్భంలో నేటికీ ఆమె పేరు అనేక చోట్ల వినబడుతూనే ఉంది. దళితుల సామాజిక ఆత్మగౌరవాన్ని ద్విగుణీకృతం చేసే విధంగా, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే దిశగా, దళితుల సాధికారతను సాధించే లక్ష్యంతో ఈశ్వరీబాయి చేసిన కృషి ఎన్నదగినది. అంటరాని కులంలో వెలివాడలలో జన్మించిన ఈశ్వరీబాయి, అసెంబ్లీలో అగ్రవర్ణాల ప్రతినిధులను గడగడలాడించిన అపర కాళికగా, ఫైర్ బ్రాండ్‌గా కీర్తిప్రతిష్ఠలు అందుకున్నారు. ఆధిపత్య కులాల దమన నీతులను, అణచివేత ధోరణులను, అణగారిన వర్గాల వారిపై పెత్తనాన్ని ఎండగట్టిన దళిత మహిళా మణిమకుటం ఈశ్వరీబాయి. కష్టాలలో, ఇబ్బందులలో, అవసరాల్లో ఉన్న నిరుపేద దళితులను అక్కున చేర్చుకొని వారి అభ్యున్నతే ధ్యేయంగా పనిచేశారు. దళితవర్గాల హక్కుల కోసం నిర్విరామంగా కృషి చేసిన విదుషీమణి ఈశ్వరీబాయి. అంబేద్కర్ ఆలోచనల నుండి ఆవిర్భవించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకురాలుగా రాజకీయాలలోకి ప్రవేశించి, అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహించి చట్టసభలలో దళితుల హక్కులు, సంక్షేమం, ఆ వర్గాల సమస్య పరిష్కారాలకు ఆమె తన శక్తి యుక్తులను వెచ్చించారు. నిరుపేద వర్గాలకు పక్కా గృహాల నిర్మాణం, బంజరు భూముల పంపిణీ, ప్రభుత్వపరంగా వారికి రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వాలపై పోరాట మార్గంలో విజయం సాధించారు.

నిజాం పాలనలో అనేక కష్టాలు పడ్డ తెలంగాణ సమాజం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్నిటా వెనుకబాటుకు గురవుతున్నందుకు నిరసనగా 1969లో ప్రజ్వరిల్లిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో ఈశ్వరీబాయి కీలక భూమిక పోషించారు. నాడు ఆవిర్భవించిన తెలంగాణ ప్రజా సమితిలో ఆమె ఉపాధ్యక్షురాలిగా పోరాటాలకు నాయకత్వం వహించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి జిల్లాలోనూ పర్యటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. అప్పటి పాలకుల కారణంగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గణాంకాలతో సహా వివరించి, శాసనసభలో ఆంధ్ర ప్రజాప్రతినిధులలో సైతం ఆలోచనను రేకెత్తించారు. అప్పట్లో అగ్రనేతలు అందరినీ అరెస్టు చేసిన సందర్భంలో మహిళా నేత కారణంగా అరెస్టు కాకపోవడంతో ఈశ్వరీబాయి ఆ సందర్భాన్ని నూటికి నూరు శాతం తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా ఉంచేందుకు స్ఫూర్తిమంతమైన పోరాట పంథా ప్రదర్శించారు. తెలంగాణ సాధించుకున్న తరుణంలో ఈశ్వరీబాయి సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించడం ముదావహం. 1918 డిసెంబర్ ఒకటవ తేదీన చిలకలగూడలో బలరామస్వామి, రాములమ్మ దంపతులకు జన్మించిన ఈశ్వరీ బాయి, 1991 ఫిబ్రవరి 24న తుది శ్వాస విడిచారు. వంద సంవత్సరాల క్రితం జన్మించిన ఒక దళిత మహిళ అన్ని ప్రతిబంధకాలను అధిగమించి మహిళా నేతగా, దళిత వర్గాల ప్రతినిధిగా స్ఫూర్తిమంతమైన జీవితాన్ని గడిపిన తీరు నేటి తరానికి ఆదర్శం.

• నేలపూడి స్టాలిన్‌బాబు

(నేడు ఈశ్వరీబాయి జయంతి)



- అసౌకర్యాల మధ్య విద్యార్థుల అవస్థలు
- 'సంక్షేమం'పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- ప్రశ్నార్థకంగా ఆరోగ్యం, భద్రత
- కడుపు నొప్పి, జ్వరం, మానసిక సమస్యలకు అందని వైద్యం
- హాస్టల్‌లో ఉండలేక, ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం
- నాసిరకంగా భోజనం.. తుప్పు పట్టిన బెడ్లు, కిటికీలు
- అద్దెభవనాల్లో 500మంది ఉండాల్సిన చోట వెయ్యి మందికిపైగా విద్యార్థులు
- పారిశుధ్య కార్మికుల కొరతతో అపరిశుభ్రంగా స్నానాలగదులు, మరుగుదొడ్లు

గురుకులం.. కలకలం..!

ములుగులోని గిరిజన బాలుర వసతిగృహం ఇరుకుగదిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బెడ్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రస్తుతం గురుకులాల్లో నెలకొన్న పరిస్థితులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. విద్యార్థుల సంక్షేమం గురించి అధికారులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని, విద్యార్థులకు ఆరోగ్యం, భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జ్వరం బారిన పడినా.. కడుపు నొప్పి వచ్చినా.. మానసిక సమస్యలు ఉత్పన్నమయినా పట్టించుకునేవారు ఉండక.. ఓదార్చి ధైర్యం చెప్పే వారు లేక విద్యార్థులకు హాస్టల్ అంటే హడలిపోతున్నారు. మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నామనే ఆందోళనతో ఆత్మహత్యలకు కూడా వెనకాడకపోవడం అందరిలోనూ కలకలం రేపుతోంది. వీటికి తోడు నాణ్యత లేని భోజనం.. శుభ్రం చేయని మరుగుదొడ్లు.. తుప్పు పట్టిన బెడ్లను చూస్తే విద్యార్థులకు చదవాలనే ఆసక్తి సన్నగిల్లుతోంది. పారిశుధ్య కార్మికులు లేకపోవటంతో హాస్టల్ గదుల దుర్వాసన నుంచి వారికి విముక్తి దొరకడం లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు గురుకులం చదువంటే ఇష్టం.. వసతులు చూస్తే కష్టంగా మారిందనే చర్చ జరుగుతోంది.

భద్రతపైనే భయం..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 250కి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు ఉన్నాయి. వీటిలో సిబ్బంది నిర్లక్ష్యంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైంది. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకు దగ్గరికి కావాలనే విద్యార్థుల ఆశపై అసౌకర్యాలు నీళ్లు చల్లుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాలా వరకు అద్దె భవనాల్లోనే గురుకులాలను ఏర్పాటు చేశారు. చాలా చోట్ల బీఆర్ఎస్ నేతల ఇళ్లను, భవనాలను గురుకులాలను అద్దెకు ఇచ్చి..



జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ సంక్షేమ హాస్టల్‌లో తుప్పుపట్టిన బెడ్లు

కనీస సౌకర్యాలు లేకపోయినా రూ.50వేల నుంచి రూ.1లక్షకు పైగా నెలనెల అద్దెలు చెల్లించారని సమాచారం. ఇప్పటికి 8 నెలలుగా అద్దెలు చెల్లించకపోవటంతో భవన యాజమానులు కనీస వసతులు కల్పించటం లేదు. పాడైన మరుగుదొడ్లను, బాత్‌రూమ్‌లు, కిటికీలకు మరమ్మతులు చేయించడం లేదు. తమకు అద్దె రావటం లేదని, పెట్టుబడి ఎక్కడి నుంచి పెట్టాలంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. దీంతో అసౌకర్యాల మధ్య విద్యార్థులు గురుకుల విద్యను అభ్యసిస్తున్నారు. ఇక ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో ఇంతకంటే దారుణంగా పరిస్థితులు ఉండటం గమనార్హం. కిటికీలు, తలుపులు కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో పాములు, తేళ్లు, విషకీటకాలు గదుల్లోకి, ప్రాంగణాల్లోకి వస్తుండటంతో పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ మండల కేంద్రంలో 1995లో నిర్మించిన సోషల్ వెల్ఫేర్ గురుకులంలో సుమారు 700మంది విద్యార్థులు ఉంటున్నారు. తుప్పు పట్టిన బెడ్స్, విరిగిపోయిన కిటికీలకు తోడు ధ్వంసమైన మరుగుదొడ్లతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బాత్‌రూమ్‌లు కూడా సరిగా లేకపోవటంతో పిల్లలు స్నానాలకు నరకం చూస్తున్నారు. 10వ తరగతి వరకు 500మంది పిల్లలుఉండేలా గురుకులాను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ చదివే పిల్లలకు కూడా గురుకులంలో అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది. అయితే వీరికి ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యం కల్పించటం లేదు. 10వ తరగతి వరకు విద్యార్థులకు కేటాయించిన భవనాల్లోనే సర్దుబాటు చేస్తున్నారు. దీంతో 500మంది ఉండాల్సిన భవనాల్లో 800 నుంచి వెయ్యి మందికి వరకు సర్దుబాటు చేయడంతో తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరుగుదొడ్లు, తాగునీరు, స్నానాలకు నీరు సరిపడక అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులను అన్ని గురుకులాల్లో నియమించలేదు. కొన్ని చోట్ల గ్రామ పంచాయతీ కార్మికులనే వినియోగిస్తున్నారు. దీంతో హాస్టళ్లు అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారుతున్నాయి. చలికాలం మొదలైనా విద్యార్థులందరికీ బెడ్‌షీట్స్ అందలేదు. దీంతో తలుపులేని కిటికీల నుంచి వచ్చే చలిగాలికి తుప్పు పట్టిన బెడ్స్‌పై భయం భయంగా నిద్రపోవాల్సి వస్తోంది. అలాగే చాలాహాస్టళ్లలో నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో రాత్రివేళల్లో బయటి వ్యక్తులు హాస్టళ్లలోకి వస్తున్న సంఘటనలున్నాయి. ఇది విద్యార్థులకు రక్షణ లేదనడానికి నిదర్శనమన్న విమర్శలున్నాయి.



మహబూబాబాద్ జిల్లా మరిపెడ ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో నేలపై పడుకున్న విద్యార్థులు



హనుమకొండ జిల్లా ఎల్లాపూర్ ఎస్సీ బాలుర హాస్టల్ గది గోడలకు చెమ్మ

నాసిరకంగా భోజనం

హాస్టల్ విద్యార్థులకు చాలావరకు నాసిరకం భోజనం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. భోజనం అందించేందుకు ఒక్కో హాస్టల్‌లో ఒక్కో విధానాన్ని అమలు చేస్తున్నారు. బియ్యాన్ని, విజయ పాలను ప్రభుత్వమే సరఫరా చేస్తుండగా, కూరగాయలు, నాన్‌వెజ్, కోడిగుడ్లు, ఇతర నిత్యావసరుకులు అందించేందుకు వేర్వేరుగా కాంట్రాక్టు

» మిగతా 6వ పేజీలో...



సండే స్పెషల్ SUNDAY SPECIAL

పెద్దబాడిసె.. మూగబోయే!

- యంత్రాల రాకతో బతుకులు తారు మారు
- పనిలేక ఇతర రంగాల వైపు చూపు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

8

దయనీయ స్థితిలో వడ్రంగులు



వడ్రంగులు.. ఒకప్పుడు రైతులకు చేదోడువాదోడుగా ఉండే ఓ నేస్తం. తొలకరి ప్రారంభమైందంటే చాలు అన్నదాతలు కాడి, నాగలి, గుంటుక, దంతె లాంటి వ్యవసాయ పరికరాలు తయారు చేయించుకునేందుకు వడ్రంగుల చుట్టూ తిరిగేవారు. ఒక్కోసారి రోజుల తరబడి వారిచ్చే పరికరాల కోసం వేచిచూసేవారు. నాడు అంత బిజీగా కులవృత్తిని నిర్వహించిన వడ్రంగులు.. యాంత్రీకరణ పుణ్యమా అని ఇపుడు దుర్భర జీవితం గడుపుతున్నారు. ఉపాధి కోసం నేటి తరం వారిలో కొందరు పట్టణాలకు పయనమైతే.. ఇంకొందరు తమ వృత్తిపరమైన యాంత్రీకరణను అందిపుచ్చుకుంటున్నారు. మిగిలిన వారు అదే కులవృత్తిని కొనసాగిస్తూ గ్రామాల్లో గడుపుతున్నారు. అయితే పరిస్థితుల ప్రభావంపై తమపై తీవ్రంగా పడిందని.. ఎన్నో కుటుంబాలు సరైన ఉపాధికి నోచుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వాలు కుల వృత్తులకు చేయూతనందిస్తామని చెప్పి మొండి చేయి చూపాయని.. ప్రస్తుత ప్రభుత్వమైనా తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

- దేవరుప్పుల, ఆంధ్రజ్యోతి



కేయూలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి, నాగరాజు, ఎంపీ కావ్య

కేయూ సమగ్రాభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం..

- ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి, నాగరాజు, ఎంపీ కావ్య
- 23వ తేదీన మళ్లీ వర్సిటీలో సమీక్షలు నిర్వహిస్తాం..
- కేయూలో విలేకరుల సమావేశంలో వెల్లడి
- విద్యార్థులతో కలిసి మెస్‌లో భోజనం

6

బీఆర్ఎస్ ఉద్యమం వల్లే కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు

కాంగ్రెస్ పార్టీ పాత్ర శూన్యం

మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్



కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

కాజీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు కోసం నిరంతరం ఉద్యమాలు చేసింది బీఆర్ఎస్సేనని, ఇందులో కాంగ్రెస్ పాత్ర శూన్యమని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ మంజూరును కాంక్షిస్తూ శనివారం కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట వినయ్‌భాస్కర్ మీడియాతో మాట్లాడారు.

రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ డిమాండ్ రాష్ట్ర విభజనలో పొందుపరిచి, ఆ డిమాండ్‌కు జీవం పోసిందే బీఆర్ఎస్ అని గుర్తుచేశారు. బీజేపీ నేతలు కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ ఇవ్వలేమని ఎన్నోసార్లు ప్రస్తావించారన్నారు. అయినా ఎక్కడా నిరాశ చెందకుండా ఉద్యమిం చామని ఆయన తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల్లో ఏరాష్ట్రానికి చెందిన వ్యక్తి రైల్వే మంత్రిగా ఉంటే రైల్వే పరిశ్రమలు వారే తీసుకెళ్లేవారన్నారు. కాజీపేటలో రైల్వే డివిజన్, కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్ తయారీ పరిశ్రమల స్థాపనకోసం 2009 నుంచి మొన్నటి వరకు రైల్వే జీఎంలు, డీఆర్ఎంలను కలిసి విజ్ఞప్తులు ఇస్తూ పోరాటం చేశామని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పత్రికల్లో వచ్చిన పేపర్ క్లిప్పింగ్‌లు చూపించారు. ఏదో ఒకరోజు కోచ్ ఫ్యాక్టరీ సాధిస్తామన్న నమ్మకంతోనే అయోధ్యపురంలో 160 ఎకరాల స్థలాన్ని సేకరించామని, ఇప్పుడు అందు లోనే కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు సాధ్యమైందన్నారు. స్థల మంజూరు కోసం అప్పటి సీఎం కేసీఆర్ చొరవ తీసుకోవడం వల్లే అది సాధ్యమైందన్నారు. కోచ్‌ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాల కోసం మరో పోరాటానికి సిద్ధం అవుతామని తెలిపారు. కాజీపేట బోడగుట్టకు ఆర్వోబీ కోసం కృషి చేస్తామని చెప్పారు.

అనంతరం కోచ్‌ఫ్యాక్టరీ సాధనకోసం దీక్ష చేపట్టిన కోచ్‌ఫ్యాక్టరీ సాధన సమితి కన్వీనర్ సుంచు కృష్ణను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్‌లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, సంకు నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్, సుంచుకృష్ణ, గబ్బెట శ్రీనివాస్, పి. సురేశ్ కుమార్, శిరుమళ్ల దశరథం, కాటాపూర్ రాజు, దువ్వ కనుకరాజు, పాలడుగుల శివకుమార్, బెదరకోట రంజిత్, ఎం.డి. అఫ్జల్, కొండ్ర శంకర్, ఎం.డి. సోని, ఎస్డీ సర్వర్, ఎస్కే మహమూద్, బరిగెల వినయ్, మిట్టపల్లి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రావు



వసతి గృహాల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం

- రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ విశ్వేశ్వర్‌రావు
- హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం

6

దేశాభివృద్ధిలో నిట్ కీలక భూమిక

- డీఆర్‌డీవోలోనూ భాగస్వామ్యం
- క్షిపణి వ్యవస్థలో ప్రపంచలోనే భారత్ అగ్రగామి
- కొత్త ఆవిష్కరణలతో శక్తివంతంగా రక్షణ వ్యవస్థలు
- సరికొత్త పరిశోధనల్లో డీఆర్‌డీవో ప్రధాన పాత్ర
- డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్
- ఘనంగా వరంగల్ నిట్ 22వ స్నాతకోత్సవం
- 1,875 పట్టభద్రులకు డిగ్రీల ప్రదానం

8

ప్రసంగిస్తున్న డీఆర్‌డీవో డాక్టర్ కామత్



స్నాతకోత్సవ హాల్ బయట పట్టాలతో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

- జనగామ పోరుగడ్డ బిడ్డకు దక్కిన గౌరవం
- కడు పేదరికం నుంచి అత్యున్నత స్థాయికి
- జిల్లాలో వెల్లివిరిసిన ఆనందం



జనగామ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం నియమితులు కావడంపై జిల్లావాసుల్లో ఆనందం నెలకొంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా ఎం.మహేందర్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా డిసెంబర్ 3తో ఆయన పదవీ కాలం పూర్తి కానుండడంతో ప్రభుత్వం కొత్త చైర్మెన్ నియామకం కోసం నోటిఫికేషన్ ఇవ్వగా ఈ నెల 20 వరకు 45 అప్లికేషన్లు వచ్చాయి. రిటైర్డ్ ఐఏఎస్‌లు, వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు ఈ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోగా జనగామ జిల్లాకు చెందిన బుర్రా వెంకటేశం పేరును సీఎం రేవంత్‌రెడ్డి ఎంపిక చేసి గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపారు. కాగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సెక్రటరీగా ఉన్న వెంకటేశం దరఖాస్తుకు గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఈ నెల 4 నుంచి వెంకటేశం టీజీపీఎస్సీ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

నిరుపేద కుటుంబం నుంచి..

నిరుపేద వ్యవసాయ కుటుంబం నుంచి బుర్రా వెంకటేశం తన జీవన ప్రస్థానాన్ని ప్రారంభించారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తన తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. తల్లి కూలీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తుండగా తన విదాభ్యాసంలో ఇవేవీ అడ్డంకులుగా చూడకుండా తన లక్ష్యసాధన కోసం ఆయన ఎంతగానో శ్రమించి చివరకు తన కోరికను నెరవేర్చుకున్నారు. సాంస్కృతిక కార్యదర్శిగా ఉన్న సమయంలో తన స్వగ్రామ మైన జనగామ మండలం ఓబుల్ కేశ్వాపురంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని గ్రామస్తుల సహకారంతో నిర్మించి ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు.

నేపథ్యమిది..

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్‌గా నియమితులైన బుర్రా వెంకటేశం స్వగ్రామం జనగామ మండలం ఓబులకేశ్వాపూర్. ఆయన డిగ్రీ హైదరాబాద్ చిక్కడపల్లి లోని అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో కొనసాగింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన వెంకటేశం చదువులో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతూ అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. 1995 గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1వ ర్యాంకు సాధించి టాపర్‌గా నిలిచారు. 1996లో ఆదిలాబాద్ ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేయగా 1996 చివర్లో తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా, 1998లో రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా, 1999లో వరంగల్ మునిసిపల్ కమిషనర్‌గా, 2001లో చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా, 2003లో గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం గవర్నర్ సెక్రటరీగా, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు కొనసాగిస్తున్నారు.

కేయూ సమగ్రాభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం

- ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి, నాగరాజు, ఎంపీ కావ్య
- కేయూలో విలేకరుల సమావేశంలో వెల్లడి
- విద్యార్థులతో కలిసి మెస్‌లో భోజనం

కేయూ క్యాంపస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రెండో అతిపెద్ద వర్సిటీ, ప్రఖ్యాతి గాంచిన కాకతీయ యూనివర్సిటీ సమగ్రాభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్యలు స్పష్టం చేశారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాటాలు చేశారని, వారు త్యాగధనులని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన తప్పులను ప్రశ్నించిన విద్యార్థులను ఉక్కుపాదంతో అణచివేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీల్లో నెలకొన్న అన్ని సమస్యలపై వీసీ, రిజిస్ట్రార్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులతో సమగ్రమైన అధ్యయనం చేపట్టినట్లు వెల్లడించారు. వర్సిటీ అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు వర్సిటీ అభివృద్ధిపై డీపీఆర్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు. వర్సిటీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. వర్సిటీ అభివృద్ధి కోసం ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ సమీక్ష చేయడం రాష్ట్ర చరిత్రలోనే ప్రథమమన్నారు. వర్సిటీలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని నాయిని ధ్వజమెత్తారు. డిసెంబరు 23న కేయూలో సమస్యలు, పరిష్కారాలపై వర్సిటీ అధికారులతో సమీక్షిస్తామని వివరించారు. విద్యార్థులు తమకు ఏ సమస్యలున్నా తమను సంప్రదించాలని కోరారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. వర్సిటీలో పుష్కలమైన వనరులన్నాయని, వాటిన్నింటినీ విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మూడు నెలల్లో వర్సిటీల స్థితిగతులను మారుస్తామని చెప్పారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. వర్సిటీలో భూఆక్రమణలు, ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించామని వెల్లడించారు. వర్సిటీ అవసరాల కోసం 10 ఎకరాల భూమి అవసరం అవుతోందని వర్సిటీ అధికారులు కోరినట్లు తెలిపారు. న్యాక్ ఏ గ్రేడింగ్ కాపాడటంతో పాటు, స్పోర్ట్స్ అభివృద్ధికి పాటుపడుతామని అన్నారు. వర్సిటీలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో నగర అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. వర్సిటీలో నూతన హాస్టళ్లతో పాటు ఇతర సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. కేంద్రం నుంచి విద్యార్థులకు రావాల్సిన పథకాలను పునరుద్ధరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అసమర్థ విధానాలు కేంద్రనిధులను వాడుకోలేదని విమర్శించారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకుని ప్రజలకున్యాయంచేస్తోందని చెప్పారు.

వర్సిటీ కమిటీ హాల్‌లో డీపీఆర్‌పై చర్చ

సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో వీసీలో జరిగిన సమావేశంలో వర్సిటీ అభివృద్ధిపై డీపీఆర్‌లను సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు వర్సిటీ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్యలతో వీసీ, రిజిస్ట్రార్, డీన్లు, వర్సిటీ పరిపాలన అధికారులు సిద్ధం చేసిన డీపీఆర్‌ను ప్రదర్శించారు. వర్సిటీ విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, సౌకర్యాలతో పాటు, భవిష్యత్‌లో వర్సిటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన సమగ్ర వివరాలను వర్సిటీ అధికారులు డీపీఆర్‌లో ప్రదర్శించారు. వర్సిటీలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది లేకపోవడంతో నాణ్యత ప్రమాణాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మాయిలకు సరిపడా హాస్టళ్లు లేవని, అలాగే స్పోర్ట్స్‌లో వర్సిటీలో చాలా వెనుకబడి ఉందని గుర్తించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సుల కల్పన, ఉద్యోగ అవకాశాలు, రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టాల్సిన అవశ్యకతను డీపీఆర్‌లో తెలిపారు. డీపీఆర్‌లో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, డీన్లు ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, గాదె సమ్మయ్య, రాంనాథ్ కిషన్, హన్మంతు, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ఈసీ మెంబర్లు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, బొద్దిరెడ్డి రమారెడ్డి, పుల్లూరి సుధాకర్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ పాల్గొన్నారు.



వర్సిటీ క్యాంపస్‌లోని కామన్ మెస్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య

విద్యార్థులతో కలిసి భోజనం

వర్సిటీ క్యాంపస్‌లోని కామన్ మెస్‌లో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్యలు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రోజు విద్యార్థులు తీసే ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. కామన్ మెస్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు వర్సిటీ హాస్టల్స్‌లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలతో పాటు ఆహార పదార్థాల వివరాలను వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ఎమ్మెల్యే, ఎంపీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు మట్టెడ కుమార్, పాషా ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- సమీక్షలో వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. ఈ విషయమై శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అటవీశాఖ అధికారి అనుజ్ అగర్వాల్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే విజయోత్సవాలను ప్రజాప్రతినిధుల సహకారంతో నిర్వహించాలన్నారు. డిసెంబరు 1న తెలంగాణ ప్రభుత్వం ఈ యేడాదిలో సాధించిన లక్ష్యాలపై విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత, ఇంటర్, డిగ్రీ స్థాయిలో వక్తృత్వ, వ్యాస రచన పోటీలు, క్రీడల శాఖ ద్వారా 2కే రన్ నిర్వహించాలన్నారు. 2న ఆరోగ్య శిబిరాలు, 3న జీడబ్ల్యూఎంసీ, నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపాలిటీలలో అర్బన్ డే ఘనంగా నిర్వహించాలని, పారిశుధ్య కార్మికులను సన్మానించాలని, కార్మికులకు పీపీఈ కిట్లు అందజేయాలని అన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాలన్నారు. 4వ తేదీన అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు గ్రీన్‌వాక్, 5న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల ప్రారంభం, 6న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం, 244 సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన ఉంటుందన్నారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లో ఘనంగా వేడుకలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో డీఈవో జ్ఞానేశ్వర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, డీపీవో కల్పన, డీవైఎస్‌వో సత్యవాణి, అదనపు కమిషనర్ జోనా, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను భద్రపర్చిన గోదాములను కలెక్టర్ సత్యశారద శనివారం తనిఖీచేశారు. గోదాములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణపటిష్ఠంగా ఉండాలని సూచించారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి సమష్టి బాధ్యత

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక
- ఘనంగా ప్రారంభమైన ఐఏఎల్ ద్వితీయ రాష్ట్ర మహాసభలు

వరంగల్ లీగల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠమైనదని, దాని పరిరక్షణ అందరి సమష్టి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక అన్నారు. శనివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదట మహాసభల ప్రాంగణంలో ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల మాధవరావు ఐఏఎల్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ప్రారంభమైన మహాసభకు ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక 'భారత రాజ్యాంగం ఉద్దేశాలు' అనే అంశంపై మాట్లాడారు.

ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం సిద్ధించాయన్నారు. ఎంతో మంది మహానుభావులు దేశాన్ని, రాజ్యాంగాన్ని ముందుకు నడిపించారని అన్నారు. భారత రాజ్యాంగం 75 ఏళ్లు గడిచినా ఇంకా పటిష్ఠంగా ఉందని, సాంఘిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం లక్ష్యాలుగా నమ్మకం, వ్యక్తి స్వేచ్ఛ రాజ్యాంగం గొప్పతనమని అన్నారు. రాజ్యాంగం అమలులో కొన్ని వైఫల్యాలు ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజల హక్కులను కాపాడుతున్నదని అన్నారు. రాజ్యాంగం పీఠికలోని లక్ష్యాలను అమలు చేయడం, అందరికీ సమాన హక్కులు అందించడంలో సమస్యలను అధిగమిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న అనేక హక్కులు, విశ్వాసాలను గుర్తించినప్పుడు వాటి పరిక్షణలో న్యాయవాదులు ముందంజలో ఉండాలన్నారు. అలాగే దేశ పౌరులుగా ప్రజలు హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తెరగాలని ఆయన సూచించారు. సోషల్ మీడియా వచ్చాక ప్రతీ వ్యక్తిగత జీవితం తన చేతులో లేకుండా పోయిందని జస్టిస్ నగేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరు, మరొకరి గురించి ఏదైనా మాట్లాడవచ్చుననే స్థాయికి భావ ప్రకటన స్వేచ్ఛ చేరుకుందని అన్నారు. ప్రజలు తమ హక్కులనే గుర్తిస్తున్నారేకానీ బాధ్యతలను నిర్వర్తించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశం తనకు ఏమి ఇచ్చిందని ఆలోచించడం తప్ప.. దేశానికి తానేమి ఇచ్చానని ఆలోచించడం లేదన్నారు. అందుకే రాజ్యాంగ పరిరక్షణకు ప్రజల హక్కుల రక్షణ కోసం న్యాయవాదులు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆయన ఉద్బోధించారు.

తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఐఏఎల్ ఒక ప్రతిష్ఠాత్మక సంస్థ అని, ఎంతోమంది పోరాటాల ఫలితంగా ఏర్పడిందని అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ తన సందేశం ఇస్తూ.. న్యాయవాదుల సమస్యలపై రానున్న రోజుల్లో కలిసి ముందుకు సాగుతామన్నారు. ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.మురళీధర, రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల మాధవరావు, రిసెప్షన్ కమిటీ చైర్మన్ దుస్సా జనార్దన్, ఐఏఎల్ నాయకులు, న్యాయవాదులు ఏపీ కృష్ణారావు, బొమ్మగాని శ్రీనివాస్, ఉదయ్‌భాస్కర్, భీమనాథం, శ్రీనివాస్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమేష్‌బాబు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌గౌడ్, ఐఏఎల్ నాయకులు ఎం.ఆదిరెడ్డి, జయ శ్రీనివాస్, ఓరుగంటి శేషగిరిరావు, తాటికొండ కృష్ణమూర్తి, మాధవరావు, లతీఫ్, రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఏఐబీఈ పరీక్షల్లో ముందంజలో నిలిచిన ఐదుగురిని జస్టిస్ నగేష్ శాలువాలతో సత్కరించి క్రిమినల్ లా పుస్తకాలను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి నగేష్

గురుకులం.. కలకలం..!

(5వ పేజీ తరువాయి)

అప్పగించటం, వాటిపై పైఅధికారులు పర్యవేక్షణ లేకపోవటంతో నాసిరకం సరుకులు హాస్టళ్లకు చేరుతున్నాయి. కొన్ని గురుకులాలకు ఒకే కాంట్రాక్టర్ నుంచి సరుకులు వస్తున్నట్టు సమాచారం. అయితే సరుకులన్నీ ఒకేసారి రావడంతో అవి స్టోర్ రూమ్‌లో ఉండి ముక్కిపోతున్నాయని, కొన్ని చోట్ల వాటినే వండి ఎడుతుండటంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు.

మానసిక ఒత్తిడికి ఓదార్పేదీ?

హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు సవాల్‌గా మారుతున్నాయి. హాస్టల్‌లో తినే ఆహారం పడకనో.. బయట నుంచి తెచ్చుకున్న తిన్న ఫుడ్ వికటించో రాత్రి వేళ కడుపు నొప్పి, జ్వరం వస్తే పట్టించుకునే వారు ఉండటం లేదు. కనీసం డాక్టర్ల వద్దకు తీసుకెళ్లేందుకు గురుకులాల్లో సిబ్బంది అందుబాటులో ఉండకపోవటంతో రాత్రంతా నొప్పితో బాధపడాల్సిందేనని విద్యార్థుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. తెల్లారిన తరువాత తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలున్నాయి. క్లిష్ట పరిస్థితుల్లో వైద్యం అందక కొన్ని చోట్ల విద్యార్థులు మృతి చెందుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఇక మానసిక సమస్యలు ఎదుర్కొనే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు గురుకులాల్లో సైకాలజిస్టులను ప్రభుత్వం నియమించ లేదు. దీంతో చాలాచోట్ల గురుకుల భవనాలపైకి ఎక్కి ఆత్మహత్యలుచేసుకున్న సంఘటనలున్నాయి.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థ లేదు. ఈ గురుకులాలకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నా.. పరిపాలనపైనే వారు ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆదేశాలతో హాస్టళ్లపై కలెక్టర్లు దృష్టి పెడుతున్నారు.



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ సంక్షేమ హాస్టల్‌లో తుప్పుపట్టిన కిటికీ

అయితే ప్రత్యేకంగా హాస్టళ్ల పర్యవేక్షణ వార్డెన్లు, హెచ్‌ఎంలపైనే ఉంటుంది. బీసీ గురుకులాలను పర్యవేక్షించేందుకు ఒక నోడల్ అధికారిని మాత్రమే ప్రభుత్వం నియమించింది. ఒక్కరు ఎన్ని గురుకులాలను పర్యవేక్షించగలరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సంక్షేమశాఖ అధికారులకు గురుకులాలపై అధికారం లేకపోవటంతో పర్యవేక్షణ కరువవుతోంది. దీంతో హాస్టల్ వార్డెన్లు, ప్రిన్సిపాల్స్ పైనే భారం పడుతోంది. చాలా చోట్ల వారు కూడా చేతులెత్తేస్తుండటంతో గురుకులాలు సమస్యల వలయాలుగా మారుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో..	
బీసీ గురుకులాలు	36
ఎస్సీ గురుకులాలు	33
మైనారిటీ గురుకులాలు	16
ఎస్టీ గురుకులాలు	42

ఆందోళన కలిగిస్తున్న సంఘటనల్లో కొన్ని..

- జూన్ 23న జనగామ జిల్లా చిల్పూరులో కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని వర్షిణి(14) తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక, హాస్టల్‌లోనే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినసంఘటన కలకలం రేపింది.
- జూలై 11వ తేదీన కేసముద్రంలోని గిరిజన సంక్షేమ హాస్టల్‌కు చెందిన తొమ్మిదో తరగతికి చెందిన పవిత్ర అనే బాలిక ప్రమాదవశాత్తు హాస్టల్ భవనంపై నుంచి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి.
- ఆగస్టు 9వ తేదీన ములుగులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కార్తీక తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది.
- ఆగస్టు 14న ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లిలోని ఆశ్రమ పాఠశాలలో ముకేష్ అనే విద్యార్థి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వార్డెన్, హెచ్‌ఎంల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి.
- అక్టోబరు 27న అర్ధరాత్రి భూపాలపల్లి జిల్లా చిట్యాలమండలంలోని ప్రభుత్వం గర్ల్స్ మోడల్ స్కూల్ హాస్టల్‌లోకి అర్ధరాత్రి ఓ యువకుడు చొరబడ్డారు. అమ్మాయిల అరుపులతో ఆ యువకుడు తిరిగి వెళ్లిన ఘటన భద్రత లోపాన్ని ఎత్తిచూపుతోందన్న చర్చ జరుగుతోంది.
- నవంబరు 14వతేదీన ములుగు జిల్లా బండారుపల్లి గురుకులంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న రాజేష్ అనే విద్యార్థి గడ్డి మందు తాగి ఆత్మహత్మకు పాల్పడటం కలకలం రేపింది. మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలుస్తోంది.

వసతి గృహాలలో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం

- రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ విశ్వేశ్వర్‌రావు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ విశ్వేశ్వర్‌రావు అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలలోని పరిస్థితులను అధ్యయనం చేసేందుకు విశ్వేశ్వర్‌రావు శనివారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అధికారులను వసతి గృహాలలోని పరిస్థితులను, వసతి గృహాలలో పిల్లలకు శుభ్రమైన వాతావరణం, పదార్థాలు నిల్వ ఉండే పరిస్థితులను, తాగునీరు, వంట వండేటప్పుడు తీసుకుంటున్న జాగ్రత్తలపై అడిగి తెలుసుకున్నారు. ఇంకా మెరుగ్గా ఉండటానికి ఏం చర్యలు తీసుకోవాలని అడిగారు.

ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలోని చాలా వసతి గృహాలలో కట్టెలపొయిమీదనే వంట చేస్తున్నారని, ప్రత్యేకమైన వంట గదిని ఏర్పాటుచేసి వంట గ్యాస్ సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. హాస్టళ్లలోని ఫుడ్ కమిటీలలో విద్యార్థులను కూడా మెంబర్లుగా నియమించినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య వసతి గృహాలలోని పరిస్థితులను విద్యా కమిషన్ మెంబర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాంరెడ్డితో పాటు ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో షైన్ విద్యార్థుల ప్రతిభ


సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శన ఇస్తున్న మణిచందన

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో షైన్ విద్యా సంస్థల విద్యార్థులు పలు ఎగ్జిబిట్లు రూపకల్పన చేసి ప్రదర్శించారు. రామ్‌నగర్ బ్రాంచ్ విద్యార్థిని కాలేరు మణిచందన గ్రీన్ హైడ్రోజన్ నమూనాను రూపొందించింది. నీటి నుంచి హైడ్రోజన్‌ను వేరు చేసి ఇంధనంగా ఎలా వినియోగించవచ్చునో ఈ ప్రాజెక్టు ద్వారా మణిచందన వివరించింది. అలాగే 7వ తరగతికి చెందిన సిరిదీప సోలార్ డ్రిప్ ఇరిగేషన్ నమూనాను రూపొందించి ప్రదర్శించింది. 7వ తరగతికి చెందిన ఆద్య, అక్షయ జంతువుల నుంచి పంటలను రక్షించుకునే స్మార్ట్ క్రాప్ ప్రొటెక్షన్ సిస్టమ్‌ను రూపొందించారు. కాసుల జశ్వంత్ స్మార్ట్ పెస్టిసైడ్ స్ప్రేయర్, ప్రీతమ్ హైడ్రోపోనిక్ సిస్టమ్, లహరి ఇండియాలో రోడ్ల నిర్మాణంలో కొత్త పద్ధతి అనే నమూనాను రూపొందించి జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు కేవీ విద్యార్థి


రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సతీష్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 30: రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట కేవీ పబ్లిక్‌స్కూల్ సల్ల వినూత్న ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ దాసి శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం రాష్ట్రస్థాయి పోటీల కు ఎంపికైన వినూత్నతోపాటు గైడ్ టీచర్ ఎం.రమేష్‌బాబు, సైన్స్ టీచర్ దివ్యను ఆయన అభినందించారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో అత్యుత్తమ నమూనాను రూపొందించి డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని వినూత్న అందుకున్నారన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం

రెండేళ్లుగా అద్దె చెల్లించడంలేదని యజమాని ఆగ్రహం

ఖిలావరంగల్, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాలుగా ఇంటి అద్దె చెల్లించడంలేదని ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేశారు. ఖమ్మంరోడ్‌కు గల కార్యాలయానికి గతంలో ఆరునెలలు, సంవత్సరానికి ఒకసారి అద్దె ఇచ్చేవారని, ప్రస్తుతం రెండేళ్లవుతున్నా చెల్లించడంలేదని, బకాయి సుమారు రూ.7లక్షలు అయిందని, అంతేగాకుండా కరెంట్ బిల్లు సైతం చెల్లించడంలేదని ఇంటి యజమాని గడ్డం సమ్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, కార్యాలయానికి వచ్చిన ప్రజలు బయటే కూర్చున్నారు. దీంతో రెండు రోజుల్లో బకాయి చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని అధికారులు హామీ ఇవ్వడంతో సమ్మయ్య తాళం తీశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, నవంబరు 30(ఆంధ్ర జ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం జయ కాలేజీ, పద్మాక్షి కాలనీ, శివముక్తిధామం, రాజ్‌పుత్ వాడ, మల్లికాంబ మనోవికాస కేంద్రం ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్బన్ డేను ఘనంగా నిర్వహించాలి

● నగర మేయర్ గుండు సుధారాణి


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో డిసెంబరు 3న అర్బన్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సమావేశమయ్యారు. బల్దియాలోని వివిధ విభాగాల వింగ్ అధికారులకు కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలనకు ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డిసెంబరు 3 నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తోందని అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయం, కోర్టు భవనాలు, జంక్షన్‌లలో విద్యుదీకరించాలన్నారు. డిసెంబరు 3న బల్దియా పరిధిలో 2కే రన్ నిర్వహించాలని, అదే రోజు బల్దియా ఇండోర్ స్టేడియం ఆవరణలో పారిశుధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరం, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్మికులకు పీపీఈ కిట్లు అందిస్తామన్నారు. ఇంకా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను ఏనుమాముల, సీకేఎం ఆస్పత్రి, బల్దియా ప్రధాన కార్యాలయాలలో ప్రారంభించాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను, ఉత్తమ పారిశుధ్య కార్మికులను సన్మానించాలన్నారు. బల్దియా పరిధిలో పూర్తయిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయాలని, అదే రోజు సాయంత్రం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లను భాగస్వాములను చేస్తూ విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని చెప్పారు.

ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, డీసీలు రవీందర్, కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, హార్టికల్చర్ అధికారి డాక్టర్ రమేష్ పలాస, బయాలజిస్ట్ మాధవరెడ్డి, మెప్మా టీఎంసీ రమేష్, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వద్దు

● వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు



సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు కలుషిత, నాసిరకం భోజనాన్ని అందిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి పతనం తప్పదని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్ పిలుపులో భాగంగా శనివారం ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు బి.నర్సింహారావు, ఎం.శ్రీకాంత్, ప్రణీత్ మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. విద్యా సంస్థల్లో అనేక సమస్యలు తాండవిస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మెనూ పాటించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాలిన్, అరుణ్, వినయ్, రాజ్‌కుమార్, జస్వంత్, వినయ్, పవన్, అఖిల్, వంశీ, పృథ్విరాజ్, వినయ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● విద్యారంగానికి ప్రభుత్వం చేసిందేమీ లేదు..

శంభునిపేట: హాస్టళ్లలో విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అని రాష్ట్ర ప్రభుత్వంపై వామపక్ష విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలలో జరుగుతున్న వరుస సంఘటనలకు నిరసనగా ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో నగరంలో శనివారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో బంద్ చేపట్టి ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రోహిత్, పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్, మిశ్రీన్ సుల్తానా, యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రంజిత్ మాట్లాడారు. సంవత్సరకాలంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విద్యా సంస్థల్లో 38 సార్లు ఫుడ్‌పాయిజన్ జరిగిందని, ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, 8 మంది ఆరోగ్యం విషమించి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం భోజనం పెడుతున్న కాంట్రాక్టర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రేవంత్, మధు, సతీష్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల రెండోదశ నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల విద్యార్థులకు స్వీట్ల పంపిణీ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, సీఎం కప్ పేరిట క్రీడా పోటీల నిర్వహణ ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాలలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

భవన నిర్మాణానికి స్థలం ఇవ్వాలి

మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం

కరీమాబాద్, నవంబరు30, (ఆంధ్రజ్యోతి): ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయ భవనానికి స్థలం కేటాయించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ నాయకులు గడ్డం యుగేందర్, నాగపురి క్రాంతి తదితరులు హైదరాబాద్‌లో ఆమెను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో అరకొర వసతులతో ప్రజలు, అధికారులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. భవనానికి ఉర్సు బైపాస్ రోడ్డులో గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఉన్న స్థలాన్ని కేటాయించాలని కోరారు. అదే విధంగా ఉర్సు దర్గా ప్రాంతంలో రూ.5 భోజన సదుపాయాన్ని కల్పించాలని కోరారు. వీటిపై స్పందించిన మంత్రి తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు రెఫర్ చేశారు.

నేడు వ్యాసరచన పోటీలు

గిర్మాజీపేట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఈనెల 1నుంచి 9 వరకు జరిగే ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి వరంగల్ నగరంలోని కృష్ణకాలని ప్రభుత్వ హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో, హెచ్ఎం జి.అశోక్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 5 నుంచి 7వ తరగతి విద్యార్థులకు భారతదేశ అభివృద్ధిలో రైతుల పాత్ర అంశంపై, 8నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'నీవే సీఎం అయితే ఏం చేస్తావు' అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయని వివరించారు. ఈ రెండు కేటగిరీలలో మండల స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విజేతలు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనాలన్నారు.

కాలనీ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వడ్డెపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జవహర్‌కాలనీ అభివృద్ధే తన ధ్యేయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, జవహర్‌కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి సోమయ్యతో పాటు కాలనీ ప్రతినిధులు పులి రాజేష్ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ జవహర్‌కాలనీలోని కమ్యూనిటీ హాల్ పూర్తి చేయడానికి కావల్సిన నిధులను సీడీఎఫ్ నుంచి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

సేవలతోనే పోలీసులకు గుర్తింపు

వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝా

హనుమకొండ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందించే సేవలతోనే పోలీసు శాఖకు కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఇటీవలే పోలీస్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని కమిషనరేట్‌కు కేటాయించబడిన కానిస్టేబుళ్లతో సీపీ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించే అవకాశం కేవలం పోలీసులకు మాత్రమే సాధ్యమన్నారు. ప్రజలకు మంచి చేయడం ద్వారా పోలీసు శాఖపై గౌరవ మర్యాదలు పెరగడంతో పాటు మీకు ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. శాఖపరమైన సమస్యలుంటే మీ పైఅధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, ఏవో రామకృష్ణ, ఏసీపీ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

గోశాలలో జ్వాలాతోరణం

గిర్మాజీపేట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని శ్రీదేవిభూదేవినీళాదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో శనివారం రాత్రి గోవిందాద్రి గోశాలలో కార్తీక కోటి దీపోత్సవం, జ్వాలాతోరణాన్ని మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, టీపీసీసీ నేత మీసాల ప్రకాష్‌తో కలిసి వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ ప్రారంభించారు. అనంతరం మహిళలు దీపాలు వెలిగించి జ్వాలాతోరణం కింది నుంచి శివనామస్మరణతో వెళ్లారు. ఆలయ ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసస్వామి కార్తీక మాస కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం ప్రాశస్త్యాన్ని వివరించారు. జ్వాలాతోరణం కింది నుంచి వెళ్లిన భక్తులకు శివానుగ్రహం లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఓం నమశివాయ అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో గోవిందాద్రి గోశాల మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఇంతేజార్‌గంజ్ సీఐ శుక్రూ, గోశాల వ్యవస్థాపకుడు వరయోగుల లక్ష్మణస్వామి, అర్చకులు వరయోగుల ప్రసాద్, మురళీకృష్ణ, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు సోషల్‌మీడియా మాయలో పడొద్దు

● వరంగల్ ఎంపీ కడియం కావ్య


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ కడియం కావ్య

హనుమకొండ సిటీ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): బాలలు సోషల్ మీడియా ప్రభావంలో పడొద్దని, ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని వరంగల్ ఎంపీ కడియం కావ్య సూచించారు. జిల్లా స్థాయి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కాళోజీ కళాక్షేత్రంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ కావ్య మాట్లాడారు. విద్య, క్రీడల పట్ల బాలలు ఆసక్తి కనబరచాలన్నారు. బాలల హక్కులు కోసం పోరాడాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలల వికాసమే దేశ భవిష్యత్తుకు మూలమన్నారు. ఆరోగ్య పరిరక్షణపై బాలలకు సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. బాలల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, రెడ్‌క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ ఈవీ శ్రీనివాస్, కార్పొరేటర్ రావుల కోమల, ప్రాజెక్టు లెవెల్ సీడీపీవోలు స్వాతి, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

● అభివృద్ధి పనులకు భూమిపూజ..

జూలైవాడ: గ్రేటర్ వరంగల్ 59వ డివిజన్‌లో రూ. 74 లక్షల 50 వేలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డిలతో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధిలో ప్రజల భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఇవి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు రవికిరణ్, కేతిడి దీపకొరెడ్డి, పేళ్ల సుగుణ కిశోర్, బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, వేముల తిరుపతి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వైస్ ప్రిన్సిపాల్‌కు సన్మానం


శ్రీనివాసులును సత్కరిస్తున్న అధ్యాపకులు

శంభునిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తోటకూరి శ్రీనివాసులు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శనివారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి అతిథులుగా అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సురేందర్‌తో పాటు పరకాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ హాజరై మాట్లాడారు. అనంతరం కళాశాల సిబ్బంది శ్రీనివాసులును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, పరమేష్, జి వెంకటేశ్వర్లు, పీఎల్ఎన్ మూర్తి, శ్రీధర్, శైలజ, సుస్మిత, చారి, భగీరథ్, రాజన్న, షరీఫ్, సమన, గీత, కమలాకర్, జావెద్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన కాంట్రాక్టర్లు


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంట్రాక్టర్స్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు శనివారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జనరల్ ఫండ్, పట్టణ ప్రగతి, సీఎంఏ పెండింగ్ బిల్లులు పార్ ఆర్డర్ క్లియర్ చేయాలని కమిషనర్‌ను కోరారు. డిసెంబరు 15 లోపు పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్టు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కమిషనర్‌ను కలిసిన వారిలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రు రమేష్, గొలుసుల సంపత్, కోశాధికారి పంచగిరి మాధవ శంకర్, నాయకులు అప్పాల శ్రీనివాస్, సంతోష్‌నాయక్, గండికోట రాజు తదితరులు ఉన్నారు.

పుస్తెల తాడు అపహరణ

మట్టెవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో శనివారం తెల్లవారుజామున చైన్ స్నాచింగ్ జరిగింది. వృద్ధురాలి మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి 3తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ మట్టెవాడ భోగేశ్వర స్వామి దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఓదెల ప్రమీల శనివారం ఉదయం ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా మంకీ క్యాప్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలోని పుస్తెల తాడు లాగాడు. అతడిని అడ్డుకోబోయిన ప్రమీల కిందపడడంతో కుడికాలు తొంటికి గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనపై ప్రమీల కుమారుడు శివకుమార్ 100కు డయల్ చేయగా మట్టెవాడ పోలీసులు చేరుకుని చైన్ స్నాచింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. సీసీఎస్ పోలీసులు, మట్టెవాడ, క్రైంపార్టీ పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఠాణాకు కూతవేటు దూరంలో జరిగిన ఈ ఘటన పోలీస్‌లకు సవాల్‌గా నిలిచింది.

ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కేయూ క్యాంపస్, నవంబరు 30, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై ఏబీఎస్ఎఫ్ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ గంధం శివ, ఏబీఎస్ఎఫ్ అధ్యక్షుడు ఇనుగుర్తి సుధాకర్ అన్నారు. శనివారం కేయూలో ఏబీఎస్ఎఫ్ 20వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీ మొదటి గేటు నుంచి రెండోగేటు వరకు ర్యాలీ, ప్రదర్శన చేపట్టారు. కేయూ కామర్స్ సెమినార్ హాల్‌లో జరిగిన ఆవిర్భావ సదస్సులో వారు మాట్లాడుతూ.. ఏబీఎస్ఎఫ్ విద్యార్థుల పక్షాన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతోందని అన్నారు. ఏబీఎస్ఎఫ్ పోరాట ఫలితంగానే జిల్లాలో ఎస్ఎంఎస్ హాస్టల్ ఏర్పాటైందని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచిగా స్థిరపడి తల్లిదండ్రులకు పేరుతేవాలని చెప్పారు. అంబేద్కర్, పూలే ఆశయాల సాధనకుపాటుపడాలని అన్నారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్, జిల్లా నాయకులు నాగుల పవన్, కల్యాణ్, మాజీ ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు చేల్పూరి శ్రీకాంత్, కేయూ జనరల్ సెక్రటరీ బండారి పృథ్వీరాజ్, ఉపాధ్యక్షుడు అర్షం చరణ్, కేయూ నాయకులుగౌతమ్, మధు, విష్ణు, అజయ్, రవి, కిరణ్, సాయి, వెంకటేశ్, ప్రతాప్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కేయూ క్యాంపస్, నవంబరు 30, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్‌కు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కారణమని రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క అసంబద్ధమైన ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ బొల్లికొండ వీరేందర్ ధ్వజమెత్తారు. శనివారం కేయూలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురుకుల బాట నిర్వహించడాన్ని జీర్ణించుకోలేక ఆరోపణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గురుకుల బాటను అందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ యూత నేత మంద శ్యామ్, చాతల్ల వేణుగోపాల్, చక్రీలు మాట్లాడుతూ. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన ఐపీఎస్ ఉద్యోగాన్ని వదులుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేశారని అన్నారు. ఈ సమావేశంలో స్వేరోస్ నాయకులు శనిగరపు శ్రీనివాస్, మారేపల్లి మనోజ్, బొట్ల ప్రశాంత్, ఎల్లూరి సాయికుమార్, వడ్లకొండ ప్రసాద్ పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణలో పురుషులు ముందుండాలి

వరంగల్ మెడికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అపోహలకు లోనవకుండా వేసెక్టమీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు పురుషులు ముందుకు రావాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. వేసెక్టమీ అవగాహన, శస్త్రచికిత్స పక్షోత్సవాలలో భాగంగా శనివారం హనుమకొండలో ఆశా నోడల్ పర్సన్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. పురుషులకు కోత కుట్టు లేని ఎన్ఎస్‌వీ ఆపరేషన్ చాలా తేలికైందని, ఆపరేషన్‌కు ముందు రావడం భర్తగా బాధ్యత అని అన్నారు. మొదటి సంతానం తర్వాత కనీసం మూడేళ్ల వ్యవధి ఉండేలా దంపతులను ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది గృహ సందర్శన సమయంలో, పీహెచ్‌సీలకు వచ్చినప్పుడు కోత, కుట్టు లేని ఎన్ఎస్‌వీ ఆపరేషన్ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో పీఓడీటీటీ కె.లలితాదేవి, మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, ఎస్‌వో ప్రసన్నకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

● యువ సైంటిస్ట్ తోట శ్రవణ్‌కుమార్


విద్యార్థులకు వివరిస్తున్న శ్రవణ్‌కుమార్

కేయూ క్యాంపస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చని యువ సైంటిస్ట్ డాక్టర్ తోట శ్రవణ్‌కుమార్ అన్నారు. కేయూ క్యాంపస్‌లోని కెమెస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో శనివారం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కెమిస్ట్రీ విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు పెరుగుతున్నాయని, సబ్జెక్టుపై పట్టు సాధించడం ద్వారా వాటిని అందిపుచ్చుకోవచ్చని అన్నారు. కేయూలో ఎంఎస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సు మొదటిబ్యాచ్ విద్యార్థినైన తాను ఎంతో కష్టపడి చదివి అమెరికాలో సైంటిస్టుగా స్థిరపడ్డానని తెలిపారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ రంగంలో వస్తున్న నూతన మార్పులపై ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కెమెస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్ సవితా జ్యోత్స్న మాట్లాడుతూ శ్రవణ్ లెక్చర్ విద్యార్థు లకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. కాగా, వరంగల్‌లోని ఏకశిలానగర్‌కు చెందిన శ్రవణ్ అమెరికాలో సైంటిస్టుగా స్థిరపడ్డారు.

వికటించిన ఆర్ఎంపీ వైద్యం

టీజీఎంసీకి ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబం

వరంగల్ మెడికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించడంతో ఓ వ్యక్తి శరీరంపై బొబ్బలు వచ్చాయి. చర్మం అంతా పొట్టులా ఊడిపోయింది. ఫోర్ట్ వరంగల్‌కు చెందిన సూరయ్య జ్వరంతో బాధపడుతూ ఈ నెల 25న స్థానిక ఆర్ఎంపీ జి.రామకృష్ణను సంప్రదించాడు. తను పరీక్షించి పక్కనే ఉన్న తన మెడికల్ షాపులో కొన్ని రకాల మందులు ఇచ్చాడని, అవి వేసుకున్న మరునాడు వీపు, ఇతర శరీర భాగాలపై బొబ్బలు వచ్చి చర్మం ఊడిపోయిందని బాధితుడు తెలిపాడు. ఈ విషయం ఆర్ఎంపీకి చెప్పగా చర్మవ్యాధి నిపుణుడిని సంప్రదించాలని సూచించాడు. దీంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఈ నెల 27న అడ్మిట్ కాగా, సదరు వైద్యుడు పరీక్షించి ఆర్ఎంపీ ఇచ్చిన మందులు వికటించినట్లు తెలిపారు. దీంతో నకిలీ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి మనువడు బి.వంశీకృష్ణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు.

రిటైర్డ్ ఉద్యోగులు ప్రశాంత జీవనం గడపాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



శ్యాంసుందర్‌కు సన్మాన పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, టీఎన్జీవో కేంద్ర, జిల్లా సంఘం నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులు ప్రశాంత జీవనం గడపాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. జిల్లా వైద్య, శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన శనిగరపు శ్యాంసుందర్ అభినందన సభ శనివారం రాత్రి హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో టీఎన్‌జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్యాంసుందర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, మాజీ ఎమ్మెల్యే రాంభద్రయ్య, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, ఈవీ శ్రీనివాస్, నేతలు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, రామినేని శ్రీనివాస్, ఉమాదేవి, శైలజ, రాజీవ్, అనుప్, ప్రణయ్, జిల్లా ఉద్యోగ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మనిషి ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి


అనుగ్రహభాషణం చేస్తున్న భారతి మహాస్వామి

హనుమకొండ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మనిషి ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే ప్రశాంత జీవనాన్ని గడుపవచ్చని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి అన్నారు. వరంగల్ పర్యటనకు వచ్చిన ఆయన శనివారం రాత్రి వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించారు. ఆలయ నాట్య మండపంలో అనుగ్రహం భాషణం చేశారు. పరోపకారం ద్వారా మనిషి జన్మకు సార్థకం లభిస్తుందని చెప్పారు. కొన్ని రంధ్రాలున్న ఒక కుండలో దీపాన్ని వెలిగిస్తే ఆ దీపకాంతి అన్ని వైపులకు ప్రసరించి కాంతిని వెదజల్లుతున్నట్లుగా ప్రతి ఒక్కరూ తమ జ్ఞానజ్యోతిని వీలైనంత మందికి ప్రసరింపజేయాలన్నారు. ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్ తదితరులు స్వామిని పూర్ణకుంభంతో స్వాగతించి రుద్రేశ్వరుడి సన్నిధిలో ప్రదోషకాల పూజ చేశారు. ఈవో వెంకటయ్య, సిబ్బంది మధుకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తొలిసారి నగర పర్యటనకు వచ్చిన పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి భద్రకాళి ఆలయాన్ని సందర్శించి అక్కడ నుంచి పద్మాక్షి ఆలయ ప్రాంగణంలో జరిగే కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.


డిగ్రీ పట్టా ప్రదానం చేస్తున్న సమీర్, చిత్రంలో బిద్యాధర్ సుబుధి

దేశాభివృద్ధిలో నిట్ కీలక భూమిక

- క్షిపణి వ్యవస్థలో ప్రపంచంలోనే భారత్ అగ్రగామి
- డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్
- ఘనంగా వరంగల్ నిట్ 22వ స్నాతకోత్సవం


స్నాతకోత్సవంలో నిట్ డైరెక్టర్, డీఆర్‌డీవో చైర్మన్, వివిధ శాఖల అధిపతులు

హనుమకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో వరంగల్ జాతీయ సాంకేతిక కళాశాల (నిట్) కీలక భూమిక పోషిస్తున్నదని డిఫెన్స్ డైరెక్టోరేట్ (ఆర్‌అండ్‌డీ) సెక్రెటరీ, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ ప్రశంసించారు. తమ డీఆర్‌డీవోలోనూ భాగస్వామి అవుతూ నిర్మాణాత్మక సహకారాన్ని అందిస్తున్నదని అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో 22వ స్నాతకోత్సవం కన్నుల పండువగా జరిగింది. 1,875 మంది అభ్యర్థులు పట్టాలు స్వీకరించారు. అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌హాల్‌లో జరిగిన ఈ స్నాతకోత్సవానికి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ కామత్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ప్రస్తుతం డిగ్రీలు అందుకుంటున్న పట్టభద్రుల్లో చాలామంది కొవిడ్ మహమ్మారి వ్యాపించిన అత్యంత సంక్షుభిత సంవత్సరం 2020లో తమ చదువును ప్రారంభించినప్పటికీ ధైర్యంగా విద్యను పూర్తిచేయడం అభినందనీయమన్నారు. పట్టాలు స్వీకరిస్తున్న ఈ తరుణం.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఒక మధురమైన జ్ఞాపకమని, జీవితంలో కొత్త అడుగువేసే రోజు అన్నారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన వరంగల్ నిట్ నుంచి పట్టభద్రులైనందుకు విద్యార్థులు గర్వపడాలన్నారు. కెరీర్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించడం ద్వారా ఈ విద్యాసంస్థ పేరును నిలబెట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో మొట్టమొదటి ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాల స్థాయి నుంచి జాతీయ సాంకేతిక కళాశాలగా ఎదిగిన వరంగల్ నిట్ ప్రస్థానం అద్వితీయమని డాక్టర్ కామత్ కొనియాడారు. అత్యున్నత విద్యా ప్రమాణాలను అందించడం, సరికొత్త ఆవిష్కరణలకు జీవం పోయడం, నూతన సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా తనను తాను మలుచుకోవడం ద్వారా నిట్ తన ప్రస్థానాన్ని విప్లవాత్మకంగా సాగించిందన్నారు. దేశాభివృద్ధిలో, సాంకేతిక ప్రగతిలో, డీఆర్‌డీవోకు సహకారం అందించడంలో నిట్ క్రియాశీల భూమిక పోషించిందన్నారు. నిజానికి తన మొదటి బాస్ మాలకొండయ్య వరంగల్ నిట్ పూర్వవిద్యార్థేనని ఆయన గుర్తు చేసుకున్నారు. నిట్‌లో విద్యార్థులు పొందిన జ్ఞానం, నైపుణ్యం వారిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుందన్నారు. విద్యార్థులు డిగ్రీలు పుచ్చుకోవడంతోనే పూర్తి కాలేదని, అసలైన జీవితం ముందున్నదన్నారు. అధ్యయనం అనేదానికి అంతం లేదని, మీరు ఉన్నతవిద్యార్జన చేసేప్పుడు, ఎంచుకున్న రంగంలో రాణించాలనుకున్నప్పుడు మరింత జ్ఞానం పొందాలన్న ఆకాంక్ష, ఆకలి ఎప్పుడూ ఉండాలని ఉద్బోధించారు. వైవిధ్యంగా, సృజనాత్మకంగా ఆలోచించేవారిదే భవిష్యత్తు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మారడం, కొత్త విషయాలను తెలుసుకోవడం, అందరితో కలిసి పనిచేయడం, అందరినీ కలుపుకొని పోవడం ద్వారానే ఎవరైనా విజయం సాధిస్తారని అన్నారు. విజయానికి అడ్డదారులు ఉండవని, మీరు ఎంచుకునే మార్గం, ఆ దిశగా మీరు బలంగా వేసే అడుగులే మీ గెలుపునకు చిరునామాలుగా నిలుస్తాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం, చేరుకోవాలనుకున్న గమ్యం పట్ల మీకు అంతులేని విశ్వాసం, ఆకాంక్ష ఉండాలన్నారు.

అలాగే డీఆర్‌డీవో సాధించిన విజయాల గురించి డాక్టర్ కామత్ వివరించారు. విస్తృతమైన మానవ వనరులు, శాస్త్ర పరిశోధనల ఏర్పాట్లు కలిగిన డీఆర్‌డీవో.. రక్షణ రంగంలో తనదైన క్రియాశీల భూమిక పోషిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో డీఆర్‌డీవో సాధించిన విజయాలను విద్యార్థులతో పంచుకున్నారు. క్షిపణుల రంగంలో చోటుచేసుకున్న సరికొత్త ఆవిష్కరణల గురించి వివరించారు. మన దేశ రక్షణ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి క్షిపణులైనా తయారుచేసే స్థితిలో మన దేశం ఉందన్నారు.

అగ్ని, పృథ్వీ వంటి క్షిపణులు, తేలికపాటి యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంక్ అర్జున్, రాకెట్ లాంచర్ పినాక, మెయిన్ డిఫెన్స్ మిస్సైల్ ఆకాశ్, వివిధ రకాల రాడార్లు, వార్‌ఫెడ్ వ్యవస్థలు, అండర్‌వాటర్ సిస్టమ్ రాపిడో వంటి సాయుధ సంపత్తి ఈ సంస్థద్వారానే జరిగిందన్నారు. ఇటీవల రూపకల్పన చేసిన మిషన్ శక్తి యాంటీ సబ్‌మెరింగ్ వార్‌ఫెడ్ కూడా ఈ కోవలోనివే అన్నారు. వీటన్నిటి వల్లనే దేశ రక్షణరంగం అత్యంత శక్తివంతమైందిగా నిలిచిందన్నారు.

క్షిపణి వ్యవస్థలో ప్రపంచంలోనే మన దేశం అగ్రస్థానంలో ఉందని, సరికొత్త ఆవిష్కరణలతో మన రక్షణ రంగం అత్యంత శక్తివంతంగా మారిందని అన్నారు. ఆధునాతన లైట్‌వెయిట్ టార్పెడో, యాంటీ-టార్పెడో డెకోయ్ సిస్టమ్స్, అటానమస్ అండర్ వాటర్ వెహికిల్స్, ఓడల కోసం అధునాతన హల్ మౌంటెడ్, టోప్డ్ అర్రే సోనార్లు, జలాంతర్గాల కోసం ఇంధన కణాల అధారిత ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొఫెల్షన్ సిస్టమ్స్ వంటి వాటిని అభివృద్ధి చేయడం ద్వారా రక్షణ రంగంలో ప్రపంచ దేశాల కన్నా ముందున్నామన్నారు. జైకిసాన్, జైజవాన్, విజ్ఞాన్, జై అనుసంధాన్ నినాదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ సర్వోతోముఖాభివృద్ధికి శ్రమిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచంలో అగ్ర దేశాలకన్నా మిన్నగా ఉండగలదన్న విశ్వాసాన్ని డాక్టర్ కామత్ వ్యక్తం చేశారు. కాగా, డాక్టర్ సుబుధీ స్ఫూర్తిదాయక ప్రసంగం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి స్నాతకోత్సవ ప్రసంగం చేశారు.

కనుల పండువగా స్నాతకోత్సవం

- 1,875 మందికి డిగ్రీల ప్రదానం
- 11 మందికి బంగారు పతకాలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పట్టభద్రుల తల్లిదండ్రులు
- స్నాతకోత్సవ వీక్షణకు డిజిటల్ స్క్రీన్ల ఏర్పాటు

హనుమకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ 22వ స్నాతకోత్సవం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. రెండు వేల మందికిపైగా పట్టభద్రులు, నిట్‌లో ప్రస్తుతం చదువుతున్న మరో రెండు వేల మంది విద్యార్థులు, తమ పిల్లలు డిగ్రీలు తీసుకుంటుండగా ప్రత్యక్షంగా చూడా లని స్నాతకోత్సవానికి వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో నిట్ క్యాంపస్ కిటకిటలాడింది. ఈసారి స్నాతకోత్సవాన్ని ఆడిటోరియంలో కాకుండా అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేయడంతో స్థలాభావం వల్ల పట్టభద్రులకు తప్ప ఇతరులకు అనుమతివ్వలేదు. దీంతో తల్లిదండ్రులు నిరాశపడ్డారు. అయితే వారు స్నాతకోత్సవాన్ని తిలకించేందుకు వీలుగా క్యాంపస్‌లోని నాలుగు సెమినార్ హాళ్ల లో డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. మీడియాకు కూడా లోనికి అనుమతించక పోవడంతో వారు కూడా డిజిటల్ స్క్రీన్ ప్రసారం మీదే ఆధారపడాల్సి వచ్చింది.

స్నాతకోత్సవం జరిగింది ఇలా..

సరిగ్గా ఉదయం 10గంటలకు జాతీయ గీతాలాపనతో స్నాతకోత్సవం ప్రారంభమైంది. 10.05 గంటలకు బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ కాన్వొకేషన్‌ను ప్రారంభించారు. అనంతరం నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధీ స్వాగతోపన్యాసం చేశారు. నివేదిక సమర్పించారు. ఆ తర్వాత ముఖ్య అతిథి డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ స్నాతకోపన్యాసం చేశారు. అనంతరం పట్టభద్రులకు డిగ్రీలు, బంగారు పతకాలను ప్రదానం చేశారు. డాక్టర్ కామత్‌ను నిట్ డైరెక్టర్ శాలువతో సత్కరించారు. జాతీయ గీతాలాపనతో కాన్వొకేషన్ ముగిసింది.

1,875 మందికి డిగ్రీల ప్రదానం

స్నాతకోత్సవంలో 1875 మంది పట్టభద్రుల్లో 147 మంది పీహెచ్‌డీ, 539 మంది ఎంటెక్, 154 మంది ఎంఎస్‌సీ, 22 మంది ఎంబీఏ, 55 మంది ఎంఎస్‌సీ, 22 మంది 949 మంది బీటెక్ పట్టభద్రులు ఉన్నా రు. జాతీయ విద్యా విధానానికి (ఎన్‌ఈపీ) అనుగుణంగా నిష్క్రమణ విధానంలో మరో 9 మంది డిగ్రీలు స్వీకరించారు. మంజిమా కర్మాకర్ ఇన్‌స్టిట్యూట్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. మనీషా వర్షిణి ఎంసీఏ, అన్ని పీజీ ప్రోగ్రాంలలో టాపర్‌గా నిలిచి బంగారు పతకాన్ని అందుకున్నారు. అరుణ్‌కుమార్ కెమిస్ట్రీలో ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్‌కు రోల్ ఆఫ్ ఆనర్‌ను తీసుకున్నారు. మొత్తం 11మందికి విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్, పీజీ అవారు లు ఇద్దరు స్వీకరించారు.

ప్రగతి పథంలో వరంగల్ నిట్

- నిట్‌కు 54.72 కోట్ల ప్రాజెక్టులు
- 4.19 కోట్ల కన్సల్టింగ్ గ్రాంట్లు
- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ ప్రగతి పథంలో పయనిస్తోందని, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతిని ఆర్జిస్తోందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి పేర్కొన్నారు. శనివారం నిట్‌లో 22వ స్నాతకోత్సవం సందర్భంగా నిట్ ప్రగతిపై నివేదిక సమర్పిం చారు. నిట్‌లో పరిశోధనలను ప్రోత్స హించేందుకు ఇన్‌స్టిట్యూట్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది నలుగురు అధ్యాపకులకు పరిశోధనా విశిష్ట పురస్కారాలు లభించాయని తెలిపారు. విధుల నిర్వహణలో నైపుణ్యాన్ని పెంపొందిచేందుకు ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది అవార్డులను కూడా ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఉత్తమ థీసిస్ అవార్డులను ఏర్పాటు చేశామన్నారు. నిట్‌కు రూ.54.72 కోట్ల విలువైన ప్రాజెక్టులు, రూ.4.19కోట్ల విలువైన కన్సల్టింగ్ గ్రాంట్లు మంజూరయ్యాయని ప్రొఫెసర్ సుబుధి వెల్లడించారు. ఇన్‌స్టిట్యూట్ గ్రాంట్లు అందించడం, పరిశ్రమతో సహకారాన్ని ప్రోత్సహించడం ద్వారా స్టార్టప్‌ల ను ప్రారంభించేందుకు అధ్యాపకులు, విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ల ద్వారా నిట్ విద్యార్థులను ఎంపిక చేయడానికి ప్రపంచవ్యాప్తంగా 300 కంపెనీలు నిట్‌క్యాంపస్‌ను సందర్శించాయన్నారు. గతేడాది అత్యధికంగా రూ.88లక్షల ప్యాకేజీని నిట్ విద్యార్థి అందుకున్నారన్నారు. సమర్థవంతమైన పాలన కోసం నిట్‌లో గత సంవత్సరం నవంబరు 2023 నుంచి ఈ-ఆఫీస్ విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.2.3కోట్ల ఎండోమెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.


స్నాతకోత్సవానికి హాజరైన పట్టభద్రులు

క్రీడలతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే నాగరాజు
- ఆఫీసర్స్ క్లబ్ వేదికగా టెన్నిస్ టోర్నీ షురూ



క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 30: (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. శనివారం వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు శ్రీనివాస్‌గౌడ్ జ్ఞాపకార్థం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్ ఏర్పాటుచేసిన జాతీయస్థాయి టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలను కేఆర్.నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా శ్రీనివాస్‌గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాకతీయులు పరిపాలించిన గడ్డపై జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

వివిధ రాష్ట్రల నుంచి వచ్చే క్రీడాకారులకు ఉమ్మడి జిల్లా విశిష్టతను, కాకతీయ కాలంనాటి కళాఖండాలను వీక్షించడంతో పాటు కాకతీయుల చరిత్ర, ప్రాచినమైన దేవాలయాలు దర్శించుకోవాలని సూచించారు. వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గంద్ర సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా అసోసియేషన్‌కు శ్రీనివాస్ జ్ఞాపకార్థం రూ.2లక్షల, 50వేల నగదు ప్రోత్సాహంతో జాతీయస్థాయిలో ఓపెన్ టూ ఆల్ మెన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు పండగా వాతావరణంలో నాకౌట్ పద్ధతిన నిర్వహిస్తామని చెప్పారు. టెన్నిస్ టోర్నీలో వివిధ రాష్ట్రాల నుంచి 104మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.

అనంతరం అసోసియేషన్ బాధ్యులతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు టెన్నిస్ ఆడి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మనోహర్‌రెడ్డి, బాధ్యులు ఎల్లా మురుగన్, రాజేశ్వర్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, కన్నారెడ్డి, గోపాల్‌రావు, పురుషోత్తంరెడ్డి ఈసీ మెంబర్లు సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద బాడిసె.. మూగబోయె !

- దయనీయ స్థితిలో వడ్రంగులు
- యంత్రాల రాకతో బతుకులు తారు మారు
- పనిలేక ఇతర రంగాల వైపు చూపు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

సండే స్పెషల్ SUNDAY SPECIAL

దేవరుప్పుల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు వడ్రంగికి.. రైతులకు విడదీయలేని బంధం ఉండేది. పంటలు సాగు చేయాలంటే వడ్రంగులు చేసే వ్యవసాయ పనిముట్లు ఎంతో అవసరం. తొలకరి చినుకులు పడే వరకు వడ్రంగులు చాలా పనుల్లో నిమగ్నమై ఉండే వారు. తెల్లవారు జామునే బాడిసె, ఉలి, గూటం, సుత్తి, పిడసాని, రంపం తదితర పనిముట్లు చేతబట్టి కాడి, నాగలి, గుంటుక, దంతె లాంటి పనిముట్ల తయారు చేసేవారు. కానీ నేడు ఆ పరిస్థితులు మారి పోయాయి. దుక్కి దున్నే దగ్గర నుంచి పంట కోసే వరకు అన్ని యంత్రాలు రావడంతో వడ్రంగుల పరిస్థితి దయనీయంగా మారింది. పూర్వం గ్రామాల్లో వస్తు మార్పిడి పద్ధతి ఉండేది. అంటే రైతన్నకు కావాల్సిన పనిముట్లు వడ్రంగులు తయారు చేసి ఇస్తే.. పంట చేతికొ చ్చిన తర్వాత ఇంతా అని లెక్క చేసి అంత విలువ చేసే ధాన్యం వడ్రంగులకు ఇచ్చేవారు.

ఆ ధాన్యంతో వడ్రంగులు సంవత్సరానికి సరిపడా ధాన్యం నిల్వ చేసుకుని.. మిగిలితే ఇతర అవసరాలకు విక్రయించుకునేవారు. ఇలా ఆ రోజుల్లో వడ్రంగుల జీవితాల్లో వెలుగులు ఉండేవి. కాలానుగుణంగా యాంత్రీకరణతో వ్యవసాయంలో ట్రాక్టర్లు, ఇతర పనిముట్లు రావడంతో వడ్రంగులకు వృత్తి పని లేకుండా పోయింది. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది.

వడ్రంగులు తయారు చేసే పనిముట్లు

వడ్రంగులు ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన పనిముట్లన్నింటినీ తయారు చేస్తారు. నాగలి, గుంటుక, గొర్రు, దంతే, విత్తనపు బుట్టలు, కాడిమాను, ఎడ్లబండ్లు, చక్రాలు మడిగెం మొద్దు, గొడ్డలి కామ, పారకామ, డేకీస కామ, తదితర పనిముట్లను రైతులకు కావాల్సిన విధంగా వాటిని తయారు చేసి ఇస్తారు. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి గడపలు, కిటికీలు, దర్వాజలు, తలుపులు, మం చం, బల్లె పీటలు, దేవుని మండపం తదితర ఫర్నిచర్లను తయారు చేస్తారు.


సీతారాంపురంలో నాగలి చేస్తున్న వడ్రంగి

పట్టణాలకు పయనం

గ్రామాల్లో పనులు లేక వడ్రంగులు పట్టణాలకు పయనమవుతున్నారు. ఇప్పటికే పలువురు యువకులు పట్టణాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకొని తలుపులు, కిటికీలు, డైనింగ్ టేబుల్, బెడ్స్ లాంటివి తయారు చేస్తున్నారు. కొందరు ఫర్నిచర్ తయారు చేసే కంపెనీల్లో చిరు ఉద్యోగులుగా చేరుతున్నారు. మరికొందరు యంత్రాలను సమకూర్చుకుని వృత్తిని కొనసాగిస్తున్నారు. ఇక పట్టణాలకు వెళ్లలేక ఊరినే నమ్ముకున్న వడ్రంగులు ఇళ్ల వద్దే చిన్నాచితక పనులు చేసుకుంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. గత ప్రభుత్వం కుల వృత్తులకు చేయూతనందిస్తాననీ మొండి చేయి చూపిందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించి ఆదుకోవాలని వడ్రంగులు కోరుతున్నారు.

జీవన శైలి తారుమారు

వడ్రంగుల జీవనశైలి తారుమారైంది. ఎంతో మంది ఇదే వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. అయితే పరిస్థితుల ప్రభావంతో పనులు తగ్గాయి. దీంతో కుల వృత్తిని నమ్ముకున్న వారికి భవిష్యత్తు లేదని ఇతర రంగాలవైపు దృష్టి పెడుతున్నారు. అంతే కాకుండా వడ్రంగులకు పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతు న్నాయి. పనులు చేస్తున్నప్పుడు దుమ్ము, పొట్టు వస్తుండంవల్ల దగ్గు, ఆయాసంతో పాటు కంటిచూపు మందగించడం, నడుము, వెన్నెముక, మోకాళ్లు, కీళ్ల నొప్పుల వంటి జబ్బులు వస్తున్నాయి. దీంతో పాటే పనులు చేస్తున్న సమయంలో చేతులు, కాళ్లకు గాయాలై అవిటివారిగా మారిన సందర్భాలున్నాయి.

26వ ఏట చేతి వేళ్లు పోయాయి..



మారేపల్లి సోమయ్య, కామారెడ్డిగూడెం

ఇప్పుడు నాకు 57ఏళ్లు. నా 26వ ఏట దూగోడ మిషన్‌లో పడి చేతి వేళ్లన్నీ పోయాయి. అయినప్పటికీ అధైర్య పడకుండా కుటుంబ పోషణ కోసం కుల వృత్తిని నమ్ముకొని ఇంటి వద్ద వడ్రంగి పని చేస్తున్నా. అన్నీ యంత్రాలు రావటం వల్ల పనులు పూర్తిగా తగ్గిపోయాయి. కుటుంబ పోషణ భారమై దుర్భర జీవితం అనుభవిస్తున్నాం.

ప్రభుత్వం ఆదుకోవాలి



మారోజు బ్రహ్మచారి, సీతారాంపురం

నేడు వ్యవసాయంలో యంత్రీకరణ కారణంగా మా కులవృత్తి కనుమరుగవుతోంది. చేతినిండా పని లేకుండా పోవటంతో పస్తులతో గడపాల్సి వస్తోంది. గతప్రభుత్వాలు అన్ని కుల వృత్తులవారిని ఆదుకుంటామని చెప్పి మొండి చేయి చూపాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైనా వడ్రంగులను ఆదుకొని మా జీవితాల్లో వెలుగు నింపాలి. ఇప్పటికే పనులు దొరకక ఈ తరం పిల్లలు పట్టణాలకు వలస వెళ్తున్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి



మారోజు మురళి, సీతారాంపురం

ప్రభుత్వం వడ్రంగులకు బీమా సౌకర్యం కల్పించాలి. పనులు చేసే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా చేతులు, కాళ్లు పోగొట్టుకున్న వారు కూడా ఉన్నారు. అలాంటి వారికి సహాయం చేయడంతో పాటు 50 ఏళ్లు నిండిన ప్రతీ వడ్రంగికి పింఛను ఇవ్వాలి.

విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు గుర్తించాలి

- వార్తా పత్రికలు, ఇతర పుస్తకాలూ చదవాలి
- సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య


సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో బాల్యదశలోనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంపీ కడియం కావ్య అన్నారు. కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమానికి శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ... విద్యార్థులెప్పుడూ వారి ఆలోచనా విధానాలకు అడ్డుకట్ట వేయొద్దన్నారు. ప్రస్తుత సామాజిక అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేసి ఆవిష్కరణల దిశగా పయనించాలన్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు సామాజిక అంశాలను కలగలిపిన వార్తా పత్రికలు, ఇతరత్రా పుస్తకాలను విద్యార్థులు చదవాలన్నారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక తదితర రంగాల్లో నైపుణ్యం సాధించాలన్నారు.

కాగా, ఇన్‌స్పైర్ ఎగ్జిబిట్లతో 12 మందిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక చేశారు. సైన్స్‌ఫెయిర్‌లో టీమ్‌కు ఇద్దరి చొప్పున 14 ఎగ్జిబిట్లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మరో ఇద్దరిని సెమినార్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అతిథుల చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ పరిశీలకులు సుబ్రత్‌కుమార్, జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, డీఎస్‌వో ఎస్. శ్రీనివాస్‌స్వామి, క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ఎంఈవోలు, నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేసి అర్జున్ యువతకు ఆదర్శం

- జిల్లా కీర్తి ప్రతిష్ఠలు విశ్వవ్యాప్తం చేశాడు..
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- అంతర్జాతీయ చెస్ దిగ్గజానికి సత్కారం

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 30 : (ఆంధ్రజ్యోతి): చెస్ క్రీడలో భారతదేశంలో నెంబర్-1, ప్రపంచ స్థాయిలో రెండో స్థానంలో నిలిచి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేసిన హనుమకొండ నగరానికి చెందిన ఇరిగేసి అర్జున్ వర్ధమాన క్రీడాకారులకు ఆదర్శప్రాయుడని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండ బాల సముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో చెస్ నెట్‌వర్క్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్జున్ అభినందన సభలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. నేటి యువత సెల్ ఫోన్, సోషల్ మీడియా వైపు ఆసక్తి కనబర్చుతున్నారని, అనుకున్న రంగంలో రాణించడానికి పట్టుదల క్రమశిక్షణతో సాధన చేయడం ద్వారానే అది సాధ్య పడుతుందని, దానికి ఉదాహరణ చెస్ దిగ్గజం అర్జున్ అని తెలిపారు. ఏటా నవంబర్ 14న జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఒక్క రోజు పాటు చిన్నారులతో కలిసి వేడుకలు నిర్వహించడం జరిగేదని, కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల సంక్షేమం, అభివృద్ధి, పరిరక్షణ దృష్టిలో ఉంచుకొని పది రోజులుగా వేడుకలను నిర్వహిస్తోందన్నారు. ఆపద సమయంలో ఉన్న చిన్నారుల ఆశ్రయం కల్పించి కాపాడేందుకు చైల్డ్ ఎల్ప్‌లైన్-1098 నెంబర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడతూ.. ఇరిగేసి అర్జున్ రానున్న రోజుల్లో ప్రపంచస్థాయిలో ప్రథమ స్థానంలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు ఇరిగేసి అర్జున్ మాట్లాడుతూ.. పట్టుదలతో సాధన చేయడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునన్నారు. చెస్ నెట్ వర్క్ కో ఆర్డినేటర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో చెస్‌క్రీడను ప్రోత్సహిస్తూ క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సన్మాన సభ ప్రారంభంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి అర్జున్ అభినందించారు. అనంతరం వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యలు అర్జున్‌ను శాలువాతో సన్మానించారు. కాగా, సన్మాన సభకు వచ్చిన విద్యార్థులతో సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాపిడ్ చెస్ పోటీల్లో పది చెస్‌బోర్డులను ఏకకాలంలో ఆడి విద్యార్థులపై విజయం సాధించాడు. ఈ కార్యక్రమంలో అర్జున్ తల్లిదండ్రులు ఇరిగేసి జ్యోతి - డాక్టర్ శ్రీనివాసరావు, చెస్ అసోసియేషన్ ప్రతినిధులు మేజర్ శివప్రసాద్, బాసిరి రాజగోపాల్, కె.కర్ణాకర్‌రెడ్డి, అన్నం చిన్ని వెంకటేశ్వర్లు, టీడీ. టామీ, బొల్లం సంపత్‌కుమార్, చెస్ నెట్‌వర్క్ ప్రతినిధులు నగరంలో పలు పాఠశాలలకు చెందిన చిన్నారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా వచ్చిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఇరిగేసి అర్జున్‌ను కనీసం సన్మానించకుండా సభ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.


చెస్ క్రీడాకారుడు అర్జున్‌ను సన్మానిస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ ప్రావీణ్య తదితరులు





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
చర్చిల్ ఎట్ వార్	డాక్యుమెంటరీ	డిసెంబర్ 04
దట్ క్రిస్మస్	యానిమేషన్ మూవీ	డిసెంబర్ 04
ది ఓన్లీ గర్ల్		
ఇన్ ది ఆర్కెస్ట్రా	డాక్యుమెంటరీ	డిసెంబర్ 04
ది అల్టిమేటమ్	వెబ్‌సిరీస్	డిసెంబర్ 04
అమరన్	తమిళ చిత్రం (తెలుగులో)	డిసెంబర్ 05
బ్లాక్ డవ్స్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 05
ఎ నాన్సెన్స్ క్రిస్మస్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 06
బిగ్గెస్ట్ హైస్ట్ ఎవర్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 06
జిగ్రా	హిందీ చిత్రం	డిసెంబర్ 06
మేరీ	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 06
విక్కీ విద్యాకా వో వాలా వీడియో	హిందీ చిత్రం	డిసెంబర్ 06
అమెజాన్ ప్రైమ్		
జాక్ ఇన్‌టైమ్ ఫర్ క్రిస్మస్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 03
పాప్ కల్చర్ జెప్పడీ	వెబ్‌సిరీస్	డిసెంబర్ 04
మట్కా	తెలుగు చిత్రం	డిసెంబర్ 05
అగ్ని	హిందీ చిత్రం	డిసెంబర్ 06
ది స్టిక్కీ	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 06
జియో సినిమా		
క్రియేచ కమాండోస్	యానిమేషన్ మూవీ	డిసెంబర్ 06
లాంగింగ్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 07
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది ఒరిజినల్	కొరియన్ సిరీస్	డిసెంబర్ 03
లైట్ షాప్	కొరియన్ సిరీస్	డిసెంబర్ 04
జీ5		
మైరీ	హిందీ చిత్రం	డిసెంబర్ 06
సోనీ లివ్		
తనవ్ 2	హిందీ సిరీస్ (తెలుగులో)	డిసెంబర్ 06
బుక్ మై షో		
స్మైల్ 2	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 04

శౌర్యం, సాహసాల కథ



అగ్నిమాపక సిబ్బంది తమ పనిలో ఎదుర్కొనే కఠినమైన సవాళ్లు, వారి ధైర్య సాహసాల నేపథ్యంలో తెరకెక్కిన హిందీ చిత్రం 'అగ్ని'. డిసెంబర్ 06 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ముంబై నగరంలో చెలరేగిన మంటలను అర్పే క్రమంలో అగ్నిమాపక సిబ్బంది చూపిన శౌర్యం, చేసిన త్యాగాల ఆధారంగా అల్లుకున్న కథ ఇది. ప్రతీక్‌గాంధీ, సయామీ ఖేర్, దివ్యేందు శర్మ కీల కపాత్రలు పోషించారు. బాలీవుడ్ హీరో, ఫర్హాన్ అక్తర్ ఈ చిత్రాన్ని నిర్మించాడు. రాహుల్ డోలాకియా దర్శకుడు.

సండే సెలబ్రిటీ



ఆ శుక్రవారం ఇంకా రాలేదు

భావోద్వేగాలను సునాయాసంగా పండించగల టాలీవుడ్ నటులలో సత్యదేవ్ ఒకరు. జయాపజయాలతో సంబంధం లేకుండా వరుస చిత్రాలతో దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'తో తన అనుభవాలను పంచుకున్నారు.

'జీబ్రా' చిత్రానికి స్పందన ఎలా ఉంది?

'గ్లాడియేటర్' సినిమాలో 'విన్ ది క్రౌడ్.. యు విల్ గెట్ ఫ్రీడమ్' (ప్రజలను గెలుచుకుంటే నువ్వు స్వేచ్ఛను పొందుతావు) అని ఒక డైలాగ్ ఉంటుంది. ప్రస్తుతం నాకు అలా అనిపిస్తోంది. ప్రేక్షకులందరు 'జీబ్రా' సినిమాను చాలా ఆనందంగా చూస్తున్నారు. మంచి రివ్యూలు ఇచ్చారు. ఒకరిద్దరు మాత్రం కావాలని తక్కువ రేటింగ్స్ ఇచ్చారు. కొంత బాధ అనిపించింది. ఎందుకంటే అందరూ బావుందన్నప్పుడు- రివ్యూలు కావాలని రాస్తే ఇబ్బందిగా అనిపిస్తుంది కదా! 'బ్లఫ్ మాస్టర్'కు కూడా గతంలో ఇలాంటి రివ్యూలే కావాలని రాయించారు. వాటి ప్రభావం నుంచి బయట పడటానికి సమయం పట్టింది. అంతే కాదు... సినిమా విడుదల చేయటానికి మాకు చాలా తక్కువ థియేటర్స్ లభించాయి. కానీ వాటిలో చాలా షోలు హౌస్‌ఫుల్‌గా నడుస్తున్నాయి.

మీ నటనా ప్రస్థానం ఎలా సాగుతోంది?

వెనక్కి తిరిగి చూసుకుంటే చాలా బావుందనిపిస్తోంది. కానీ ఎందుకో నాకు రావాల్సినన్ని విజయాలు రాలేదనిపిస్తుంది. 'బ్లఫ్ మాస్టర్' బావుందని ఇప్పుడు అనేక మంది చెబుతూ ఉంటారు. కానీ అది పెద్ద విజయం సాధించలేదు. "ఉమామహేశ్వర ఉగ్రరూపస్య.." సినిమాను ఇప్పటికీ మెచ్చుకుంటారు. కానీ కొవిడ్‌వల్ల ఆ సినిమా పెద్దగా ఆడలేదు. 'తిమ్మరుసు' కూడా చాలా మంచి సినిమా. అది విడుదలయ్యే సమయంలో కొవిడ్ సెకండ్ వేవ్ వచ్చింది. సినిమా హాళ్లలో 50 శాతం మందినే అనుమతించేవారు. దాంతో అనుకున్నంత విజయం సాధించలేదు. తర్వాత 'కృష్ణమ్మ' రెండేళ్లు ఆగిపోయింది. విడుదలయిన వెంటనే- అంటే- ఆరు రోజులకే ప్రైమ్ ఓటీటీలో వదిలేశారు. దీంతో కలెక్షన్లు సరిగ్గా రాలేదు. ఇప్పుడు 'జీబ్రా'తో విజయం సాధించాను. ఇక్కడ ఒక మాట చెప్పాలి. నా సినిమాలు విజయాలు సాధించటానికి ఎంత చేయగలనో అంత చేస్తున్నాను. విజయాలు వచ్చేదాకా పట్టుదల వీడను. ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాను.

ఇలా విజయాలు తృటిలో తప్పిపోతుంటే బాధగా అనిపించదా?

మొదట్లో చాలా బాధగా అనిపించేది. "కచ్చితంగా అవుతుంది" అనుకున్నప్పుడల్లా ఎదురుదెబ్బ తగిలేది. దాని నుంచి బయట పడి మళ్లీ ట్రాక్ ఎక్కామనుకున్నప్పుడు మరో దెబ్బ.. ఇప్పటిదాకా ఇలా గడిచింది. దీనితో బహుశా నా ప్రయాణం ఇంకా మొదలవలేదు అనే సిద్ధాంతాన్ని నమ్మటం మొదలు పెట్టాను. కొందరికి అతి త్వరగా విజయం లభిస్తుంది. 25 ఏళ్లకే సీఈఓలు అయిపోతారు. 50 ఏళ్లు వచ్చేసరికి పతనం అంచుకు చేరుకుంటారు. కొందరు 50 ఏళ్లకు విజయం సాధించవచ్చు. కానీ ఆ విజయం వారి జీవితం చివరి దాకా ఉంటుంది. నాకు కూడా అంతేనేమో అనుకుంటాను. చాలా మంది ఒక శుక్రవారంతో నటుల జీవితం మారిపోతుందని అనుకుంటూ ఉంటారు. బహుశా ఆ శుక్రవారం నా జీవితంలో ఇంకా రాలేదు.

అపజయాలకు కారణాలేమిటో కనుగొన్నారా?

నేను 150 శాతం శ్రమిస్తాను. కానీ ప్రతిసారి విజయాలు తృటిలో ఎందుకు తప్పిపోతున్నాయో తెలియదు. ఉదాహరణకు బ్యాడ్మింటన్‌ను తీసుకుందాం. దీనిలో జయాపజయాలు మన ప్రతిభపైనే ఆధారపడి ఉంటాయి. కానీ సినిమా అలా కాదు. ఇదొక పెద్ద టీం స్పోర్ట్. మనం చాలా కష్టపడిన తర్వాత ఇతరులు వదిలేస్తే సినిమా ఆడదు. డైరక్షన్‌లో చిన్న లోపం నుంచి డిస్ట్రిబ్యూషన్ దాకా ఎక్కడ తేడా వచ్చినా సినిమా ఆడదు. అన్ని పరిస్థితులూ సక్రమంగా ఉంటేనే సినిమా ఆడుతుంది.

ఈ ఒడుదొడుకుల్లో మీకు ఎమోషనల్ సపోర్టు ఎవరు?

నా భార్య, నా కుమారుడు విక్కి. నాకు ఎమోషనల్ సపోర్టు. విక్కితో ఒక్క అరగంట ఆడుకుంటే చాలు... ఒత్తిడి అంతా మాయమైపోతుంది. జీవితం చాలా సులభమైనదనిపిస్తుంది. దీని కోసం ఇంతగా కిందామీదా పడిపోవాలా అనిపిస్తుంది. వీళ్లిద్దరితో పాటు చిరంజీవి గారు కూడా చాలా పెద్ద సపోర్టు. ఆయన నా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు రావటంతో 'జీబ్రా' అనే సినిమా ఉందనే విషయం చాలా మందికి తెలిసింది.



> **ఇప్పటిదాకా నేను పెద్ద ప్రొడక్షన్ హౌస్‌లలో సినిమాలు చేయలేక పోయాను. నాకు అలాంటి ఛాన్స్ దొరకలేదు. 'జీబ్రా' తర్వాత నాకు అలాంటి అవకాశాలు వస్తాయనుకుంటున్నా.**

మీరు ఏ తరహా సినిమాలను ఇష్టపడతారు?

నాకు యాక్షన్ అంటే చాలా ఇష్టం. అయితే నాకు నచ్చేదాని కన్నా జనాలకు నచ్చేది చేయాలనేది నా ఉద్దేశం.

ఎలాంటి స్క్రిప్టులు ఎంచుకొంటున్నారు?

అందరూ రెండు రకాలైన సినిమాలు ఆడుతున్నాయని చెబుతున్నారు. వాటిలో మొదటిది... కొత్త ప్రపంచాన్ని చూపించేవి. 'అవతార్, కేజీఎఫ్, బాహుబలి, సలార్'.. ఇలాంటివన్నీ ఈ కోవకు వస్తాయి. రెండోది కామెడీ సినిమాలు. 'జీబ్రా'లో ఒక కొత్త ప్రపంచం ప్రేక్షకులకు కనిపిస్తుంది. అందుకే ఆ పాత్రను ఎంపిక చేసుకున్నా. ఇక రాబోయే సినిమా 'ఫుల్ బాటిల్'. ఇందులో నేను తాగుబోతు ఆటోడ్రైవర్ వేషం వేస్తున్నా. ఇది క్రైమ్ కామెడీ సినిమా. ఇలా జాగ్రత్తగా ఆలోచించి స్క్రిప్టులు ఎంచుకుంటున్నా.

ఎలాంటి సన్నివేశాల్లో నటించాలని అనుకొంటారు?

నేను భావోద్వేగాలు ఎక్కువగా ఉన్న సన్నివేశాల్లో బాగా నటిస్తాను. 'నేను ఏడిస్తే పక్కవాళ్లు ఏడ్వాలి..' అనేది నా భావన. అయితే ఎందుకో తెలియదు.. నేను ఏడ్చినట్లు నటించగలను కానీ సీను కోసం ఏడ్వలేను.

• సివిఎల్ఎన్ ప్రసాద్



తేనీరు ఇలా కూడా!

చాలామందికి ఉదయం లేవగానే తేనీటిని సేవించే అలవాటు ఉంటుంది. చిక్కని పాలలో కొన్ని నీళ్లు, పంచదార, తేయాకు పొడి వేసి బాగా మరిగించి తేనీటిని తయారు చేస్తారు. ఇది అందరికీ తెలిసిన పద్ధతే! ఒంట్లో నీరసంగా అనిపించినపుడు, ఆరోగ్యం బాగాలేనపుడు ఇంట్లో దొరికే కొన్ని దినుసులు ఉపయోగించి కొత్త రకంగా తేనీటిని తయారు చేసుకుని తాగితే క్షణాల్లో శరీరానికి శక్తి లభిస్తుంది. బడలికని పోగొట్టి మెదడుని ఉత్తేజితం చేసేందుకు తేనీటిలో కలపాల్సిన దినుసులు ఇవే...

అల్లం: ఒక చిన్న అల్లం ముక్కను పొట్టు తీసి కచ్చాపచ్చాగా నూరి మరుగుతున్న తేనీటిలో వేస్తే అందులోనుంచి వచ్చే సువాసనకే అలసట మొత్తం పోతుంది. ఈ తేనీటిని తాగిన వెంటనే అల్లంలోని జింజరోల్ అనే సమ్మేళనం గొంతు గరగరను పోగొడుతుంది. రాత్రి తిన్న ఆహారపదార్థాలు పొట్టలో సమస్యలు కలిగించకుండా వాటిని క్షణాల్లో జీర్ణం చేస్తుంది. రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది.

ఏలకులు : రెండు ఏలకులను పొట్టుతో సహా మెత్తగా నూరాలి. ఈ పొడిని కప్పు లేదా గ్లాసులో వేసుకోవాలి. అందులో ముందుగా తయారు చేసుకున్న వేడి తేనీటిని వడబోయాలి. తరవాత చెంచాతో కలిపితే తేనీటికి మంచి సువాసన పడుతుంది. ఈ తేనీటిని తాగడం వల్ల ఏలకులలో ఉండే రైబోఫ్లెవిన్, నియాసిన్ అనే విటమిన్లు; యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అందుతాయి. ఇవి కడుపులో ఆమ్లతత్వాన్ని నిరోధిస్తాయి. శరీరంలో జీవక్రియలను వేగవంతం చేస్తాయి.

దాల్చినచెక్క: మరుగుతున్న తేనీటిలో అర అంగుళం పొడవున్న దాల్చిన చెక్కను వేస్తే అందులోని ఔషధగుణాలన్నీ తేనీటిలోకి చేరతాయి. ఉదయాన్నే ఈ తేనేటిని తాగితే నిద్ర మత్తు వదలిపోతుంది. దాల్చిన చెక్కలో ఉండే పాలీఫెనాల్ సమ్మేళనాలు రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధీకరిస్తాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.



తులసి: వేడి తేనీటిలో నాలుగు లేదా అయిదు తులసి ఆకులు వేసుకుని తాగితే శరీరానికి రోగనిరోధక శక్తి అందుతుంది. ఒత్తిడి, మానసిక ఆందోళన, శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. తులసిలోని యాంటీ ఆక్సిడెంట్లు, సి విటమిన్ చర్మ సౌందర్యాన్ని పెంచుతాయి.

సోంపు: తేనీరు మరుగుతున్నపుడు అందులో అర చెంచా సోంపు గింజలు కలిపితే అది పొట్టను శుభ్రం చేసే కషాయంలా మారుతుంది. ఈ తేనీటిని తాగిన అర్ధగంటలోపే కడుపు ఉబ్బరం, అజీర్తి, కడుపులో మంట తదితర సమస్యలన్నీ పోతాయి.

లవంగాలు: లవంగ మొగ్గల్లో కె, సి విటవిన్లతోపాటు యూజినాల్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి దగ్గు, జలుబు, గొంతు గరగర లాంటి సమస్యలను నివారిస్తాయి. నోటి ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయి. ఒక గ్లాసు తేనీటిలో రెండు లవంగాలను పొడి చేసి కలుపుకుని తాగితే చలికాలంలో వచ్చే శ్వాసకోశ సమస్యలనుంచి బయటపడవచ్చు.

మిరియాలు: వేడిగా ఉన్న తేనీటిలో చిటికెడు మిరియాల పొడిని కలుపుకొని తాగితే శరీరానికి సత్తువ లభిస్తుంది. ముక్కు దిబ్బడ, ముక్కు కారడం, తలనొప్పి, గొంతు నొప్పి తదితర సమస్యల నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుంది.

జింక్ కూడా ముఖ్యమే

విటమిన్ డీ, ఐరన్ మొదలైనవి తక్కువ అయితే ఏం జరుగుతుందో చాలా మందికి తెలుసు. కానీ మన శరీరానికి అత్యంత అవసరమైన జింక్ గురించి మాత్రం తెలియదు. మన శరీరానికి ప్రతి రోజు కనీసం 8 నుంచి 10 మిల్లీగ్రాముల జింక్ అవసరమవుతుంది. ఒక వేళ జింక్ తక్కువ అయితే దాని ప్రభావం శరీరంపై పడుతుంది. అప్పుడు శరీరం కొన్ని సంకేతాలు పంపుతుంది. ఆ సంకేతాలు ఏమిటో తెలుసుకుందాం.

తరచూ ఇన్‌ఫెక్షన్లు

జింక్ తగ్గటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దీని వల్ల వైరస్, బ్యాక్టీరియాలపై రోగనిరోధక వ్యవస్థ సరైన పోరాటం చేయలేదు. దీనితో తరచు ఇన్‌ఫెక్షన్లు వస్తూ ఉంటాయి.

గాయాలు నెమ్మదిగా

గాయం మానాలంటే కణాల విభజన సక్రమంగా, చురుకుగా జరగాలి. ఈ రెండు ప్రక్రియలలోను జింక్ కీలకపాత్ర పోషిస్తుంది. జింక్ సరిగ్గా లేకపోతే గాయాలు త్వరగా మానవు.

జుట్టు ఊడిపోవటం

జింక్ తక్కువ ఉంటే జుట్టు ఊడిపోతూ ఉంటుంది. ఎవరికైనా జుట్టు ఊడిపోతుంటే జింక్ విలువలు ఎలా ఉన్నాయో తెలుసుకోవటానికి పరీక్షలు చేయించుకోవాలి.

ఆకలి మందగించటం

జింక్ తగ్గటం వల్ల రుచి, వాసన సరిగ్గా తెలియవు. దీని వల్ల ఆకలి తగ్గుతుంది. ఆకలి వేయకపోతే ఆహారం సరిగ్గా తినరు. దీని వల్ల తగినంత జింక్ లభించదు. ఇదంతా ఒక వలయంగా తయారవుతుంది.

చర్మ సమస్యలు

చర్మ ఆరోగ్యానికి జింక్ చాలా అవసరం. జింక్ సరిగ్గా లేకపోతే రకరకాల చర్మ సమస్యలు ఏర్పడే అవకాశముంది.

మెదడుపై

మెదడుపై కూడా జింక్ ప్రభావం చూపిస్తుంది. జింక్ సరిగ్గా లేకపోతే మెదడు సరిగ్గా పనిచేయదు. దీని వల్ల డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలు ఏర్పడతాయి.



రెండు నెలలు సందడే.. సందడి

తెలుగు చిత్ర పరిశ్రమలో రాబోయే రెండు నెలలు సందడి నెలకొననుంది. 'పుష్ప-2, డాకు మహారాజ్, కుబేర, గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం, సారంగపాణి జాతకం' తదితర సినిమాలు విడుదల కానున్నాయి. వీటితోపాటు మరికొన్ని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ చిత్రాలపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు తగ్గట్టుగా సినిమాలు ఉంటే సరి. లేదంటే ప్రేక్షకుల్లో సినిమాల పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. థియేటర్లకు ప్రత్యామ్నాయంగా వారు ఓటీటీలను ఎంపిక చేసుకునే పరిస్థితులు ఏర్పడవచ్చు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నూట పాతికకు పైగా చిత్రాలు విడుదల కాగా వాటిలో కేవలం ఐదు శాతం మాత్రమే బాక్సాఫీసు వద్ద విజయాలను నమోదు చేశాయి.

'పుష్ప-2'తో మొదలు

ప్రపంచవ్యాప్తంగా అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'పుష్ప-2 ది రూల్'. సుకుమార్ డైరెక్షన్‌లో వస్తోన్న ఈ సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా అల్లు అర్జున్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబరు 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. విదేశాల్లో ఒక రోజు ముందుగా డిసెంబరు 4నే ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఓవర్సీస్‌లో ప్రీసేల్ బుకింగ్‌లో మిలియన్ డాలర్ల మార్క్‌ను చేరుకుంది. అమెరికన్ బాక్సాఫీసులో అత్యంత వేగంగా టికెట్ల ప్రీసేల్ ద్వారానే వన్ మిలియన్ డాలర్ల మార్క్‌ను చేరిన సినిమాగా 'పుష్ప-2' నిలిచింది. ఇంత భారీ అంచనాలు, ప్రీ బుకింగ్‌ల మధ్య రిలీజ్ అవుతోంది. ఈ సినిమా విజయం, దాని తర్వాత విడుదలవుతున్న చిత్రాలను ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. ఈ చిత్రం నచ్చితే దాని ఫీల్‌గుడ్‌తో ప్రేక్షకులు తదుపరి సినిమా చూడటానికి ఇష్టపడతారు. లేదంటే ఓటీటీలో వస్తుంది కదా, అప్పుడు చూడొచ్చులే అనే భావనలోకి వెళతారు.

వీటిపై భారీ అంచనాలు

నాగార్జున, ధనుష్, రష్మిక మందన ప్రధాన పాత్రధారులుగా నటించిన 'కుబేర' చిత్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా గ్లింప్స్‌లో ధనుష్ బిచ్చగాడిలా, నాగార్జున ప్రభుత్వ అధికారిగా కీలక పాత్రల్లో నటించారు. చాలా గ్యాప్ తర వాత డైరెక్టర్ శేఖర్ కమ్ముల భిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.

సంక్రాంతి పండగ వచ్చిందంటే నందమూరి అభిమానులు బాలయ్య సినిమా చూడాల్సిందే! వారి ఆశలకు అనుగుణంగానే 'డాకు మహారాజ్' చిత్రం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఓ వైపు ఫైనల్ షూటింగ్, మరో వైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉన్నారు మేకర్స్. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రేక్షకుల్లో అంచనాలను పెంచాయి. అందుకు కారణం.. బాలకృష్ణను మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో దర్శకుడు బాబీ చూపించబోతున్నారు. జనవరి 12న విడుదలవుతోంది.

'గేమ్ ఛేంజర్' షూటింగ్ దాదాపుగా పూర్తి అయినట్లే. దాంతో ఆల్ ఇండియా రేంజ్‌లో, ఓవర్సీస్ రేంజ్‌లో ప్రమోషనల్ ఈవెంట్స్‌కి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే లక్నోలో జరిగిన మెగా ఈవెంట్‌లో టీజర్‌ని రిలీజ్ చేశారు. దీనికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. దీంతో నేషనల్ వైడ్ బ్లాక్ బస్టర్ పక్కా అనే కాన్ఫిడెన్స్‌లో ఉంది చిత్ర బృందం. జనవరి 10న విడుదలవుతోంది.

వెంకటేష్-అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం పైనా ప్రేక్షకులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలకు భిన్నంగా క్రైమ్ ఎలిమెంట్స్‌తో ట్రయాంగిల్ స్టోరీగా తెరకెక్కిన చిత్రమిది. జనవరి 14న విడుదలవుతోంది.



అన్ని ఆటంకాలనూ అధిగమించి

స్వీయ దర్శకత్వంలో కంగన రనౌత్ నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. ఎన్నోసార్లు విడుదల వాయిదా పడుతూ వచ్చిన ఈ చిత్రం అన్ని ఆటంకాలను అధిగమించి వచ్చే ఏడాది జనవరి 17న విడుదలకు సిద్ధమవుతోంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. కంగన ఈ విషయంపై హత్యా బెదిరింపులను కూడా ఎదుర్కొన్నారు. భారతదేశంలో చీకటి రోజులుగా పిలిచే ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను ఈ చిత్రంలో చూపించారు. ఇందులో కంగన ఇందిరాగాంధీ పాత్రలో కనిపించనున్నారు. పూర్తిగా రాజకీయ కోణంలో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో వేచి చూడాలి.

జాతకాల నేపథ్యంలో...

'జెంటిల్‌మెన్, సమ్మోహనం' వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సినిమా 'సారంగపాణి జాతకం'. కామెడీ జానర్‌లో రాబోతున్న ఈ సినిమాలో ప్రియదర్శితోపాటు శ్రీనివాస్ అవసరాల, వెన్నెల కిషోర్, హర్ష కీలకపాత్రల్లో నటించారు. సారంగపాణి జాతకం, జీవితం చుట్టూ తిరిగే ఫన్నీ ఎలిమెంట్స్‌తో చిత్రం తెరకెక్కినట్లు దీని టీజర్ చూస్తుంటే తెలుస్తోంది. హీరో జాతకాలను బాగా నమ్ముతాడు.'మన జీవితం మొత్తం మన చేతిలోనే రాసి ఉంటుంది' అని చెబుతాడు. దాంతో ప్రేక్షకులు అమితాసక్తితో ఎదురు చూస్తున్నారు. డిసెంబరు 20న ఈ సినిమా విడుదలవుతోంది.

సంక్రాంతి సెంటిమెంట్

టాలీవుడ్‌లో సంక్రాంతి పండుగ సెంటిమెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు సినిమా వాళ్లకు సంక్రాంతి కీలకమైన సీజన్. కలెక్షన్లు కూడా అధికంగానే వసూళ్లు అవుతాయి. అందుకే నిర్మాతలందరూ ఈ సీజన్‌పై ప్రత్యేకంగా ఫోకస్ చేస్తూ ఉంటారు. 2024 సంక్రాంతికి గుంటూరు కారం (మహేష్ బాబు), సైంధవ్ (వెంకటేశ్), నా సామిరంగ (నాగార్జున), హనుమాన్ (తేజ) సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో చిన్న సినిమాగా విడుదలైన 'హనుమాన్' ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. మిగతా సినిమాలు అంతగా ప్రేక్షకులను మెప్పించలేకపోయాయి. అయితే ఈ సంక్రాంతికి గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం వంటి పెద్ద చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటిలో 'డాకు మహారాజ్' మినహా మిగిలిన రెండూ దిల్ రాజుకు చెందినవే.

హుజూరాబాద్‌లో వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి

» 6 మెగావాట్ల సామర్థ్యంతో 25 ఎకరాల్లో ప్లాంట్ ఏర్పాటు

» త్వరలోనే టెండర్ల ప్రక్రియ

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ వద్ద చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయించింది. రూ.150 కోట్ల వ్యయంతో 25 ఎకరాల స్థలంలో 6 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను నెలకొల్పాలని చూస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు ప్రైవేటు సంస్థలను ఆహ్వానించేందుకు త్వరలోనే టెండర్లు పిలిచేందుకు పురపాలక శాఖ సంచాలకులు శ్రీదేవి సన్నాహాలు చేస్తున్నారు. కాగా, హనుమకొండ, కరీంనగర్ కలెక్టర్లు చర్చించుకుని హుజూరాబాద్ వద్ద ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అంతేకాక ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కరీంనగర్ కలెక్టర్ ఇప్పటికే హుజూరాబాద్ కమిషనర్‌కు అప్పగించారు. మరోపక్క, రోజుకు 790 టన్నుల చెత్త నుంచి 6 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అవసరమైన అధ్యయనాన్ని సంబంధిత అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఇందుకోసం జవహర్‌నగర్‌తోపాటు ఏపీలోని గుంటూరులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను సందర్శించారు. హుజూరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే ప్లాంట్‌కు ప్రతి రోజు హుజూరాబాద్ మున్సిపాలిటీ నుంచి 19.74 టన్నుల చెత్త చేరనుందని అధికారులు అంచనా వేశారు. అలాగే, జమ్మికుంట నుంచి 18.64 టన్నులు, హుస్నాబాద్ నుంచి 9.32, పరకాల నుంచి 10.32, వరంగల్ నుంచి 518.62, కరీంనగర్ నుంచి 186.07, కొత్తపల్లి 4.67, వర్ధన్నపేట 5.79, నర్సంపేట్ 15.64 టన్నుల చెత్తను విద్యుత్ ప్లాంట్‌కు తరలిస్తారు. ఈ చెత్త ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను యూనిట్ రూ.6.80పైసల చొప్పున జెన్‌కోకు విక్రయించాలని ప్రణాళికలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఒప్పందం చేసుకునేందుకు పురపాలక శాఖ నుంచి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్‌కు, జెన్‌కో ఎండీకి ఇప్పటికే ప్రతిపాదనలు వెళ్లాయి.

అప్పులు తీర్చలేక పత్తి రైతు ఆత్మహత్య

» సిరిసిల్ల జిల్లా జవారిపేటలో ఘటన



నాగరాజు (ఫైల్)

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు అధికమవడం, అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చేమార్గం కనిపించక పత్తి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జవారిపేటకు చెందిన రైతు కోమటి నాగరాజు (49) తనకున్న 4 ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని కొన్నేళ్లుగా పత్తి పంటను సాగుచేస్తున్నాడు. ప్రతీ ఏటా నష్టం రావడానికి తోడు కుమార్తె వివాహం చేయడంతో దాదాపు రూ.15 లక్షల అప్పులయ్యాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలని నిత్యం మనోవేదనతో శనివారం పొలంలో పురుగు మందు తాగాడు. స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు.

నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు

» ఎల్లో అలర్ట్ జారీ.. తుఫాన్ కారణంగా తగ్గిన చలి

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు శనివారం నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, యాదాద్రి, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో చలి కాస్త తగ్గింది. గత వారం రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గి, చలి తీవ్రత పెరుగుతుండగా శుక్రవారం రాత్రి మాత్రం ఏకంగా ఐదారు డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు పెరిగాయి. శుక్రవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో కనిష్ఠ ఉష్ణోగ్రత 14.6 డిగ్రీలుగా నమోదైంది. అలాగే రాబోయే మూడు రోజుల పాటు రాత్రిపూట ఉష్ణోగ్రతలు 17 నుంచి 22 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.


సరూర్‌నగర్ స్టేడియంలో 6న బీజేపీ భారీ సభ

జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాక?.. బీఆర్ఎస్ నోటిఫికేషన్లకు కాంగ్రెస్ కొలువులు

» ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు

» బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ పాలన: కిషన్‌రెడ్డి

» సర్కారు వైఫల్యాలపై నేటి నుంచి నిరసనలు



హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ నమూనా

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 6న సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర సర్కారు వైఫల్యాలపై ఆదివారం నుంచి బీజేపీ నిరసన కార్యక్రమాలను చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుపై ఆదివారం చార్జ్‌షీట్ విడుదల చేయనుంది. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం ఉంటుంది. 2, 3, 4 తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, సదస్సులు, పాదయాత్రలు నిర్వహించనున్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కారు ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చింది తప్ప.. ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పంచాయతీలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సర్కారులు ఒక్క పైసా ఇవ్వలేదని అన్నారు. రుణమాఫీ కూడా అరకొరగా చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోని అహంకారం, నియంతృత్వం, అవినీతి, వైఫల్యాలు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో కూడా ఏ వర్గమూ సంతోషంగా లేదని.. రాష్ట్ర ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యమబాట పట్టాలని పార్టీ నాయకులకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో బలపడినప్పుడే రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరేయడం సాధ్యమని ఎంపీ డీకే అరుణ అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను స్ఫూర్తిగా తీసుకుని పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాలని, కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

సభ్యత్వ నమోదుపై బన్సల్ క్లాస్..

బీజేపీ క్రియాశీల సభ్యత్వంపై పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 20వేల క్రియాశీల సభ్యత్వాలు అయ్యాయని.. ఇంకా 30 వేలు చేయించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సభ్యత్వాలు చేయించని వారికి పార్టీ పదవులు ఎందుకని ప్రశ్నించారు. "పార్టీ సభ్యత్వ నమోదు మొదలు ప్రతీ పార్టీ కార్యక్రమాలకు తెలంగాణ నాయకులు సడలింపులు కోరతారు. దేశమంతా ఒకలా ఉంటే ఇక్కడ మరోలా ఉంటుంది. యూపీ కంటే కూడా ఇక్కడ కులపిచ్చి ఎక్కువ కనిపిస్తోంది. ఏది ఎలా ఉన్నా.. అధికారంలోకి రావాలంటే సంస్థాగత బలోపేతం అత్యంత కీలకం. హరియాణా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం" అని బన్సల్ స్పష్టం చేశారు.

రూ.26 కోట్లతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26.6 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రైల్వేస్టేషన్ ప్రతిపాదిత డిజైన్‌ను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కల్పన వల్ల రైల్వే స్టేషన్ అత్యాధునిక రవాణా కేంద్రంగా మారుతుందని తెలిపారు.

పులివెందుల వైసీపీ నేతల చెరవీడిన తెలంగాణ కార్లు

» ఏపీ మంత్రి లోకేష్ చొరవ..

సంగారెడ్డి వాసి సతీష్‌కు ఊరట

సంగారెడ్డి క్రైం, నవంబరు 30: గత మూడేళ్లుగా పులివెందుల వైసీపీ నాయకుల చెరలో ఉన్న తెలంగాణ వ్యక్తికి చెందిన ఆరు కార్లకు ఏపీ మంత్రి నారా లోకేష్ చొరవతో మోక్షం లభించింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సతీష్‌కుమార్ హరిహర కార్ రెంటల్ పేరిట సంస్థను నడుపుతున్నాడు. వికారాబాద్ వాసి మణిరాజ్ 2021 ఏప్రిల్‌లో ఆరు కార్లను అద్దెకు తీసుకున్నాడు. 4 నెలల పాటు డబ్బు చెల్లించలేదు. ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో 2023 జనవరిలో సతీష్ సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మణిరాజ్‌ను ఓ మోసం కేసులో జీడిమెట్ల పోలీసులు నిరుడు జూలై 5న అరెస్ట్ చేశారు. సతీష్ ఫిర్యాదుతో పీటీ వారెంట్‌పై సంగారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తాను తీసుకున్న కార్లలో కొన్ని పులివెందుల వైద్య కళాశాలలో లీజుకు నడుస్తున్నాయని, మరికొన్ని వైసీపీ నేతల వద్ద ఉన్నాయని మణిరాజ్ తెలిపాడు. దీంతో సతీష్ వాటి గురించి వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై వైసీపీ నేతలతో మాట్లాడుదామని వేంపల్లె పోలీసులు తీసుకెళ్లగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అనుచరులు వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, వైసీపీ నాయకుడు ప్రసాద్ రెడ్డిలు సతీష్‌ను తీవ్రంగా కొట్టారు. కార్లు అడిగితే చంపుతామని బెదిరించారు. ఇడుపులపాయలోని గదిలో ఐదు రోజులు బంధించి చిత్రహింసలు పెట్టారు. ఏపీలో ప్రభుత్వం మారడంతో ఇటీవల సతీష్ మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రులు, నేతలను కలిసి గోడు వెళ్లబోసుకున్నాడు. సోషల్ మీడియాలో ఏపీ మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్లాడు. జనసేన నేతలకు కూడా తెలిపాడు. ఆయన ఆదేశాలతో ఏపీ పోలీసులు.. ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరుల వద్ద ఉన్న కార్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి సంగారెడ్డి పట్టణ పోలీసులు వాటిని తీసుకువచ్చారు.

2 నుంచి సాయంకాలం బీటెక్ తరగతులు ప్రారంభం

» జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాయంకాలం బీటెక్‌లో ప్రవేశాలు పొందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు డిసెంబరు 2 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు సమాచారమిచ్చినట్లు చెప్పారు. ఈవెనింగ్ బీటెక్ అకడమిక్ క్యాలెండర్‌ను ఆయన శనివారం విడుదల చేశారు. వర్సిటీలోని మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో ఈ ఏడాది నుంచి కొత్తగా ఈవెనింగ్ బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 4వరకు మొదటి సెమిస్టర్ కొనసాగుతుందని, సెకండ్ సెమిస్టర్ జూన్ 2న ప్రారంభమై అక్టోబరు 18తో ముగుస్తుందన్నారు. సాయంకాలం బీటెక్ రెండో సంవత్సరం తరగతులను 2025 నవంబరు 3 నుంచి ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

క్షిపణుల తయారీలో భారత్ నంబర్ వన్

» సాంకేతిక ప్రగతి, డీఆర్డీవోకు సహకారంలో నిట్ పాత్ర కీలకం

» వరంగల్ నిట్ 22వ స్నాతకోత్సవంలో డీఆర్‌డీవో ఛైర్మన్ కామత్

హనుమకొండ, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): క్షిపణుల తయారీ రంగంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని, సరికొత్త ఆవిష్కరణలతో మన రక్షణ విభాగం అత్యంత శక్తిమంతంగా మారిందని డీఆర్‌డీవో ఛైర్మన్ సమీర్ వీ కామత్ అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో 22వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో మొట్టమొదటి ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజీ స్థాయి నుంచి జాతీయ సాంకేతిక కళాశాలగా ఎదిగిన వరంగల్ నిట్ ప్రస్థానం అద్వితీయమని కొనియాడారు. అత్యున్నత విద్యా ప్రమాణాలను అందించడం, ఆవిష్కరణలకు జీవం పోయడం, నూతన సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా తనను తాను మలుచుకోవడం ద్వారా నిట్ తన ప్రస్థానాన్ని విప్లవాత్మకంగా సాగిస్తోందన్నారు. దేశాభివృద్ధిలో, సాంకేతిక ప్రగతిలో, డీఆర్‌డీవోకు సహకారం అందించడంలో నిట్ క్రియాశీల భూమిక పోషించిందన్నారు. అగ్ని, పృథ్వి, ఆకాశ్ వంటి క్షిపణులు, తేలికపాటి యుద్ధవిమానాలు, యుద్ధ ట్యాంక్ అర్జున్, రాకెట్ లాంచర్ పినాకలాంటి సాయుధ సంపత్తిని డీఆర్‌డీవోనే తయారు చేసిందన్నారు. వీటన్నింటి వల్లనే దేశ రక్షణ రంగం అత్యంత శక్తివంతమైందిగా నిలిచిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త అంశాలను నేర్చుకుంటూ ఉండాలని, అప్పుడే ఎంచుకున్న రంగంలో రాణించగలరని చెప్పారు. అంతకు ముందు కామత్ నిట్‌లో ఇన్‌స్టిట్యూట్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ స్నాతకోత్సవానికి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ అధ్యక్షత వహించారు. నిట్ సాధించిన ప్రగతిని వివరించారు. ఈ స్నాతకోత్సవంలో 1,875 మందికి డిగ్రీలను ప్రదానం చేశారు. ఇందులో 10మంది విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. ఈ సారి నిట్ గోల్డ్ మెడల్ విజేతగా మంజిమా కర్మాకర్ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) నిలిచారు.

నవ్య | చిత్రజ్యోతి

ఆర్‌సి16లో దివ్యేందు



బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ(ఆర్‌సి16-వర్కింగ్ టైటిల్)లో బాలీవుడ్ నటుడు దివ్యేందు కీలక పాత్ర పోషిస్తున్నారు. 'మీర్జాపూర్' వెబ్‌సిరీస్‌లో మున్నా భాయ్ పాత్రలో తన దైన నటనతో మెప్పించిన దివ్యేందు ఈ సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సందర్భంగా దివ్యేందు పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు బుచ్చిబాబు విడుదల చేశారు. మెలితిప్పిన మీసం, రగ్డ్ లుక్‌తో దివ్యేందు పోస్టర్‌లో కనిపిస్తున్నారు. అనౌన్స్‌మెంట్ రోజు నుంచి అంచనాలు పెంచుతూ వస్తోన్న ఈ సినిమాను భారీ స్థాయిలో హై టెక్నికల్ వాల్యూస్‌తో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా రూపొందిస్తున్నారు. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కూడా ఈ సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలోకి ప్రవేశిస్తున్నారు. ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రలో మెప్పించబోతున్నారు. కథానాయికగా జాన్వీ కపూర్, కీలక పాత్రలో జగపతిబాబు నటిస్తున్నారు. ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే మైసూర్‌లో ప్రారంభమైంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బేనర్ సమర్పణలో వృద్ధి సినిమాస్ సంస్థపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

ఆ నమ్మకాన్ని 'క' ఇచ్చింది

- కిరణ్ అబ్బవరం



థ్రిల్లర్ జానర్‌లో రూపుదిద్దుకుని ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని ఇచ్చిన చిత్రం 'క'. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ఈ చిత్రం దీపావళికి విడుదలై ప్రపంచ వ్యాప్తంగా రూ 50 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్లు సాధించింది. ఇప్పుడు ఓటీటీలో కూడా విజయవిహారం చేస్తోంది. అతి తక్కువ సమయంలో 100 మిలియన్ల మినిట్స్ వ్యూయర్ షిప్ దక్కించుకుంది. సుజిత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఓటీటీలో కూడా విజయం సాధించిన సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ' డాల్బీ విజన్ 4 కే, అట్మాస్ టెక్నాలజీ వంటి సాంకేతిక విలువలతో ఓటీటీలోకి వచ్చిన తొలి తెలుగు సినిమా మాదే కావడం ఆనందంగా ఉంది. మా సినిమా సక్సెస్‌కు నిర్మాత గోపీ, దర్శకుడు సందీప్ , సుజిత్, డిస్ట్రిబ్యూటర్ వంశీ .. కారణం. మంచి సినిమా తీస్తే ప్రేక్షకుల ప్రేమను గెలుచుకోవచ్చు అనే ధైర్యాన్ని, నమ్మకాన్ని 'క' చిత్రం కలిగించింది' అన్నారు.

ఆఖరి అధ్యాయం మొదలు



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్ పోరాట యోధుడిగా నటిస్తున్న హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'హరి హర వీరమల్లు'. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను ఏ.ఎమ్ రత్నం సమర్పణలో ఏ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. విజయవాడలో ఈ సినిమా చివరి షెడ్యూల్ జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా, ఈ సినిమా సెట్స్‌లోకి పవన్ కల్యాణ్ అడుగుపెట్టినట్లు నిర్మాణ సంస్థ మెగా సూర్య ప్రొడక్షన్స్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. 'ధర్మం కోసం పోరాటంలో ఆఖరి అధ్యాయం మొదలు' అని పేర్కొంది. ఈ షెడ్యూల్‌లో పవన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ చిత్రంలో అర్జున్ రాంపాల్, బాబీ డియోల్, నిధి అగర్వాల్, నర్గిస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 28న ఈ సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.

యాక్షన్ బేస్డ్ మూవీ 'విడాముయర్చి'



మగిళ్ తిరుమేని దర్శకత్వంలో హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న చిత్రం'విడాముయర్చి'. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌లో సుభాస్కరన్ నిర్మించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతోంది. భారీ అంచనాలతో రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌ను పూర్తి చేసుకుంది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటి వరకూ కనిపించని ఓ వైవిధ్యమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. 'ప్రపంచమంతా నిన్ను నమ్మకపోయినా పరవాలేదు...నిన్ను నువ్వు నమ్ముకో' అనే కాన్సెప్ట్‌తో యాక్షన్ బేస్డ్ మూవీగా తెరకెక్కింది. టీజర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు నెక్ట్స్ లెవల్‌కు చేరుకున్నాయి.

సాహస గాథ



బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్, 'కై పో చే' ఫేమ్ అభిషేక్ కపూర్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'ఆజాద్'. ఈ సినిమాతో అజయ్ దేవగణ్ మేనల్లుడు అమన్ దేవగణ్ హీరోగా, రవీనా టాండన్ కూతురు రషా తడానీ హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. రోనీ స్క్రూవాలా, ప్రగ్యా కపూర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అజయ్ దేవగణ్ ఎక్స్ ద్వారా ప్రకటించారు. ఈ సాహస గాథను వచ్చే ఏడాది జనవరి 17న తిలకించడానికి సిద్ధమవ్వండి అని తెలిపారు.

షెర్లాక్ హోమ్స్ సందడి



హాస్య నటుడు వెన్నెల కిశోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు. అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం టీజర్‌ను గురువారం విడుదల చేశారు. వంశీ నందిపాటి 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'మంచి కంటెంట్‌తో వస్తున్న చిత్రాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు నా కృతజ్ఞతలు. డిసెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. సినిమాలో మంచి పాత్ర పోషించినట్లు అనన్య నాగళ్ల చెప్పారు. దర్శకుడు మోహన్ మాట్లాడుతూ 'వంశీగారు మా సినిమాను తీసుకోవడంతో మాకు చాలా ధైర్యం వచ్చింది. ఫస్ట్ కాపీ చూసి ఆయన చెప్పిన మార్పులు ఫాలో అయ్యాం' అన్నారు.

తెలుగు హీరోయిన్‌ను పరిచయం చేస్తున్న వైవీఎస్



ఉత్తరాదికి చెందిన ఐదుగురు హీరోయిన్లను ఇంతవరకూ పరిచయం చేసిన దర్శకుడు, నిర్మాత వైవీఎస్ చౌదరి తన తాజా చిత్రం కోసం తెలుగు అమ్మాయి, కూచిపూడి డ్యాన్సర్ వీణారావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నారు. మహానటుడు ఎన్టీఆర్ మునిమనవడు, హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావు ఈ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వీణారావు లుక్‌ని మహిళా నిర్మాతలు సుప్రియ, స్వప్నాదత్ విడుదల చేశారు. సంప్రదాయ, ఆధునిక దుస్తుల్లో వీణారావు ఎంతో అందంగా ఉన్నారు. పాత్రలకు అనుగుణంగా నటించి ప్రేక్షకుల్ని రంజింప చేస్తానని తన అభిమాన నటి డాక్టర్ భానుమతి సాక్షిగా ప్రమాణం చేశారు. కొత్త హీరోయిన్‌కి అభినందనలు తెలిపి, ఆమె సక్సెస్ కావాలని సుప్రియ, స్వప్న కోరారు. ఈ సందర్భంగా వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ 'మా హీరో నందమూరి తారక రామారావు ఫస్ట్ దర్శన్‌కు ప్రపంచ వ్యాప్తంగా మంచి స్పందన వచ్చింది. హీరోయిన్ వీణ తెలుగు అమ్మాయి. మంచి డ్యాన్సర్. తనకి కూడా మంచి భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. ఫస్ట్ దర్శన్‌ను లాంచ్ చేసిన సుప్రియ, స్వప్నలకు నిర్మాత యలమంచిలి గీత ధన్యవాదాలు తెలిపారు.

టాక్సీ డ్రైవర్ కథ



మోహన్‌లాల్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తుడరమ్'. ఆయనకు జోడీగా శోభన నటిస్తున్నారు. తరుణ్ మూర్తి దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ టాక్సీ డ్రైవర్‌గా నటిస్తున్నారు. శోభన గృహిణి పాత్రలో కనిపించనున్నారు. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన పోస్టర్‌లో మోహన్‌లాల్‌కు శోభన టీ గ్లాస్ అందిస్తూ కనిపించారు. అయితే గతంలో వీరిద్దరూ జంటగా నటించిన 'నడోడికట్టు' చిత్రంలోనూ ఇలాంటి సన్నివేశమే ఉంది. 1987లో విడుదలైన ఆ చిత్రంలో 'వైశాఖసంధ్యే' అంటూ సాగే గీతంలో మోహన్‌లాల్, శోభన టీ తాగుతూ కనిపించారు. ఆ సినిమా విడుదలై 37 ఏళ్లు అవుతోంది. దాంతో ఈ రెండు పోస్టర్స్‌ని పక్కపక్కన ఉంచి అభిమానులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

అప్‌డేట్స్

తెలుగులో 'పా..పా'



తమిళ బ్లాక్‌బస్టర్ 'డా..డా' మూవీని తెలుగులో 'పా..పా' టైటిల్‌తో జె.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రం డిసెంబరు 13న తెలుగు రాష్ట్రాలతోపాటు అమెరికా, ఆస్ట్రేలియాలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి, తమిళంలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'డా..డా' చిత్రం 'పా..పా' పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎంజీఎం సంస్థ నుంచి అచ్చిబాబు విడుదల చేస్తున్నారు' అని నిర్మాత నీరజ కోట తెలిపారు. సినిమాలో భాగ్యరాజా, వీటీవీ గణేశ్, ఐశ్వర్య, ప్రదీప్ శక్తి తదితరులు నటించారు.

గంధర్వకోట రహస్యం



కథానాయిక హన్సిక ప్రధాన పాత్రలో నటిస్తున్న హారర్ చిత్రం 'శ్రీ గాంధారి'. ఆర్. కన్నన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో రాజునాయక్ విడుదల చేస్తున్నారు. శతాబ్దాల నాటి గంధర్వకోటకు సంబంధించిన రహస్యాల నేపథ్యంలో కథ సాగుతుంది, మిస్టరీ, హారర్, సస్పెన్స్ అంశాలతో ఆసక్తికరంగా రూపొందిన చిత్రమిదని దర్శకుడు చెప్పారు.

విలేజ్ డ్రామా



సదన్, ప్రియాంక ప్రసాద్, హీరో హీరోయిన్లుగా పిఎల్ విఘ్నేశ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. విలేజ్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రాన్ని పిఎల్‌వి క్రియేషన్స్‌పై పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 13న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటిస్తూ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. సాయికుమార్ నటన ప్రత్యేకాకర్షణగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది.

మహిళలు సమాజ నిర్మాతలు



'మహిళలు సమాజ నిర్మాతలు అనే నిజాన్ని మనమంతా గుర్తుంచుకోవాలి' అని తెలంగాణ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. 'నారి' చిత్రం టైటిల్ పోస్టర్, గ్లింప్స్‌ని మంత్రి సీతక్క రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "నారి' సినిమా పెద్ద విజయాన్ని సాధించాలి. మహిళా సమస్యలపై మరిన్ని సినిమాలు చేయాలి' అని అన్నారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 25న విడుదల చేస్తున్నామని దర్శకనిర్మాతలు సూర్య వంటిపల్లి, శశి చెప్పారు.

చీరాలలో 'వీకెండ్'



విఐపి శ్రీ, ప్రియా దేశపాగ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'వీకెండ్'. ఖడ్గధార మూవీస్ బేనర్‌పై ఐ.డీ.భారతి నిర్మిస్తున్నారు. బి.రాము దర్శకత్వంలో పక్కా కమర్షియల్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీ షూటింగ్ చీరాలలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ప్రారంభమైంది. ఎన్ఆర్ఐ జయ కెమెరా స్విచ్చాన్ చేయగా, సీనియర్ ఆర్టిస్ట్ అజయ్ ఘోష్ క్లాప్ కొట్టారు. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ చీరాలలో జరుగుతుందని దర్శకనిర్మాతలు తెలిపారు.

సెమీస్‌కు హాకీ కుర్రాళ్లు

తైపీపై 16-0తో భారీ విజయం

మస్కట్: జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత కుర్రాళ్లు అదరగొడుతున్నారు. ఈ మెగా టోర్నీలో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ సాధించారు. దీంతో.. తమ గ్రూప్‌లో 9 పాయింట్లతో టాపర్‌గా నిలిచిన భారత జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. పూల్-ఎలో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 16-0తో చైనీస్ తైపీపై భారీ గెలుపును అందుకుంది. ప్రత్యర్థికి ఏ దశలోనూ అవకాశమివ్వకుండా విజృంభించిన భారత జట్టులో దిల్‌రాజ్ సింగ్ ఏకంగా నాలుగు గోల్స్ కొల్లగొట్టాడు. రోషన్ కుజూర్, సౌరబ్ ఆనంద్ చెరో మూడు గోల్స్ కొట్టారు. పూల్-ఎలో భారత్ తన ఆఖరి మ్యాచ్‌ను ఆదివారం కొరియాతో ఆడనుంది. సెమీఫైనల్స్ మంగళవారం నుంచి జరుగుతాయి. ఈ టోర్నీలో అత్యధికంగా నాలుగుసార్లు విజేతగా నిలిచిన భారత్.. ప్రస్తుత ఫామ్ ప్రకారం చూస్తే ఐదోసారి టైటిల్ ఎగరేసుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది.



మళ్లీ డ్రానే

- ఐదో గేమ్‌లో లిరెన్‌ను నిలువరించిన గుకేష్
- ప్రపంచ చాంపియన్‌షిప్

సింగపూర్: గ్రాండ్‌మాస్టర్లు గుకేష్, డింగ్ లిరెన్ మధ్య ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఐదో గేమ్ కూడా డ్రా అయింది. హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌ను డ్రా చేసేందుకు భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ చెమటోడ్చాల్సి వచ్చింది. శనివారం నాటి రౌండ్‌ను 40 ఎత్తుల తర్వాత ఫలితం లేకుండా ముగించేందుకు గుకేష్, లిరెన్ (చైనా) అంగీకరించారు. టోర్నీలో ఇది వరసగా మూడో డ్రా కావడం గమనార్హం. తొలి రౌండ్‌లో లిరెన్ నెగ్గగా, రెండు, నాలుగు గేమ్‌లు డ్రా అయ్యాయి. మూడో గేమ్‌లో గుకేష్ గెలిచాడు. ఇక 14 గేమ్‌ల ఈ ఫైనల్లో ఐదో రౌండ్ ముగిసే సరికి లిరెన్, గుకేష్ చెరో 2.5 పాయింట్లతో సమంగా నిలిచారు. టైటిల్ గెలవాలంటే ఇద్దరిలో ఏ ఆటగాడికైనా మరో ఐదు పాయింట్లు కావాలి. మొదట 7.5 పాయింట్లు సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు.

బీరాలు పలికి.. బెదిరిపోయి..!

దిగొచ్చిన పాకిస్థాన్ ● 'హైబ్రిడ్' చాంపియన్స్ ట్రోఫీకి ఓకే!


నఖ్వీ




జై షా

దుబాయ్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) దిగొచ్చింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అల్టిమేటానికి తలొగ్గింది. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ విధానం (భారత్ మ్యాచ్‌లను పాక్‌లో కాకుండా మరో దేశంలో నిర్వహించడం)లో నిర్వహించేందుకు అంగీకరించినట్టు సమాచారం. ఈమేరకు శనివారం జరిగిన ఐసీసీ బోర్డు సమావేశానికి తన సమ్మతిని తెలియజేసిందట. కాకపోతే..భారత్ ఆతిథ్యమిచ్చే భవిష్య ఐసీసీ టోర్నీలలో ఇదే హైబ్రిడ్ పద్ధతిని అనుసరించాలని కోరింది. మొత్తంగా పీసీబీ వెనక్కు తగ్గిన దరిమిలా ట్రోఫీ నిర్వహణపై స్పష్టత వచ్చింది. అయితే ఈ విషయాన్ని ఐసీసీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఐసీసీ కొత్త చీఫ్‌గా బీసీసీఐ కార్యదర్శి జై షా ఆదివారం బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో.. ఒకరోజు ముందే ఈ వివాదం ముగియనుండడం గమనార్హం. వాస్తవానికి ఈ వన్డే టోర్నీకి వచ్చే ఫిబ్రవరిలో పాకిస్థాన్ ఆతిథ్యమివ్వాల్సి ఉంది. అయితే భద్రతా కారణాలతో ఆ దేశానికి వెళ్లేందుకు భారత్ నిరాకరించిన నేపథ్యంలో టోర్నీని హైబ్రిడ్ విధానంలో జరిపే ప్రతిపాదనను ఐసీసీ తీసుకొచ్చింది. కానీ దానికి పీసీబీ ససేమిరా అనడంతోపాటు ఈవెంట్‌నే బహిష్కరిస్తామని బీరాలు పలికింది. ఇందుకు ఆగ్రహించిన ఐసీసీ.. 'హైబ్రిడ్'కు అంగీకరిస్తే సరి, లేదంటే టోర్నీ ఆతిథ్య హక్కులు వదులుకోవాలని శుక్రవారం హుకుం జారీ చేసింది. అంతేకాదు పాక్ జట్టు లేకుండా చాంపియన్స్ ట్రోఫీని నిర్వహిస్తామని కూడా హెచ్చరించింది. ఐసీసీ అల్టిమేటంతో హడలిపోయిన పాక్ బోర్డు పట్టు సడలించింది. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించేందుకు ఒప్పుకొంది. అయితే ఈ విధానంలో జరిపినా..ఫైనల్‌ను లాహోర్‌లోనే నిర్వహించాలని మెలిక పెట్టింది. కానీ, ఐసీసీ ఆ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చినట్టు సమాచారం. భారత్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ టోర్నీల్లో కూడా హైబ్రిడ్ విధానాన్నే అనుసరించాలన్న పీసీబీ డిమాండ్‌పైనా ఐసీసీ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 2031 వరకు మూడు పురుషుల ఐసీసీ టోర్నీలకు భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. 2026 టీ20 వరల్డ్ కప్‌ను శ్రీలంకతో కలిసి సంయుక్తంగా, 2029 చాంపియన్స్ ట్రోఫీని, 2031 వన్డే ప్రపంచ కప్‌ను బంగ్లాదేశ్‌తో కలిసి భారత్ నిర్వహించాల్సి ఉంది. వీటిల్లో 2026, 2031 టోర్నీలకు శ్రీలంక, బంగ్లాదేశ్ ఆతిథ్య దేశాలు కావడంతో ఎలాంటి సమస్యా ఉండకపోవచ్చు. ఎటొచ్చీ 2029 చాంపియన్స్ ట్రోఫీతోనే చిక్కు. కారణం ఆ టోర్నీ ఏకైక ఆతిథ్య దేశం భారత్ కావడమే.

క్రికెట్ గెలవాలి..

క్రికెట్ గెలవాలనే ఉద్దేశంతోనే తాము హైబ్రిడ్ విధానానికి అంగీకరించామని పీసీబీ చైర్మన్ మొహిసిన్ నఖ్వీ చెప్పుకొచ్చాడు. 'మేం ఎలాంటి ఫార్ములా ప్రతిపాదించినా, అంతిమంగా క్రికెట్ గెలవడం ముఖ్యం' అని నఖ్వీ అన్నాడు. అంతకుముందు ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు చీఫ్ ముబాషిర్ ఉస్మానీని దుబాయ్‌లో నఖ్వీ కలిశాడు. దాంతో చాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ పద్ధతికి పాకిస్థాన్ అంగీకరించిందని తెలిపోయింది.


జాన్సెన్

దక్షిణాఫ్రికా ఘన విజయం

డర్బన్: శ్రీలంకతో తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 233 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. పేసర్ జాన్సెన్ మొత్తంగా 11 వికెట్లు తీసి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో రెండు టెస్టుల ఈ సిరీస్‌లో సఫారీ జట్టు 1-0తో ఆధిక్యంలో నిలిచింది. 516 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన లంక నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌లో 282 రన్స్‌కు కుప్పకూలింది. చాందిమల్ (83), ధనంజయ (59), కుశాల్ మెండిస్ (48) రాణించారు. జాన్సెన్‌కు 4.. రబాడ, కొట్జీ, కేశవ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 191, లంక 42 రన్స్ చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 366/5 (డిక్లేర్డ్) స్కోరు చేసింది. దీంతో డబ్ల్యూటీసీ పట్టికలో సఫారీలు రెండో స్థానానికి ఎగబాకారు. భారత్ టాప్‌లో ఉంది.



ధ్రువ్
తనీషా

మన షట్లర్లు.. అదరగొట్టారు

ఐదు విభాగాల్లోనూ ఫైనల్స్‌కు

- సింగిల్స్ తుదిపోరుకు సింధు, లక్ష్య సేన్
- డబుల్స్‌లో గాయత్రి, మిక్స్‌డ్‌లో తనీషా జోడీలు

లఖ్‌నవూ: సొంతగడ్డపై జరుగుతున్న సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు సత్తా చాటారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్.. ఇలా ప్రతి విభాగంలోనూ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, మహిళల్లో రెండుసార్లు విజేత పీవీ సింధు, పురుషుల డబుల్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి/సాయి ప్రతీక్, మహిళల్లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్యాస్ట్రో/ధ్రువ్ కపిల తుది పోరులో నిలిచారు. సెమీఫైనల్లో టాప్ సీడ్ సింధు 21-12, 21-9తో భారత్‌కే చెందిన 17 ఏళ్ల సంచలనం ఉన్నతి హుడా జోరుకు బ్రేక్ వేసింది. సింధు ఆదివారం జరిగే ఫైనల్లో వూ లూ యూ (చైనా)తో అమీతుమీ తేల్చుకోనుంది. టాప్ సీడ్ లక్ష్య 21-8, 21-14తో షొగో ఒగావ (జపాన్)ను ఓడించి జియా హెంగ్ జాసన్ (సింగపూర్)తో ఫైనల్‌కు సిద్ధమయ్యాడు. పురుషుల డబుల్స్ సెమీస్‌లో పృథ్వీ/ప్రతీక్ ద్వయం 21-17, 17-21, 21-16తో భారత్‌కే చెందిన ఇషాన్/శంకర్‌పై, మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జంట 18-21, 21-18, 21-10తో థాయ్‌లాండ్ జోడీ బెన్యపా ఐంసార్డ్/నుంటకర్న్ ఐంసార్డ్‌పై నెగ్గగా.. మరో భారత ద్వయం అశ్వినీ పొన్నప్ప/తనీషా 21-14, 16-21, 13-21తో చైనా జోడీ బావో లి జింగ్/లి కియాన్ చేతిలో ఓటమి పాలైంది. మిక్స్‌డ్ సెమీస్‌లో ఐదో సీడ్ తనీషా/ధ్రువ్ జంట 21-16, 21-15తో చైనా జోడీ జి హోంగ్ జు-జి యా యి యాంగ్‌పై గెలిచింది.

యువ భారత్‌కు పాక్ ఝలక్

అండర్-19 ఆసియాకప్

దుబాయ్: అండర్-19 ఆసియాకప్‌ను భారత కుర్రాళ్లు పేలవంగా ఆరంభించారు. శనివారం గ్రూప్ 'ఎ'లో భాగంగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో భారత్ 44 పరుగులతో ఓటమి పాలైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్.. ఓపెనర్ షాజైబ్ ఖాన్ (159) రికార్డు శతకంతో చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 281 పరుగులు సాధించింది. మరో ఓపెనర్ ఉస్మాన్ ఖాన్ (60) హాఫ్ సెంచరీ సాధించాడు. షాజైబ్, ఉస్మాన్ తొలి వికెట్‌కు 160 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ టోర్నీ చరిత్రలో పాక్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన షాజైబ్.. ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (10) బాదిన బ్యాటర్‌గానూ నిలిచాడు. సమర్థ్ నాగరాజ్‌కు మూడు, ఆయుష్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 47.1 ఓవర్లలో 238 పరుగులకే కుప్పకూలింది. నిఖిల్ కుమార్ (60) ఒక్కడే ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత పదో నెంబర్ బ్యాటర్ మహ్మద్ ఇనాన్ (30)ది రెండో అత్యధిక స్కోరు. ఇక ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకున్న పిన్న వయస్కుడు.. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కేవలం ఒక్క పరుగుతో నిరాశపర్చాడు. అలీ రజాకు 3.. ఫహమ్, సుభాన్ రెండేసి వికెట్లు తీశారు.


వైభవ్ సూర్యవంశీ (1)

టైటాన్స్ పరాజయం

నొయిడా: ఆల్‌రౌండర్ విజయ్ మాలిక్ 17 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా తెలుగు టైటాన్స్‌ను గెలిపించలేకపోయాడు. ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 28-41 తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో ఓడింది. జైపూర్ తరఫున నీరజ్ నర్వాల్, అర్జున్ దేశ్వాల్ సూపర్-10లు సాధించారు. ఫస్టాఫ్ హోరాహోరీగా సాగినా.. సెకండాఫ్‌లో పాంథర్స్ రైడింగ్, డిఫెన్స్‌లో మెరుగైన ప్రదర్శనతో మ్యాచ్‌ను సొంతం చేసుకొంది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 54-29తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది.

తొలిరోజు వర్షార్పణం

భారత్‌తో ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్ ప్రాక్టీస్ మ్యాచ్


కాన్‌బెర్రాలో ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో భారత ఆటగాళ్లు

కాన్‌బెర్రా: ఎడతెరిపిలేని వర్షం కారణంగా.. భారత్, ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్ జట్ల మధ్య శనివారం నుంచి జరగాల్సిన రెండ్రోజుల పింక్ బాల్ ప్రాక్టీస్ మ్యాచ్ తొలిరోజు ఆట రద్దయింది. దీంతో ఆదివారం వాతావరణం మెరుగుపడితే 50 ఓవర్ల చొప్పున మ్యాచ్ ఆడడానికి ఇరు జట్లూ అంగీకరించాయి. ఫలితంగా పెర్త్ టెస్ట్‌కు దూరమైన రోహిత్, గిల్‌కు అవసరమైనంత ప్రాక్టీస్ లభించలేదు. ఈనెల 6 నుంచి అడిలైడ్‌లో ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య పింక్ బాల్ టెస్ట్ జరగనుంది.

ఇంగ్లండ్ 499

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. హ్యారీ బ్రూక్ (171), కెప్టెన్ స్టోక్స్ (80), పోప్ (77)లతో పాటు టెయిలెండర్లు అట్కిన్సన్ (48), కార్స్ (33 నాటౌట్) విశేషంగా రాణించడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 499 పరుగుల భారీ స్కోరు సాధించింది. హెన్రీకి 4, స్మిత్‌కు 3, సౌథీకి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో తడబడిన కివీస్ మూడో రోజైన శనివారం ఆట ముగిసే సరికి 155/6 స్కోరుతో నిలిచింది. కేన్ విలియమ్సన్ (61) అర్ధసెంచరీ చేశాడు. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 348 రన్స్ సాధించింది.

కంపెనీల యాజమాన్యాలకు ఈపీఎఫ్‌ఓ ఆమ్నెస్టీ పథకం

ఆమోదించిన ధర్మకర్తల మండలి

న్యూఢిల్లీ: కంపెనీల యాజమాన్యాలు తమ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) చందా బకాయిలను ఎలాంటి పెనాల్టీ లేకుండా చెల్లించేందుకు వీలుగా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) ఆమ్నెస్టీ (క్షమాభిక్ష) పథకాన్ని ప్రకటించింది. కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా నేతృత్వంలోని ఈపీఎఫ్‌ఓ ధర్మకర్తల కేంద్ర మండలి (సీబీటీ) ఈ పథకానికి ఆమోదం తెలిపింది. కేంద్ర కార్మిక శాఖ శనివారం ఈ విషయాన్ని వెల్లడించింది. కంపెనీలు తమ ఉద్యోగుల ఖాతాల్లో పీఎఫ్ చందాను ప్రతి నెలా నిర్దేశిత గడువులోగా జమ చేయాల్సి ఉంటుంది. అయితే, ఉద్యోగుల ఖాతాల్లో పీఎఫ్ సొమ్మును జమ చేయడంలో పూర్తిగా లేదా పాక్షికంగా విఫలమైన లేదా ఎగవేసిన కంపెనీల యాజమాన్యాలు స్వచ్ఛందంగా తమ తప్పును అంగీకరించడంతో పాటు ఆ బకాయిలను పెనాల్టీ లేదా చట్టపరమైన చర్యల నుంచి మినహాయింపుతో జమ చేసేందుకు ఆమ్నెస్టీ పథకం అనుమతిస్తుంది. ఆన్‌లైన్ డిక్లరేషన్ ద్వారా కంపెనీలు ఈ ప్రయోజనాలను పొందవచ్చు.

EPFO

మరిన్ని విషయాలు..

- ఈపీఎఫ్ పథకం -1952లో సవరణలకూ ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. ఈ సవరణ ఫలితంగా ఈపీఎఫ్‌ఓ తన చందాదారులకు పీఎఫ్ సొమ్ము క్లెయిమ్‌లపై సెటిల్‌మెంట్ తేదీ వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. ఏదైనా నెలలో 24వ తేదీ వరకు పరిష్కరించే క్లెయిమ్‌లకు అంతక్రితం నెల వరకే ఈపీఎఫ్‌ఓ వడ్డీ చెల్లిస్తోంది. తాజా నిబంధన సవరణతో పీఎఫ్ చందాదారులకు మరింత లబ్ధి చేకూరనుంది.
- ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్ఐ) ప్రయోజనాల పొడిగింపును ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచే అమలు చేసేందుకూ ధర్మకర్తల మండలి ఆమోదించింది. దురదృష్టవశాత్తూ పీఎఫ్ చందాదారు మరణిస్తే, తన కుటుంబ సభ్యులకు ఈ బీమా పథకం కింద రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు లభిస్తుంది.
- గృహ కొనుగోలు లేదా నిర్మాణం, పెళ్లి, విద్య అవసరాల కోసం అడ్వాన్స్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ పరిమితిని రూ.50,000 నుంచి రూ.లక్షకు పెంచేందుకు మండలి అనుమతిచ్చింది.

పన్ను తగ్గింపుతో కంపెనీలకు రూ.3 లక్షల కోట్లు ఆదా!

2019లో కార్పొరేట్ ట్యాక్స్ తగ్గించిన కేంద్రం ..

ఆ తర్వాత గణనీయంగా తగ్గుతూ వచ్చిన కార్పొరేట్ పన్నుల రాబడి వాటా



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2019లో కార్పొరేట్ పన్ను తగ్గించడంతో గడిచిన ఐదేళ్లలో దేశీయ కార్పొరేట్ రంగానికి పన్ను చెల్లింపుల రూపంలో రూ.3 లక్షల కోట్ల వరకు ఆదా అయి ఉండవచ్చని నిపుణుల అంచనా. అందులో బడా కంపెనీలకే (బీఎస్ఈ 500 సూచీ నమోదిత సంస్థలు) అధిక ప్రయోజనం చేకూరిందని వారన్నారు. గడిచిన దశాబ్ద కాలంలో (2012-13 నుంచి) పలు పన్ను మినహాయింపుల ద్వారా కార్పొరేట్ రంగానికి చేకూరిన రూ.8 లక్షల కోట్లకు పైగా లబ్ధికి ఇది అదనమని వారన్నారు. అప్పటివరకు కల్పిస్తూ వచ్చిన ప్రోత్సాహకాలను హేతుబద్ధీకరించడంతో పాటు దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు, ఉద్యోగావకాశాలను, కంపెనీల పోటీ సామర్థ్యాన్ని పెంచేందుకు కార్పొరేట్ పన్నును తగ్గించినట్లు ప్రభుత్వం సమర్థించుకుంది. కానీ, ఆ తర్వాత మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్ పన్ను వాటా గణనీయంగా తగ్గిందని.. దాంతో ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం వెచ్చించగలిగే సామర్థ్యాన్ని పరిమితం చేసిందన్నారు. 2019 సెప్టెంబరు 20న మోదీ సర్కారు అప్పటికే మనుగడలో ఉన్న కంపెనీలకు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి.. కొత్త మాన్యుఫాక్చరింగ్ కంపెనీలకు 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించింది.

కార్పొరేట్ల లాభాలు అప్.. పన్ను వృద్ధి డౌన్

2018-19 ఆర్థిక సంవత్సరంతో ముగిసిన ఐదేళ్లలో కంపెనీల లాభాలు 10.4 శాతం చొప్పున వృద్ధి చెందగా.. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్లలో కంపెనీల లాభాలు 32.5 శాతం పెరిగాయి. మరీ ముఖ్యంగా 2020-21లో కొవిడ్ సంక్షోభం వ్యాపారాలను కుదిపేసినప్పటికీ సంస్థల లాభాలు వేగంగా పెరగడం గమనార్హం. కాగా, గత ఐదేళ్లలో కార్పొరేట్ల పన్ను చెల్లింపులు మాత్రం 18.6 శాతమే పెరిగాయి.

26.5 శాతానికి తగ్గిన కార్పొరేట్ పన్ను ఆదాయం వాటా

2017-18 ఆర్థిక సంవత్సరానికి మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్ ట్యాక్స్ వాటా దాదాపు 32 శాతంగా ఉండేది. ఆ తర్వాత కాలంలో కార్పొరేట్ పన్నుల వాటా తగ్గుతూ రాగా.. వ్యక్తిగత పన్ను ఆదాయం వాటా పెరుగుతూ వచ్చింది. 2024-25 బడ్జెట్ అంచనాల ప్రకారం.. మొత్తం పన్ను ఆదాయంలో ఈ విభాగ వాటా దశాబ్ద కనిష్ఠ స్థాయి 26.5 శాతానికి తగ్గనుంది. వ్యక్తిగత ఆదాయ పన్నుల వాటా 30.91 శాతానికి, జీఎస్‌టీ రెవెన్యూ వాటా 27.65 శాతానికి పెరగనుంది.

ఈ ప్రథమార్ధంలోనూ అంతే..

కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) డేటా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ప్రథమార్ధంలో (ఏప్రిల్-సెప్టెంబరు) మొత్తం పన్ను ఆదాయం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.18.1 లక్షల కోట్లకు చేరుకోగా.. అందులో కార్పొరేట్ పన్ను రాబడి కేవలం 2.3 శాతం వృద్ధితో రూ.4.6 లక్షల కోట్లకు పరిమితమైంది. వ్యక్తిగత పన్నుల ఆదాయం మాత్రం ఏకంగా 25 శాతం పెరిగి రూ.5.6 లక్షల కోట్లకు చేరుకుంది. ఇదే కాలానికి జీఎస్‌టీ రెవెన్యూలో సైతం 10.4 శాతం వృద్ధితో రూ.5.16 లక్షల కోట్లకు, కస్టమ్ సుంకాల ద్వారా ఆదాయమూ 6.4 శాతం పెరిగి రూ.1.12 లక్షల కోట్లకు చేరుకుంది. 2024-25 బడ్జెట్‌లో మొత్తం పన్ను ఆదాయాన్ని రూ.38.40 లక్షల కోట్ల స్థాయిలో అంచనా వేయగా.. ప్రథమార్ధంలో అందులో 47.2 శాతానికి సమానమైన ఆదాయం సమకూరింది. కార్పొరేట్ పన్ను ఆదాయం అంచనాలో మాత్రం 45.2 శాతమే సమకూరగా.. వార్షిక అంచనాలో వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 47.6 శాతానికి, జీఎస్‌టీ రాబడి 48. శాతంగా నమోదైంది.

బిజినెస్

నయా ఫండ్స్..

కోటక్ ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్ ఫండ్

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (కేఎంఏఎంసీ).. కోటక్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్ సహా ఇతర అనుబంధ రంగాల్లో ఉన్న కంపెనీలకు చెందిన ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ఈ పథకం ముగింపు తేదీ డిసెంబరు 9.

ఇన్వెస్కో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్

ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్.. ఇండియా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఈక్విటీ, డెట్, గోల్డ్ ఈటీఎఫ్/సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ పథకం ఇది. కాగా అవకాశాలను బట్టి ఈ ఫండ్ తన నికర ఆస్తుల్లో 35 శాతం వరకు విదేశీ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసే వీలుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000.సిప్ రూపంలో అయితేరూ.500 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ డిసెంబరు 11.

- శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.. ప్రచారకర్త రాహుల్ ద్రవిడ్‌తో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఖాతాదారులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన తోడ్పాటును అందించేందుకు 'ఒక్కటిగా ఎదుగుదాం' పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం లేదా వ్యక్తిగత రుణాలు ఇతరత్రా వాటిల్లో త్వరితగతిన వారికి తోడ్పాటునందించనుంది.
- మెడ్‌టెక్ కంపెనీ మెరిల్ లైఫ్ సైన్సెస్.. లండన్‌లో జరుగుతున్న జీబీఎస్‌ఈ, పీసీఆర్ లండన్ వాల్వ్స్-2024 సదస్సులో మైవాల్ ఆక్టాప్రో ట్రాన్స్‌కాథెటర్ హార్ట్ వాల్వ్ (టీహెచ్‌వీ)ను విడుదల చేసింది. గుండెకు సంబంధించిన వ్యాధులను తగ్గించటంలో ఇది కీలకంగా ఉండనుంది.

టర్నోవర్ రూ.50 లక్షలు దాటిందా..?

నవీన్ చంద్ర ఒక వస్త్ర వ్యాపారి. రాష్ట్రవ్యాప్తంగా పలు ముఖ్య పట్టణాల్లో షోరూమ్స్ నిర్వహిస్తున్నారు. వ్యాపారం విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉంటాడో, ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నుల విషయంలోనూ అంతే కచ్చితత్వం పాటిస్తాడు. కట్టాల్సిన పన్నులకు బకాయిలను సకాలంలో చెల్లించాల్సిందిగా తన సిబ్బందికి చెబుతుంటాడు. అలాంటిది, డిపార్ట్‌మెంట్ నుంచి తనకు ఒక నోటీస్ అందింది. గడిచిన కొన్ని నెలల్లో తాను కట్టాల్సిన పన్ను మొత్తం అంటే 100 శాతం పన్ను మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారానే చెల్లించారనీ, జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే చెల్లించాల్సిన పన్నులో 99 శాతం మాత్రమే ఐటీసీ ద్వారా చెల్లించి మిగతా మొత్తాన్ని నగదు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా వాడాల్సి ఉండగా మొత్తం పన్నును ఐటీసీ ద్వారా చెల్లించటం చట్ట ఉల్లంఘన కిందకు వస్తుందని, కాబట్టి ఆ తేడా మొత్తాన్ని వెంటనే చెల్లించమని తెలపటం జరిగింది. తనకు చట్ట ప్రకారం అర్హత ఉన్న ఇన్‌పుట్స్ మీదనే క్రెడిట్ తీసుకున్నాడు. ఆ క్రెడిట్‌నే పన్ను చెల్లింపునకు ఉపయోగించాడు. పన్ను మొత్తాన్ని క్రెడిట్ ద్వారా చెల్లించకూడదా? అసలు ఈ 99 శాతం లెక్కేమిటీ?

ఐటీసీని తీసుకోవటానికి నియమ నిబంధనలు ఎలా ఉన్నాయో తీసుకున్న క్రెడిట్‌ను వాడుకోవటానికి కూడా అలాగే నిబంధనలు ఉన్నాయి. పన్ను చెల్లించేటప్పుడు ముఖ్యంగా ఐటీసీ ద్వారా పన్ను చెల్లించేటప్పుడు ఈ విషయాలు తెలుసుకోవాలి. ఏదైనా నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు మించితే అప్పుడు ఈ 99 శాతం రూల్ అమల్లోకి వస్తుంది. అంటే చెల్లించాల్సిన పన్నులో 99 శాతానికి మించి ఐటీసీ వాడకూడదు. దీని అర్థం మిగతా ఒక శాతం కచ్చితంగా నగదు చెల్లింపు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి అని.



రాంబాబు గొండాల

మరి టర్నోవర్ అంటే ఏమి తీసుకోవాలి? ఇందులో నెలలో జరిగిన మొత్తం సరఫరాల విలువ నుంచి పన్ను మినహాయింపు ఉన్న సరఫరాల విలువ, జీరో రేటెడ్ సరఫరాల విలువ మినహాయించాలి (జీరో రేటెడ్ సరఫరా అంటే ఎగుమతులకు లేదా సెజ్‌లకు పంపిన సరఫరా). ఇలా మినహాయించగా మిగిలిన మొత్తాన్ని టర్నోవర్ కింద లెక్కించాలి. ఇలా లెక్కించిన టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే ఈ నిబంధన వర్తిస్తుంది. అలా అని రూ.50 లక్షల టర్నోవర్ దాటిన ప్రతి కేసులోనూ ఈ 99 శాతం రూల్ అమలవుతుందని అనుకోకూడదు. దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి. అవేమిటంటే..

- గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాలలోనూ రిజిస్ట్రేషన్ పొందిన సంస్థ లేదా వ్యక్తి రూ.లక్ష మించి ఆదాయ పన్ను (ఐటీ) కట్టి ఉన్నా లేదా గడచిన ఆర్థిక సంవత్సరం సదరు సంస్థ లేదా వ్యక్తి రూ.లక్ష మించి రిఫండ్ పొంది ఉన్నా (ఈ రిఫండ్ అనేది పన్ను చెల్లించకుండా చేసే జీరో రేటెడ్ సరఫరాలకు లేదా ఇన్వర్టెడ్ ట్యాక్స్ స్ట్రక్చర్‌కు సంబంధించినవి అయి ఉండాలి) లేదా ఇప్పటి వరకు అయిన టర్నోవర్ మీద ఇప్పటికే నగదులో ఒక శాతానికి మించి కట్టి ఉన్నా. ఇలాంటి సందర్భాల్లో ఈ రూల్ అమలు కాదు. మిగతా అన్ని సందర్భాల్లోనూ ఎప్పుడైతే టర్నోవర్ రూ.50 లక్షలు దాటుతుందో అప్పుడు కనీసం ఒక్క శాతం పన్ను క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి.
- కాబట్టి జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తులు, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను తీసుకోవటానికి గల నియమ నిబంధనలతో పాటుగా తీసుకున్న క్రెడిట్‌ను ఎలా వాడాలి? ఎంత మేర వాడాలి? ఇతరత్రా నియమ నిబంధనలు కూడా తెలుసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



డిసెంబరు 1			
హైదరాబాద్	605	విజయవాడ	610
వరంగల్	607	గోదావరి	600
చిత్తూరు	633	విశాఖపట్నం	590
		డజను గుడ్లు రూ. 84	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▼	71,500 ▼	1,00000 ▲
ముంబై	76,740 ▲	70,290 ▲	89,380 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	104
వరంగల్	95	గుంటూరు	104
కరీంనగర్	95	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	99
కర్నూలు	95	నెల్లూరు	99
విశాఖపట్నం	105	అనంతపురం	99
గోదావరి	104		

ఇది దొరల ప్రభుత్వం కాదు: భట్టి విక్రమార్క



గత ఏడాది కాలంగా రాష్ట్రంలో దొరల ప్రభుత్వం కాదు.. ప్రజల ప్రభుత్వం నడుస్తోంది. కానీ, బీఆర్ఎస్ పార్టీ మాత్రం 'ప్రజల వద్దకు పోతాం.. ఉద్యమం చేస్తాం.. నిలదీస్తాం' అంటూ రకరకాల ప్రకటనలు చేస్తోంది. పదేళ్లలో వాళ్లు వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేశారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు అలాగే ఉంటే.. కేసీఆర్ హయాంలో కట్టిన కాళేశ్వరం కుంగింది. కృష్ణా, గోదావరి ప్రాంతాల్లో వాళ్లు ఎడారిని చేస్తే.. మేం ఎస్ఎల్‌బీసీ, పీఆర్ఎస్ఐ పూర్తిచేయడానికి ప్రయత్నిస్తున్నాం. పదేళ్లలో లక్ష రుణమాఫీ చేస్తే వడ్డీకే సరిపోయాయి. ఇచ్చిన మాట ప్రకారం రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశాం. పదేళ్లలో పంట నష్టపరిహారం ఇచ్చిన పాపాన పోలేదు. మేం రూ.100 కోట్ల నష్టపరిహారం చెల్లించాం. రూ.1433 కోట్లతో రైతు బీమా సొమ్ము చెల్లించాం. డ్రిప్, స్ప్రింక్లర్, పాలీహౌజ్, ఫామ్ మెకనైజేషన్, సబ్సిడీకి నిధులు కేటాయించాం. వ్యవసాయ రంగానికి రూ.73 వేల కోట్లు కేటాయింపులు చేస్తున్నాం.

ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను సరిచేశాం: తుమ్మల



రాష్ట్రంలో పదేళ్లపాటు జరిగిన ఆర్థిక, పాలన విధ్వంసాన్ని సరి చేశాం. పెను భారం మోస్తూ కూడా హామీలను అమలు చేస్తున్నాం. రైతు బీమా, మద్దతు ధర, రూ.2 లక్షల రుణమాఫీ వంటివి అమలు చేస్తున్నాం. రైతులంతా ఆయిల్‌పామ్ పంట వేయాలి. ఇంటి దగ్గరకే వచ్చి పంట ఉత్పత్తిని కొనుగోలు చేస్తారు. నాలుగేళ్లలో అన్ని జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు పెడతాం.

నాడు రింగ్ రోడ్డు అమ్మి రుణమాఫీ: జూపల్లి



బీఆర్ఎస్ హయాంలో రింగ్ రోడ్డు అమ్మి.. రూ.11వేల కోట్ల రుణమాఫీ చేస్తే అది మిత్తికే సరిపోయింది. పాలమూరు బిడ్డ సీఎం కావడం ఇక్కడి ప్రజల అదృష్టం. వైఎస్ ఉన్నప్పుడు కేఎల్ఐ, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, బీమా ప్రాజెక్టులను ప్రారంభించారు. అవి ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని అమలులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

సీఎం రేవంత్ దార్శనికత: దామోదర



ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, ఎన్ని విపత్కర పరిస్థితులు ఉన్నా దార్శనికతతో సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ చేశారు. దేశ చరిత్రలో ఇంతమొత్తంలో రుణమాఫీ చేసిన రాష్ట్రం లేదు. వ్యవసాయం దండగ కాదు పండగ అని వైఎస్ఆర్ నిరూపించారు. ఈ రోజు రేవంత్‌రెడ్డి కూడా సంవత్సరం లోపలే రైతు పండుగ నిర్వహించడం శుభపరిణామం. కులగణనతో సామాజిక సమానత్వానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ఏకకాలంలో రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే: సీతక్క



దేశంలో ఏకకాలంలో 18 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డిదే. బీఆర్ఎస్ నేతలు రుణమాఫీపై అవాకులు పేలుతున్నారు. 2018-23 మధ్య వారు 11 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేశారు. రాష్ట్రంలో అప్పుల కుప్ప ఉన్నప్పటికీ సంక్షేమంలో వెనక్కి తగ్గడం లేదు.

కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం: మహేశ్ గౌడ్



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే రైతు సంక్షేమం జరిగింది. బీఆర్ఎస్ హయాంలో రైతు కంట కన్నీరు.. కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో పన్నీరు అన్నట్లుగా పరిస్థితి ఉండేది. కానీ, మేం.. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకకాలంలో రుణమాఫీ చేశాం. రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం.


రైతులూ.. ఉచ్చులో పడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో 2 కోట్ల ఎకరాల భూమి ఉందని, కేవలం 1300 ఎకరాలు సేకరించి.. పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇద్దామనుకుంటే అమాయక గిరిజనులను అడ్డుపెట్టుకొని లగచర్లలో మంటలు రేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌పై, అధికారులపై దాడి చేసే వరకు వివాదం చేశారని ధ్వజమెత్తారు. రైతులు భూములు ఇస్తే తానేమైనా చాపలా చుట్ట చుట్టుకొని కొండారెడ్డిపల్లికో, హైదరాబాద్‌కో తీసుకుపోతానా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని, హరీశ్‌రావు, కేటీఆర్‌లకు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని తెలిపారు. రైతుకు భూమి తల్లి లాంటిదని, భూసేకరణలో కొంత నష్టం జరిగినా.. రూ.10 లక్షలు కాకపోతే రూ.20 లక్షల చొప్పున ఇస్తానన్నారు. సంతకం పెట్టి ఇంటికి తెచ్చి ఇస్తారని, సహకరించాలని కోరారు. ఇంటికో ఉద్యోగం వస్తే ఒక తరం రాతే మారిపోతుందని తెలిపారు.

ఎవరు అడ్డొచ్చినా ఆగదు..

ఎవరు అడ్డొచ్చినా, ఆటంకాలు సృష్టించినా.. తనను ఆశీర్వదించిన కొడంగల్‌కు పరిశ్రమలు తీసుకెళ్లి తీరతానని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. అక్కడి యువతకు 25 వేల ఉద్యోగాలు ఇచ్చి అభివృద్ధి చేసుకుంటానని, తనను ఆదరించి, ఆశీర్వదించిన ప్రాంతం రుణం తీర్చుకుంటానని ప్రకటించారు. నల్లమలలో పులులను, మృగాలను చూసిన తనకు మానవ మృగాలంటే భయం లేదని వ్యాఖ్యానించారు. "మొసలికన్నీరు కారుస్తున్న హరీశ్‌రావ్.. మల్లన్నసాగర్‌లో బీఆర్ఎస్ అరాచకాలను భరించలేక చితి పేర్చుకొని సజీవ దహనమైన రైతు మల్లారెడ్డి ఇంటికి పోదామా?" అని రేవంత్ ధ్వజమెత్తారు. పనిచేసే క్రమంలో తాము చేసింది చెప్పుకోవడం మరిచిపోయామని, కష్టపడి పనిచేయడం తప్ప.. పాలమూరు బిడ్డలకు ఏమీ తెలియదని వ్యాఖ్యానించారు. ఇకపై తాను ఎవరినీ ఏమీ అనదలచుకోలేదని, రైతులే తనకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారి ప్రభుత్వ అభివృద్ధిని నలుదిక్కులా చాటాలని, ఒక్కో రైతు ఒక్కో రేవంత్‌రెడ్డి కావాలని అన్నారు.



రైతు పండుగ బహిరంగ సభలో రూ. 2,747 కోట్ల పంట రుణ మాఫీ చెక్కుతో సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు ఉత్తమ్, తుమ్మల, దామోదర, కోమటిరెడ్డి

అప్పుల కుప్పగా మార్చారు..

సమైక్య పాలనలో సీమాంధ్ర వారు పాలమూరును అభివృద్ధి చేయలేదని ఉద్యమం చేసి స్వరాష్ట్రాన్ని తెచ్చుకుంటే.. పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బాధ్యతగా పనిచేస్తూ రూ.60 వేల కోట్ల రుణాలు చెల్లించామని చెప్పారు. రుణమాఫీ, కనీస మద్దతు ధర, ఉచిత విద్యుత్, పంటలకు బోనస్.. వంటివన్నీ కాంగ్రెస్ పార్టీ పేటెంట్లు అని చెప్పారు. నెహ్రూ హయాం నుంచి కాంగ్రెస్ పాలనలో కట్టిన నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు ఎంత వరద వచ్చినా నిటారుగా నిలబడి నేటికీ రైతుల సేవలో ఉన్నాయని తెలిపారు. కానీ, రూ. 1.02 లక్షల కోట్లు ఖర్చు చేసి కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం కుప్పకూలిందని విమర్శించారు. కాళేశ్వరం నుంచి నీరివ్వకున్నా 66 లక్షల పైచిలుకు ఎకరాల్లో రైతులు వరి సాగు చేసి రికార్డు స్థాయిలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేశారని చెప్పారు. గత ప్రభుత్వం 'వరి వేస్తే.. ఉరి' అని చెప్పిందని, తాము వచ్చాక వరికి రూ.500 బోనస్ ఇస్తున్నామని సీఎం రేవంమత్ గుర్తుచేశారు. మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు పడుతుంటే బీఆర్ఎస్ నేతల గుండెల్లో పిడుగులు పడుతున్నాయని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్టులకు రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ చెప్పారు.

ఏక మొత్తంలో రుణమాఫీ..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో.. మొదటి దఫా రూ.లక్ష రుణమాఫీ నాలుగు విడతల్లో చేస్తే అది వడ్డీకే సరిపోయిందన్నారు. ఇక రెండోసారి రూ.లక్ష రుణమాఫీ నాలుగేళ్లు చేయకుండా చివరిలో ఔటర్ రింగ్ రోడ్డు అమ్మి రూ.11 వేల కోట్లు మాఫీ చేశారని తెలిపారు. కానీ, వడ్డీకి రూ. 8500 కోట్లు పోగా కేవలం రూ. 2500 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయన్నారు. అలాంటి పరిస్థితి మళ్లీ రావొద్దనే కేబినెట్ మంత్రులతో చర్చించి ఏకమొత్తంలో రుణమాఫీ చేశామని వివరించారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోపే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత దేశంలో తమకే దక్కిందన్నారు. ప్రధానమంత్రి మోదీ గానీ, కేసీఆర్ గానీ తాను రుణమాఫీ చేయలేదని నిరూపించగలరా? అని సీఎం సవాల్ విసిరారు. పది నెలల కాలంలోనే రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు 1.73 కోట్ల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీలో ప్రయాణించేలా పథకం పెట్టామని అన్నారు. రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, డైట్ కోసం 40% నిధుల పెంచామని అన్నారు. ఇందుకు అప్పులు చేయలేదని, కోకాపేటలో భూములు అమ్మలేదని చెప్పారు. రైతులకు రూ.52వేల కోట్ల పైచిలుకు బడ్జెట్‌ను కేటాయించామని, అప్పులకే రూ.60 వేల కోట్లు చెల్లించామని తెలిపారు. కేసీఆర్ కుటుంబం చేసిన దోపిడీ భారాన్ని ప్రభుత్వం మోయాల్సి వస్తోందన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎవరికీ సీఎంను కలిసే భాగ్యమే లేదని, ఇప్పుడు 'రేవంతన్నా' అంటే పలుకుతున్నానని చెప్పారు.

ఐదేళ్లలో పాలమూరుకు లక్ష కోట్లు..

పాలమూరు ప్రజలు గుంపు మేస్త్రీల ఆధ్వర్యంలో బొంబాయి, దుబాయి, ఇతర రాష్ట్రాలకు తట్ట, మట్టి, పార పనికి వలస వెళ్లారని సీఎం రేవంత్ అన్నారు. వందలాది బస్సుల్లో ప్రజలు వలస పోతుంటే తమకూ ఓ రోజు వస్తుందని ఎదురు చూశామన్నారు. 70 ఏళ్ల తరువాత పాలమూరుకు అవకాశం వచ్చిందని, ఇప్పుడు కచ్చితంగా అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రకటించారు. పాలమూరుకు ఏటా రూ.20 వేల కోట్ల నిధులు ఇవ్వాల్సిందిగా క్యాబినెట్ సహచరులను కోరానని, ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు తెచ్చి పసిడి పంటల పాలమూరును చేసి చూపిస్తానని చెప్పారు.

శభాష్ తుమ్మల

రైతు పండుగను విజయవంతం చేయడంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంతో కృషి చేశారని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు రైతు పండుగను నిర్వహించగా.. స్టాళ్ల ఏర్పాటు, రైతులకు శాస్త్రవేత్తల సూచనలు అందేలా చూడటం, నూతన వంగడాలు, వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం, ఏర్పాట్లు దగ్గరుండి చూసుకోవడంతో కార్యక్రమం విజయవంతం అయిందంటూ తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు.



రైతు పండుగ బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి, మంత్రులు, జూపల్లి, దామోదర

రైతు పండగ విజయవంతం !

» భారీగా తరలివచ్చిన ప్రజానీకం

మహబూబ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన రైతు పండగ విజయవంతమైంది. తొలి రెండ్రోజులు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఇక, చివరి రోజు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సభ సూపర్ సక్సెస్ కావడం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. లక్ష మంది రైతులతో సభ నిర్వహించాలని నేతలు భావించగా అదే సంఖ్యలో జనం తరలివచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి సభా ప్రాంగణానికి చేరుకునే రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. ఇక, సీఎం రాకకు ముందే సభా ప్రాంగణం కూడా జనంతో నిండిపోయింది. ముఖ్యమంత్రి ప్రసంగం పూర్తయ్యే వరకు రైతులు, ప్రజలు అక్కడి నుంచి కదలలేదు. ఇక, ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ రైతు పండగ విజయవంతంగా ముగియడంతో మహబూబ్‌నగర్ జిల్లా యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి నేతృత్వంలో యంత్రాంగం ఈ రైతు పండగ కోసం పది రోజులకు పైగా శ్రమించింది.

4న సీఎం చేతుల మీదుగా 593 మందికి నియామక పత్రాలు

» సింగరేణిలో ప్రజా విజయోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

» అధికారులతో ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేక సమీక్ష

హైదరాబాద్/ కొత్తగూడెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 'ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాలను' సింగరేణిలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏరియాలలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా డిసెంబరు 4న పెద్దపల్లిలో జరిగే యువశక్తి సభలో సింగరేణికి సంబంధించి 593 మందికి నియామక పత్రాలు సీఎం, డిప్యూటీ సీఎం చేతుల మీదుగా ఇవ్వడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. శనివారం ఆయన ప్రజా విజయోత్సవాల నిర్వహణపై హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏడాది కాలంలో 2,165 కొత్త ఉద్యోగాలను సింగరేణిలో కల్పించినట్లు చెప్పారు. సింగరేణికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని స్కాన్ చేయడం ద్వారా సామాజిక మాధ్యమాల్లో తెలుసుకునేలా క్యూఆర్ కోడ్‌ను ఆయన ఆవిష్కరించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్, లింక్డ్ ఇన్‌లలో సింగరేణికి సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చని సీఎండీ బలరామ్ చెప్పారు.

పెట్లబురుజు ప్రభుత్వ ఆస్పత్రిలో సంతాన సాఫల్య సేవలు

» డిసెంబరు 2న ప్రారంభించనున్న మంత్రి దామోదర

హైదరాబాద్ సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి పెట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఇన్‌ఫెర్టిలిటీ(సంతాన సాఫల్య) సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే గాంధీ ఆస్పత్రిలో ఈ సేవలు అందిస్తుండగా, పెట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో డిసెంబరు 2న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఈ సేవలను ప్రారంభించనున్నారు. సంతానం లేని దంపతులకు ఆస్పత్రిలో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) చికిత్సలు అందిస్తామని పెట్లబురుజు ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజనీరెడ్డి వివరించారు. ఇన్‌ఫెర్టిలిటీ సేవల కోసం ప్రత్యేక ఆధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంతానం లేని దంపతులకు ముందుగా పరీక్షలు చేస్తారని, ముందుగా మందులు ఇచ్చి సంతానం కోసం ప్రయత్నాలు చేస్తారని చెప్పారు. భార్య, భర్తలో ఎవరిలో లోపం ఉంటే వారికి మందులతో నయం చేసే ప్రయత్నాలు చేస్తామన్నారు. అండాలను అభివృద్ధి చేయడం, వీర్యకణాలను పరిపుష్టి చేయడం వంటి చికిత్స పద్ధతులు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. పైసా ఖర్చు లేకుండానే ఈ సేవలు పొందే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

'పాలమూరు-రంగారెడ్డి'పై ఉప కమిటీ

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రెండోదశ పర్యావరణ అనుమతిలేకుండా పనులు జరుగుతున్న పాలమూరు-రంగారెడ్డితో పాటు డిండి ఎత్తిపోతల పథకాలపై కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ దృష్టిపెట్టింది. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) 2022 డిసెంబరు 22న ఇచ్చిన తీర్పు ఆధారంగా ఉప కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ డిసెంబరు 13 నుంచి 17దాకా ప్రాజెక్టు నిర్మాణం జరిగిన ప్రాంతాలను పరిశీలించనుంది. డాక్టర్ ఉదయ్‌కుమార్ చైర్మన్‌గా ఉన్న కమిటీలో డాక్టర్ జేవీ త్యాగి, కార్తీక్ సప్రే, డాక్టర్ అమియా సాహూ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి డాక్టర్ ఆర్.రాజ్‌కుమార్‌తోపాటు కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ప్రతినిధి ఉండనున్నారు.

రైల్వేల్లో పదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల భర్తీ

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లకాలంలో ఉపాధి క్యాలెండర్ ప్రకారం భారతీయ రైల్వే 5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసింది. 2004 నుంచి 2014వరకు 4 లక్షల ఉద్యోగాలనే భర్తీ చేయగా 2014 నుంచి 2024వరకు 5 లక్షల మందిని ఉద్యోగాల్లో నియమించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే చరిత్రలో తొలిసారి ఉపాధి క్యాలెండర్ ప్రకారం ఖాళీలను భర్తీ చేసినట్టు వివరించారు.



సీఎం రేవంత్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న ఆస్ట్రియా రాయబారి కేథరినా వేజర్, చిత్రంలో మంత్రి ఉత్తమ్

54 వేల కోట్లతో రైతుల జీవితాల్లో పండుగ

ఏడాది కింద ఇదే రోజు మార్పు కోసం ఓటు

ఆ ఓటే రైతన్న చరిత్ర తిరగరాసింది: సీఎం

రేపు ట్రాన్స్ క్లినిక్‌ల ప్రారంభం

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'ఒక్క ఏడాదిలో రూ.54 వేల కోట్లతో రైతుల జీవితాల్లో పండుగ తెచ్చాం. ఇది నంబర్ మాత్రమే కాదు.. రైతులు మాపై పెట్టుకున్న నమ్మకం. ఈ సంతోష సమయంలో అన్నదాతలతో కలిసి రైతు పండుగలో పాలుపంచుకోవడానికి ఉమ్మడి పాలమూరుకు వస్తున్నా' అంటూ మహబూబ్‌నగర్ రైతు సభకు వెళ్లడానికి ముందు సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రూ.7,625 కోట్లతో రైతు భరోసా, సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్తు కింద రూ.10,444 కోట్లు, రూ.1,433 కోట్లతో రైతు బీమా, రూ.95 కోట్ల పంట నష్టపరిహారం, రూ.10,547 కోట్లతో ధాన్యం కొనుగోలుకు వెచ్చిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏడాది క్రితం సరిగ్గా ఇదేరోజు (నవంబర్ 29) పొలానికి వెళ్లి అరక కట్టాల్సిన రైతు.. పోలింగ్ బూత్‌కు వెళ్లి 'మార్పు' కోసం ఓటేశాడని, ఆ ఓటే అభయహస్తమై.. రైతన్న చరిత్రను తిరగరాసిందంటూ వ్యాఖ్యానించారు. కాగా, తుర్కియే, ఆస్ట్రియా దేశ రాయబారులు కేథరినా వేజర్, ఫిరాట్ సునెల్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేథరినా.. సీఎంకు ఒక పెయింటింగ్‌ను బహూకరించారు. వీరి వెంట మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. కాగా, ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి పేరుతో ప్రత్యేక ట్రాన్స్ క్లినిక్‌లను సోమవారం సీఎం రేవంత్ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. జిల్లా ఆసుపత్రుల్లోనే వీరి కోసం ప్రత్యేక విభాగాన్ని అందుబాటులోకి తెస్తున్నారు.

జనాభా మేరకు బీసీలకు రిజర్వేషన్లు

ప్రత్యేక కమిషన్‌కు పద్మశాలి సంఘం వినతి

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ జనాభా లెక్కల ప్రకారమే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ బీసీ రిజర్వేషన్లపై వేసిన ప్రత్యేక కమిషన్‌కు రాష్ట్ర పద్మశాలి సంఘం శనివారం విజ్ఞప్తి చేసింది. చేనేత వృత్తిదారులను కళాకారులుగా గుర్తించాలని, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరింది. ఈ మేరకు కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావును.. హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్ కార్యాలయంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఇతర ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందించారు.

కృష్ణా బోర్డును పట్టించుకోవద్దు

» శ్రీశైలంలో టెలిమెట్రీ యంత్రాలు: రేవంత్

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన నీటి వాటాలను దక్కించుకోవడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలగకుండా కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని నిర్దేశించారు. ఇందుకు అవసరమైన సాక్ష్యాధారాలు, రికార్డులు, ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన ఉత్తర్వులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కృష్ణా జలాల పంపిణీపై జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ విచారణ జరుగుతున్నందున నీటి వాటాలు తేలేదేకా కృష్ణాబోర్డు నిర్ణయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని సీఎం పేర్కొన్నారు. ట్రైబ్యునల్ నీటి వాటాలు తేల్చేదాకా బోర్డుల జోక్యానికి ఆస్కారం లేదని, ఆ మేరకు సుప్రీంకోర్టులో ఉన్న కేసుల్లో వాదనలు వినిపించాలని అధికారులకు నిర్దేశించారు. తన నివాసంలో శనివారం నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు అధికారులతో కలిసి, సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితితో పాటు కృష్ణా, గోదావరి జలాలపై అంతరాష్ట్ర వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించి, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం-1956 ప్రకారం తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాలను పంచడంపై జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ విచారణ జరుగుతుందని, దీనిపై ఇరు రాష్ట్రాలు స్టేట్ ఆఫ్ కేసు (ఎస్‌వోసీ)లు దాఖలు చేయగా ప్రస్తుతం ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై క్రాస్ ఎగ్జామినేషన్ జరుగుతుందని, త్వరలోనే ఇరు రాష్ట్రాలు తమ వాదనలు వినిపించనున్నాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కృష్ణా బేసిన్‌పై బచావత్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పుతో పాటు బేసిన్‌లోని నిర్మాణంలో ఉన్న, ఇదివరకే నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లను దాఖలు చేయడం జరిగిందని అధికారులు గుర్తు చేశారు. అంతర్జాతీయ నీటి సూత్రాల ప్రకారం నదీ పరీవాహక ప్రాంతాన్ని బట్టి, అదే దామాషా ప్రకారం నీటి కేటాయింపులుండాలి. ఈ మేరకు కృష్ణా బేసిన్ వెంట 70 శాతం జనాభా తెలంగాణలో నివాసం ఉంటుందని, అదే ఏపీలో 30 శాతం మాత్రమేనని అధికారులు గుర్తు చేశారు. ఈ వాదనల ఆధారంగా 1005 టీఎంసీల కృష్ణా జలాల్లో 70 శాతం నీటి వాటా తెలంగాణకు దక్కేలా వాదనలు వినిపించాలని అధికారులను సీఎం ఆదేశించారు. పోలవరం ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తున్నందున దానికి బదులుగా నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవడానికి బచావత్ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిందని, 80 టీఎంసీల్లో 35 టీఎంసీలను వాడుకోవడానికి మహారాష్ట్ర, కర్ణాటకలు ప్రాజెక్టులు కట్టుకుంటున్నందున మిగిలిన 45 టీఎంసీలపై తెలంగాణకే అధికారం ఉందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ నీటిని పాలమూరు-రంగారెడ్డికి కేటాయిస్తూ డీపీఆర్ దాఖలు చేశామని అధికారులు గుర్తు చేయగా తగిన అనుమతులు సాధించుకోవడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని సీఎం ఆదేశించారు. నీటి వాటాల్లో తెలంగాణకు జరిగిన నష్టాలపై సమగ్రంగా నివేదిక తయారు చేయాలన్నారు.



ప్రతి చుక్కనూ లెక్కించాల్సిందే

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 34 టీఎంసీలు (19 టీఎంసీలు శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్‌కు, 15 టీఎంసీలు చెన్నై వాటర్ సప్లయ్‌కు కేటాయింపులు) ఉండగా వాటాకు మించి ఏపీ నీటిని తరలిస్తోందన్న చర్చ భేటీ సందర్భంగా జరిగింది. దాంతో తరలించే ప్రతి చుక్కను శాస్త్రీయంగా లెక్కించే ఆధునిక టెలిమెట్రీ పరికరాలు శ్రీశైలంతో పాటు సాగర్‌లో బిగిస్తే లెక్కలు పక్కాగా తేలుతాయని సీఎంకు అధికారులు వివరించారు. టెలీమెట్రీ పరికరాలకు రూ.12 కోట్లు అవుతాయని, దీన్ని తెలుగు రాష్ట్రాలు చెరి సగం చెల్లించాల్సి ఉందని సీఎంకు అధికారులు వివరించారు. జోక్యం చేసుకున్న సీఎం అవసరమైతే మొత్తం డబ్బులు ముందుగా భరించి టెలీమెట్రీ అమల్లోకి తీసుకురావాలని, ఏపీ ఇచ్చినప్పుడు రీయింబర్స్ చేసుకోవాలని సీఎం సూచించారు. కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులన్నింటి ద్వారా ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడుకుంటుందో లెక్కలు తీయాలని ఆదేశించారు.

సీతారామ, సమ్మక్కలకు అనుమతులు తెచ్చుకోవాలి

గోదావరి బేసిన్‌లో 8 ప్రాజెక్టులకు అనుమతి కోరుతూ డీపీఆర్‌లు దాఖలు చేయగా ఐదు ప్రాజెక్టులకు అనుమతులు రాగా సీతారామ ఎత్తిపోతల పథకం డీపీఆర్ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) సాంకేతిక అనుమతి రావాల్సి ఉందని, ఇక సమ్మక్కసాగర్ బ్యారేజీపై ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకుంటేనే అనుమతి ఇస్తామని సీడబ్ల్యూసీ తేల్చిచెప్పిందని అధికారులు వివరించగా సీతారామకు టీఏసీ క్లియరెన్స్, సమ్మక్కకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తీసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయవాది వైద్యనాథన్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఏఏజీ రజనీకాంత్‌రెడ్డి, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)పూర్వ చైర్మన్, ట్రైబ్యునల్‌లో తెలంగాణ తరఫు న్యాయవాదిగా పనిచేయడానికి ముందుకొచ్చిన కుశ్వీందర్ వోహ్రా, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు.

చేసింది చెప్పుకోకుంటే వెనకబడతాం..

» సర్కారు పథకాలు ప్రచారం చేయండి

» దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి: మహేశ్ గౌడ్

హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, చేస్తున్న మంచి పనులను గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ఆదివాసీ కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. చేసిన పనులను చెప్పుకోకపోతే వెనుకపడిపోతామన్నారు. ప్రభుత్వంపైన బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ సమావేశం ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరగ్గా.. అందులో మహేశ్‌గౌడ్ మాట్లాడారు. పార్టీలో కష్టపడిన నాయకులకు అన్ని రకాల పదవుల్లో వారికి అవకాశమిస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేస్తున్నా.. బీఆర్ఎస్ అబద్ధాలు ప్రచారం చేస్తూ కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ మతతత్వ ప్రచారాన్ని, మోదీ అబద్ధాలను తిప్పి కొట్టాలన్నారు. ఏఐసీసీ నేత కొప్పుల రాజు మాట్లాడుతూ ఆదివాసీ అంశాలపై లోతుగా చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు నాగార్జునసాగర్‌లో వారం రోజుల పాటు క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, ప్రజాపాలన విజయోత్సవాలను పార్టీ తరఫున సమన్వయం చేసుకునేందుకు 119 నియోజకవర్గాలకు కోఆర్డినేటర్లను టీపీసీసీ నియమించింది.

గురుకులాలపై ఆర్ఎస్ ప్రవీణ్ కుట్ర..

రాష్ట్రంలోని గురుకులాలపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పెద్ద కుట్రకు పాల్పడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆయన గురుకులాల కార్యదర్శిగా ఉన్నప్పుడు నియవించుకున్న మనుషులతో ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. గురుకుల విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి 40 శాతం డైట్ చార్జీలు పెంచి మంచి భోజనం అందిస్తుంటే.. ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని అయిలయ్య దుయ్యబట్టారు. స్వేరో పేరుతో ఆర్ఎస్ ప్రవీణ్ ప్రైవేటు సైన్యాన్ని తయారు చేసుకున్నారంటూ గతంలో బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు నిజమేననిపిస్తుందని సత్యం అన్నారు. గురుకులాలపై కుట్రలు చేసినందుకు ఆర్ఎస్ ప్రవీణ్ విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓబీసీలకు న్యాయం జరగాలంటే దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ బీసీలకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రైలు ప్రయాణికులకు పరిశుభ్రమైన బెడ్‌రోల్స్

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ప్రత్యేక రైళ్లతో పాటు 116 రైళ్లలోని ఏసీ కోచ్‌లలోని ప్రయాణికులకు పరిశుభ్రమైన బెడ్‌రోల్స్ సరఫరా చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. సగటున రోజూ 38 వేల ఉన్ని దుప్పట్లు, 1.52 లక్షల బెడ్‌రోల్స్‌ను ప్రయాణికులకు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఒక్కో బెడ్ రోల్ పాకెట్‌లో రెండు వైట్ బెడ్‌షీట్‌లు, ఒక పిల్లో కవర్, ఫేస్‌టవల్‌తో పాటు ఒక ఉన్ని దుప్పటి ఇస్తున్నట్టు తెలిపారు. ఎప్పటికప్పుడు బెడ్‌రోల్స్‌ను శుభ్రపరచడానికి ఏడు కేంద్రాల్లో మెకనైజ్డ్ లాండ్రీలను ఏర్పాటు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనం నేడు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 5,139 మంది వీఆర్వోలను బేషరతుగా రెవెన్యూ శాఖలో సర్దుబాటు చేసి వేతన, సర్వీసు రక్షణ కల్పించాలని తెలంగాణ వీఆర్వోల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఉదయం 11 గంటలకు మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు తెలిపారు.

ఏఆర్‌ఆర్ దాఖలుకు గడువు కోరే అవకాశం

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక ఆదాయ అవసరాలు (ఏఆర్‌ఆర్), టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించడానికి కొంత గడువు కావాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ)ని డిస్కమ్‌లు కోరనున్నట్లు సమాచారం. విద్యుత్ చట్టం-2013 ప్రకారం డిస్కమ్‌లు శనివారం రోజే పిటిషన్‌లు దాఖలు చేయాలి. అయితే గడువు ముగిసినా పిటిషన్లు మాత్రం సమర్పించలేదు. ప్రజాపాలన విజయోత్సవాల అనంతరం పిటషన్లు వేయాలని, ఈలోగా కమిషన్ నుంచి కొంత గడువు కోరాలని డిస్కమ్‌లు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

మాజీ ఎంపీ సంతోష్‌కు గ్రీన్ ఐడల్ అవార్డు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యుడిగా తన పదవీ కాలంలో దేశంలోనే అత్యధికంగా మొక్కలు నాటడంతోపాటు, నాటడాన్ని ప్రోత్సహించినందుకు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఫౌండర్, మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్‌కు శ్రీకల్పతరు సంస్థాన్ అనే సంస్థ గ్రీన్ ఐడల్ విశిష్ట అవార్డు ప్రదానం చేసింది. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో శ్రీకల్పతరు సంస్థాన్ శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర గవర్నర్ హరిబాబ్ బాగ్డే ఈ అవార్డును అందజేశారు.

సీపీఐ నేత బాల మల్లేశ్ హఠాన్మరణం



హైదరాబాద్, అల్వాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేశ్(56) హఠాన్మరణం చెందారు. శనివారం గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. హుటాహుటిన కుటుంబసభ్యులు ఈసీఐఎల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మల్లేశ్ భౌతికకాయాన్ని యాప్రాల్‌లోని ఆయన నివాసానికి తరలించారు. కాగా, బాల మల్లేశ్ హఠాన్మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మల్లేశ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. బాల మల్లేశ్ మృతి పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర పోలీసుల సత్తా

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ పోలీసులు సత్తాచాటారు. పోలీసు, పారా మిలటరీ బలగాలకోసం సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా లాన్ టెన్నిస్ పోటీల్లో మల్టీ జోన్-1 ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ జోడి ఫైనల్‌లో విజయం సాధించి మొదటి బహుమతి కైవసం చేసుకుంది. బెంగళూరులోని కేఎస్ఎల్‌టీఏ స్టేడియంలో నవంబరు 26 నుంచి 30 వరకు ఈ పోటీలు జరిగాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ జోడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డీఎస్పీ రామ్ కుమార్, సత్యనారాయణ జట్టుపై 9-6 స్కోరుతో విజయం సాధించింది.

లగచర్లలో పారిశ్రామిక పార్కు!

అదే ఊళ్లో భూసేకరణకు ప్రకటన జారీ.. ఫార్మా విలేజ్ రద్దయిన మర్నాడే పార్క్



- రైతుల అంగీకారంతోనే భూసేకరణ
- బలవంతంగా భూములు తీసుకోము
- నోటిఫికేషన్‌లోనే ప్రభుత్వం స్పష్టత
- మంచి ప్యాకేజీ ఇస్తారని అంచనా

వికారాబాద్/హైదరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మా విలేజ్ స్థానంలో పారిశ్రామిక పార్క్ వస్తోంది. ఈ మేరకు శుక్రవారం రద్దయిన నోటిఫికేషన్ స్థానంలో శనివారం కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో బహుళరంగ పారిశ్రామిక వాడ ఏర్పాటుకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. దుద్యాల మండలం పోలేపల్లి, లగచర్ల గ్రామాల్లో మొత్తం 182.31 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ అయ్యింది.. లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాల్లో బహుళరంగ పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తారు. సేకరించనున్న భూవికి సంబంధించి రైతుల పేర్లు, సర్వే నెంబర్లతో నోటిఫికేషన్ జారీ చేయడమే కాకుండా, రైతుల అంగీకారంతోనే భూ సేకరణ జరుగుతుందని, బలవంతంగా భూములు సేకరించబోమని అందులో స్పష్టం చేశారు మొదట భూములు ఇవ్వడానికి ఆసక్తిగా ఉన్న రైతుల నుంచి భూమిని సేకరిస్తారు. ఈసారి రైతులకు మంచి ప్యాకేజీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. లగచర్ల, పోలేపల్లిలో ఫార్మా విలేజ్ కోసం అంటూ గతంలో జారీ చేసిన ప్రకటనను ఇప్పటికే ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఫార్మా విలేజ్ ప్రతిపాదనకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్, ఇతర అధికారులపై దాడి జరగడం, రైతుల అరెస్టులు, జాతీయ మానవ హక్కుల కమిషన్ జోక్యం తదితర పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఫార్మా విలేజ్ ప్రతిపాదన ఉపసంహరించుకుంది. పారిశ్రామిక వాడ నిమిత్తం తొలి విడతగా సేకరించనున్న భూమి కేవలం 181.71 ఎకరాలే కావడం, స్థానికులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా దొరికే అవకాశం ఉండటంతో ఈసారి భూసేకరణకు వ్యతిరేకత వచ్చే అవకాశాలు తక్కువని భావిస్తున్నారు. పారిశ్రామిక వాడ ఏర్పాటు ద్వారా 20 వేల మందికి పైగా స్థానికులకు ఉద్యోగావకాశాలు అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. తొలి విడతలో వస్త్ర రంగానికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. భూసేకరణ అధికారిగా తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్‌ను నియమించారు.

317 జీవో సమస్యల పరిష్కారానికి పచ్చజెండా

భార్యాభర్తలు, మెడికల్ గ్రౌండ్, పరస్పర బదిలీలకు ఓకే

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి 317 జీవో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. భార్యాభర్తలు (స్పౌజ్), మెడికల్ గ్రౌండు, పరస్పర (మ్యుచువల్) బదిలీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. 317 జీవోపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసుల మేరకు ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. వీటికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం 243, 244, 245 నంబర్లతో మూడు జీవోలను జారీ చేశారు. ఆయా జిల్లాల్లో ఖాళీలు ఉంటనే ఈ కేడర్ బదిలీలు చేపట్టాలని ఆదేశించింది. ఈ బదిలీల సందర్భంగా ఆయా జిల్లాల్లో ఉన్న స్థానిక ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల నుంచి కొత్త జిల్లాలకు ఉద్యోగులను సర్దుబాటు చేసే ఉద్దేశంతో 2021 డిసెంబరు 6న అప్పటి ప్రభుత్వం జీవో నంబర్ 317ను జారీ చేసింది. ఈ జీవో ఆధారంగా దాదాపు 30 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను కొత్త జిల్లాలకు బదిలీ చేశారు. దీంతో తాము స్థానికతను కోల్పోయామని, సొంత జిల్లా కాకుండా వేరే జిల్లాకు వెళ్లాల్సి వచ్చిందని, భార్యాభర్తల (స్పౌజ్) కేసులను పరిగణనలోకి తీసుకోలేదంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. స్పందించిన ప్రభుత్వం భార్యాభర్తల కేసులు, పరస్పర బదిలీలకు సంబంధించి సడలింపులిచ్చింది. కానీ... భార్యాభర్తల కేసులకు సంబంధించి 19 జిల్లాల్లో పూర్తి స్థాయిలో బదిలీలు చేపట్టగా 13 జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్ల వరకే బదిలీలు చేపట్టారు. ఈ 13 జిల్లాల్లో పూర్తి స్థాయి బదిలీలు జరగలేదు. భార్యాభర్తల్లో ఒకరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి, మరొకరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయినా బదిలీలు చేపట్టాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. స్థానిక జిల్లా కేడర్ అంశాన్ని పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ఈ ఫిబ్రవరి 24న క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ... ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి పలు వినతులు స్వీకరించి, వారితో సమావేశమై వాదనలు విన్నది. ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి, వారి వివరణలు తీసుకుంది. అనంతరం ప్రభుత్వానికి పలు సిఫారసులు చేసింది. ఈ సిఫారసులకు అనుగుణంగా ప్రభుత్వం తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే ఒక ఉద్యోగిని స్థానిక జిల్లాకు బదిలీ చేసే సందర్భంలో అక్కడ స్పష్టమైన ఖాళీ (క్లియర్ వెకెన్సీ) ఉండాలని, అక్కడి స్థానిక ఉద్యోగులను ప్రభావితం చేయరాదని నిర్దేశించింది. మెడికల్ గ్రౌండు, వితంతువు బదిలీలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 70 శాతం అంగ వైకల్యం ఉన్నవారిని మెడికల్ గ్రౌండుపై బదిలీ చేయవచ్చునని తెలిపింది. వైకల్యంపై ధ్రువీకరణ పత్రం సాధికార సంస్థ నుంచి పొంది ఉండాలని పేర్కొన్నది. మానసిక వైకల్యం గల పిల్లలున్న ఉద్యోగులను ఆ పిల్లలకు అవసరమైన వైద్య సదుపాయాలున్న ప్రాంతాలకు బదిలీ చేయవచ్చునని తెలిపింది. కారుణ్య నియామకాల కింద నియమితులైన వితంతువులకు కూడా ఈ బదిలీలు వర్తిస్తాయని వివరించింది. క్యాన్సర్, న్యూరోసర్జరీ, కిడ్నీ మార్పిడి, కాలేయ మార్పిడి, ఓపెన్ హార్ట్ సర్జరీ వంటి మెడికల్ గ్రౌండు ఉద్యోగుల బదిలీలను కూడా ఆమోదించాలని తెలిపింది.

మార్గదర్శకాలు ఇవీ..

- ఒకే మేనేజ్‌మెంట్ కింద పని చేసే టీచర్లు, హెడ్‌మాస్టర్స్ మధ్యే బదిలీలు జరగాలి. అంటే స్థానిక సంస్థల(జడ్పీపీ, మండల పరిషత్) టీచర్ల మధ్యే పరస్పర బదిలీలు చేయాలి. ఇవి ఒకే కేటగిరీ, ఒకే సబ్జెక్టు, ఒకే మీడియంకు సంబంధించినవై ఉండాలి.
- జెడ్పీపీ, ఎంపీపీ, ఇతర స్థానిక సంస్థల్లోని బోధనేతర సిబ్బందిని అవే సంస్థలకు పరస్పర బదిలీలు చేయాలి.
- పరస్పర బదిలీలు కోరుకునే ఇద్దరు ఉద్యోగులు.. తమకు సీనియారిటీ నష్టం జరిగినా పర్వాలేదంటూ అంగీకార పత్రాలు ఇవ్వాలి. బదిలీ అయిన జిల్లాలోని సీనియారిటీ జాబితాలో చివరి ర్యాంకులో చేరాల్సి ఉంటుంది.
- పరస్పర బదిలీలను ఉద్యోగుల కోరిక మేరకు జరిగినవిగా భావిస్తారు. ఈ దృష్ట్యా టీఏ, డీఏలు క్లెయిమ్ చేసుకోవడానికి వీల్లేదు.
- కోర్టు ఆర్డర్ల మేరకు సస్పెన్షన్లు, క్రమ శిక్షణ చర్యలకు గురైనవారు, అనధికారికంగా గైర్హాజరైనవారు పరస్పర బదిలీలకు అనర్హులు.
- ఒక ఉద్యోగి మరో ఉద్యోగికి మాత్రమే పరస్పర బదిలీకి అంగీకారం తెలపాలి. ఒకరి కంటే ఎక్కువ మందితో అంగీకారాన్ని కుదుర్చుకుని ఉండరాదు.

కొండను తవ్వి ఎలుకను పట్టిన క్యాబినెట్ సబ్ కమిటీ

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 317 జీవో సమస్యల పరిష్కారానికి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినా.. ఆ కమిటీ కొండను తవ్వి ఎలుకను పట్టింది తప్ప.. ఉద్యోగులు, ఉపాధ్యాయుల స్థానికత సమస్యలను పరిష్కరించలేదు. సబ్ కమిటీ ఆరు నెలలపాటు శోధించి సాధించింది ఏమిటంటే గత ప్రభుత్వం చేసిన పనిని ఆమోదించటం మినహా ఏమీ చేయలేకపోయింది. దంపతుల బదిలీలు గత ప్రభుత్వంలో 19 జిల్లాల్లో పూర్తిగా, 13 జిల్లాల్లో స్కూలు అసిస్టెంట్ స్థాయి వరకు చేపట్టారు. మిగిలిన వారికి బదిలీలు చేయాల్సి ఉండగా అవకాశం ఉన్నమేరకే చేయాలని, ఫోకల్ పాయింట్లకే చేయాల్సిన అవసరం లేదని పేర్కొనడం సమంజసం కాదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల స్పౌజ్‌ల గురించి మాట్లాడ లేదు. స్థానికత కోల్పోయిన వారి ప్రస్తావనే లేదు. జీవో 317 లోని అసంబద్ధమైన నిబంధనల కారణంగా పలువురికి నష్టం వాటిల్లింది. ప్రభుత్వం పునరాలోచన చేసి జీవో 317 బాధితులందరికీ న్యాయం చేయాలి.

– తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి



పత్తి గోదాములో అగ్ని ప్రమాదం

కాలి బూడిదైన రూ.52 కోట్ల విలువైన పత్తి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘటన

మేడ్చల్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని సీసీఐ గోదాములో సంభవించిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.52 కోట్ల విలువ చేసే పత్తి కాలి బూడిదయ్యింది. అగ్నిమాపక దళం తొమ్మిది గంటల పాటు కష్టపడినా ఫలితం లేకండాపోయింది. మేడ్చల్ మునిసిపాలిటీ పూడూరు సమీపంలోని గోసాయిగూడ వద్ద కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గోదాము ఉంది. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో గోదాము నుంచి పొగలు రావటం గమనించిన నిర్వాహకులు వెంటనే తుర్కాపల్లి జినోమ్‌వ్యాలీ అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేశారు. అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకునేలోపు మంటలు గోదామును చుట్టుముట్టేశాయి. జీడిమెట్ల నుంచి కూడా అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. ఎనిమిది ఫైరింజన్లతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మంటల తీవ్రతకు గోదాము కూలిపోయింది. కాగా ఘటనా స్థలంలో సీసీఐ ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవటం గమనార్హం. గోదాములో నిల్వ చేసిన పత్తి విలువ దాదాపు రూ.52 కోట్లు ఉంటుందని సీసీఐ సిబ్బంది తెలిపారు. గోదాము కూలిపోవడంతో రూ.6 కోట్ల నష్టం వాటిల్లిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణాలపై విచారణ జరుపుతున్నామని డీఎఫ్‌వో జై కృష్ణ తెలిపారు. కాగా, గోదాము ప్రధాన ద్వారం వద్ద వెల్డింగ్ చేస్తుండగా నిప్పురవ్వలు పత్తిపై పడడంతో ప్రమాదం సంభవించి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

బీసీ వర్గానికి చెందిన ఐఏఎస్‌కు అవకాశం.. నేడు స్వచ్ఛంద పదవీ విరమణ

- ఆ వెంటనే గవర్నర్ ఆమోదానికి ఫైలు
- స్పెషల్ సీఎస్‌గా పదోన్నతితో వీడ్కోలు



హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మన్‌గా 1995 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించనుంది. బీసీ వర్గానికి చెందిన ఆయనకు చైర్మన్ పదవి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా, గవర్నర్ కార్యదర్శిగా, జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్న వెంకటేశం ఆదివారమే ఐఏఎస్ పోస్టు నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోనున్నారు. దీనికి ఆమోదం లభించగానే టీజీపీఎస్సీ చైర్మన్‌గా వెంకటేశం నియామక ఫైలు గవర్నర్ వద్దకు వెళ్లనుంది. గవర్నర్ ఆమోదంతో నియామక ఉత్తర్వులు వెలువడతాయి. ప్రస్తుతం టీజీపీఎస్సీ చైర్మన్‌గా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి బి.మహేందర్‌రెడ్డి డిసెంబరు 2న చైర్మన్ బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. ఈ పదవిలో మరొకరిని నియమించడానికి ఈ నెల 11నే రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. అయితే, టీజీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని నియమిస్తారన్న వార్తలు వెలువడ్డాయి. కానీ, ఈ పోస్టులో బీసీ అధికారిని నియమించాలన్న కృతనిశ్చయానికి వచ్చిన ప్రభుత్వం... సీనియర్ ఐఏఎస్, బీసీ సామాజిక వర్గానికి చెందిన బుర్రా వెంకటేశం వైపు మొగ్గు చూపింది. ఈయన కమిషన్‌కు నాలుగో చైర్మన్ అవుతారు. ఇంతకుముందు మొదటి చైర్మన్‌గా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రెండో చైర్మన్‌గా మాజీ ఐఏఎస్ బి.జనార్దన్‌రెడ్డి పని చేశారు. మూడో చైర్మన్‌గా ప్రస్తుతం బి.మహేందర్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఈయన స్థానంలోనే బుర్రా వెంకటేశం నియమితులు కానున్నారు. 62 ఏళ్ల నిబంధన ప్రకారం వెంకటేశం ఈ పదవిలో ఐదేళ్లకు పైగానే కొనసాగే అవకాశం ఉంది.

సివిల్ సర్వీస్ పరీక్షలో ఉమ్మడి ఏపీలో టాపర్

జనగామ జిల్లా ఓబుల్ కేశవాపురం గ్రామానికి చెందిన బుర్రా వెంకటేశం 1995లో ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. అప్పట్లో ఆయన సివిల్ సర్వీస్ పరీక్షలో దేశంలోనే 15వ ర్యాంకును సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయనే టాపర్. గతంలో ఆయన హోంశాఖ కార్యదర్శిగా, 2015 నుంచి 2019 వరకు రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. అంతకుముందు 2005-2009 మధ్యకాలంలో మెదక్, గుంటూరు జిల్లాలకు కలెక్టర్‌గా పని చేశారు. ఇటీవల విద్యాశాఖలో చేపట్టిన 11 వేల మంది కొత్త ఉపాధ్యాయుల ఎంపిక, 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు, 22 వేల మంది ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయన సాఫీగా పూర్తి చేశారు.

స్పెషల్ సీఎస్‌గా చాన్స్ కొట్టేసిన వెంకటేశం

వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణకు ముందు స్పెషల్ సీఎస్‌గా చాన్స్ కొట్టేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటివరకు ముఖ్య కార్యదర్శి హోదాలో ఉన్న వెంకటేశాన్ని ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రీడిజిగ్నేట్ చేసింది. టీజీపీఎస్సీ చైర్మన్‌గా ఆయనకు స్పెషల్ సీఎస్(సూపర్ టైమ్ స్కేల్ కంటే ఎక్కువ) స్థాయి వేతన భత్యాలు లభిస్తాయి.

జనగామ బిడ్డకు దక్కిన గౌరవం

జనగామ కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం నియమితులు కానుండడంపై జనగామ జిల్లా వాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వెంకటేశం హైదరాబాద్ చిక్కడపల్లిలో నిఅంబేడ్కర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. పేద కుటుంబంలో జన్మించిన వెంకటేశం చదువులో రాణిస్తూ అంచెలంచెలుగా అత్యున్నత స్థాయికి చేరుకున్నారు.

ఏఐ స్టెతస్కోప్‌తో గుండె జబ్బుల నిర్ధారణ

'సత్యసాయి సంజీవని'లో స్ర్కీనింగ్‌లో వినియోగం

కొండపాక, నవంబరు 30: కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానంతో రూపొందిన హెచ్‌డీ స్టెతస్కోప్ గుండె జబ్బుల నిర్ధారణలో ఎంతో ఉపయోగపడుతోంది. ఇది ఈసీజీ తీయడంతో పాటు గుండె లయను రికార్డు చేసి.. మళ్లీ వినిపించగలదు. సిద్దిపేట జిల్లా కొండపాక ఆనంద నిలయం శివారులోని సత్యసాయి సంజీవని చైల్డ్ హార్ట్ కేర్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న స్ర్కీనింగ్‌లో ఈ ఆధునిక స్టెతస్కోప్‌ను వినియోగిస్తున్నారు. శనివారం ఆస్పత్రి చైర్మన్ సీ శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నపిల్లల్లో వ్యాధుల నిర్ధారణకు స్ర్కీనింగ్ చేపట్టామని తెలిపారు. అంగన్‌వాడీ పిల్లలకు స్ర్కీనింగ్‌ను ఇక్కడి నుంచే ప్రారంభిస్తామని చెప్పారు. తమ ఆస్పత్రిలో అధునాతన పరికరాలు ఉన్నాయని, రూ.11 కోట్లతో ఏర్పాటు చేసిన క్యాథ్ ల్యాబ్‌ను త్వర్వలో ప్రారంభిస్తామని వివరించారు. ఈ ఆస్పత్రిలో ఆరు రోజుల్లో 18 మంది పిల్లలకు గుండె ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసినందుకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు.

4 పెండింగ్ డీఏలు విడుదల చేయాలి: టీజీవోఏ

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయడంతోపాటు కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోఏ) తీర్మానించింది. శనివారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో చేసిన తీర్మానాలను మీడియాకు వెల్లడించారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో పాత జిల్లాల ప్రకారం అన్ని విభాగాల్లో అదనపు క్యాడర్‌ను వెంటనే మంజూరు చేయాలి. అధికారుల పట్ల అవమానకరంగా, అనుచితంగా ప్రవర్తిస్తున్న సంఘ విద్రోహ శక్తులపై తగు చర్యలు తీసుకోవాలి. అన్ని శాఖల్లో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీల సమావేశాలు నిర్వహించి ఉద్యోగులకు వెంటనే పదోన్నతి కల్పించేలా ప్రభుత్వాన్ని కోరాలి' అని తీర్మానించారు.

తహసీల్దార్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి: తహసీల్దార్ల అసోసియేషన్

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తహసీల్దార్ల సమస్యలను వెంటనే పరిష్కారించాలని, తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించాలని తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు అధ్యక్షుడు రాములు, కార్యదర్శి రమేష్ తెలిపారు. కాగా, రాష్ట్రంలోని రెవెన్యూ సర్వీస్‌లో ఉన్న సీనియర్ అసిస్టెంట్లకు నాయబ్ తహ సీల్దార్లుగా పదోన్నతులు రానున్నాయని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి తెలిపారు.

యువత దేశాభివృద్ధిలో భాగం కావాలి

» గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాజేంద్రనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా రాజేంద్రనగర్‌లోని కో ఆపరేటివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(సీటీఐ)లో జరిగిన 'కశ్మీరీ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం' శనివారం ముగిసింది. ఈ సమావేశంలో గవర్నర్ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను గొప్పగా నిలబెట్టడానికి యువనైపుణ్యం అవసరమన్నారు. ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా కశ్మీర్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కశ్మీర్ యువతలో అనేక శక్తి సామర్థ్యాలు దాగి ఉన్నాయని, వాటిని దేశం కోసం ఉపయోగించాలని సూచించారు. ఆ దిశగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నెహ్రూ యువ కేంద్రాన్ని గవర్నర్ అభినందించారు. దేశంలో 15 రాష్ట్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర కో ఆర్డినేటర్ విజయరావు తెలిపారు.

తెలంగాణలో పెట్టుబడులు, సహకారం కోసం 117 ఒప్పందాలు

» టీ కన్సల్ట్ కృషిని ప్రశంసించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ సిటీ/కందుకూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలను ప్రోత్సహించేలా వివిధ దేశాల నుంచి తెలంగాణకు పెట్టుబడులు వస్తున్నాయని, అందులో టీ కన్సల్ట్ కీలక పాత్ర పోషిస్తుందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. టీ హబ్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే టీ కన్సల్ట్ కొలాబరేషన్ కాన్‌క్లేవ్ 2024ను ఆయన ప్రారంభించారు. తెలంగాణలో పెట్టుబడులు, సహకారం కోసం 117 ఒప్పందాలు కుదరడం అభినందనీయమని మంత్రి చెప్పారు. ఐటీతో పాటు ఐటీఈఎస్, హెల్త్‌కేర్, హెచ్ఆర్, ట్రేడింగ్, కెపాసిటీ బిల్డింగ్ తదితర అంశాల్లో వివిధ దేశాల్లో ఉన్న సంస్థలతో ఈ ఎంఓయూలు కుదిరాయి. ఆయా సంస్థలు తెలంగాణలో ఆవిష్కరణలు, అభివృద్ధికి పెట్టుబడులు పెట్టడం, సహకారమందించడం ద్వారా ఉద్యోగాల కల్పన జరుగుతుందని మంత్రి చెప్పారు. టీ కన్సల్ట్ వ్యవస్థాపకుడు సందీప్ మక్తాల ఆధ్వర్యంలో టీ కన్సల్ట్ బృందం దాదాపు 63 దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ ఐటీ నిపుణులను, సంస్థలను ఒకతాటిపైకి తెచ్చిందని శ్రీధర్‌బాబు ప్రశంసించారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా హామీలన్నీ నెరవేరుస్తాం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని కందుకూరు, మహేశ్వరం, బడంగ్‌పేటలలో రూ.69 కోట్ల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఫోర్త్ సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతానికి మహర్దశ కలగనుందన్నారు. రావిరాల ఓఆర్ఆర్-ఎగ్జిట్-13 నుంచి ఫోర్త్‌సిటీ వరకు 330 అడుగుల వెడల్పుతో నిర్మించే రోడ్డుకు ప్రజల సమ్మతితోనే భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు.

ఏడాదిలోనే ఆలయాల్లో సౌకర్యాలు మెరుగుపరిచాం: కొండా సురేఖ

హైదరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఆలయాల్లో సామాన్య భక్తులకు సౌకర్యాలు మరింత మెరుగుపరిచామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన అనేక పనుల్ని పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ప్రజల నమ్మకాలు, విశ్వాసాలకు అధిక ప్రాధాన్యతనిస్తు సమ్మక్క, సారలమ్మ, బోనాల జాతరలను ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిందని చెప్పారు. గతంలో ఎన్నడు లేని విధంగా దేవాదాయ శాఖ సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించిందని, బాసర సరస్వతి, అలంపూర్ జోగులాంబ దేవాలయాల్లో నదీ హారతి కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఉత్సవ కమిటీలు, ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుతో పాటు ఆక్రమణదారుల నుంచి పెద్ద మొత్తంలో దేవాదాయ భూములు తిరిగి స్వాధీనం చేసుకున్నామని శనివారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తొలగించిన 1200 మంది ఎంపీహెచ్‌ఏలను తిరిగి తీసుకోవడం చెల్లదు

» ఉభయ రాష్ట్రాలకు తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలతో తొలగించిన దాదాపు 1200 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ) సిబ్బందిని తిరిగి తీసుకోవడం చెల్లదని తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టంచేసింది. వారిని తిరిగి తీసుకుంటూ 2013లో జారీచేసిన జీవో నంబరు 1207ను కొట్టివేసింది. ఎంపీహెచ్ఏ పోస్టుల భర్తీ కోసం 2002లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పోస్టులకు సంబంధించిన కనీస విద్యార్హతల విషయంలో వివాదంరావడంతో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. తొలుత ఇంటర్మీడియెట్ కనీస అర్హతతో మెరిట్ లిస్టును రూపొందించారు. ఆ తర్వాత పదో తరగతి, హెల్త్ అసిస్టెంట్ డిప్లొమోలను కూడా కనీస అర్హతగా పరిగణించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో మెరిట్ జాబితా మారిపోయింది. హైకోర్టు తీర్పుతో 1200 మంది ఎంపీహెచ్ఏలను తొలగించారు. ఆ తర్వాత మంత్రుల బృందం ఈ అంశాన్ని పరిశీలించి, తొలగించిన 1200 మందిని కాంట్రాక్టు పద్ధతిలో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఆ మేరకు జీవో 1207 జారీ చేసింది. దీనిపై పలు పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై సమగ్రంగా విచారణ చేపట్టిన జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం తాజాగా తుదితీర్పు జారీచేసింది. కోర్టు తీర్పు ద్వారా తొలగించిన వారిని ఎలాంటి రిక్రూట్‌మెంట్ ప్రక్రియ లేకుండా తిరిగి తీసుకోవడం చెల్లదని పేర్కొంది. 1207 జీవోను కొట్టేసింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలు కూడా 2002లో హైకోర్టు తీర్పు ప్రకారం మెరిట్ జాబితాలో ఉన్నవాళ్లనే కొనసాగించాలని పేర్కొంది. ఆ తర్వాత ఏమైనా ఖాళీలు ఏర్పడితే చట్టప్రకారం రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ద్వారా భర్తీ చేపట్టవచ్చని తెలిపింది.

అమెరికాలో ఖమ్మం విద్యార్థిపై కాల్పులు




సాయితేజ

దుండగుల దాడిలో యువకుడి మృతి.. ఎంబీఏ కోసం 5 నెలల క్రితమే విదేశానికి

ఖమ్మం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఓ షాపింగ్ మాల్‌లో దుండగులు జరిగిన కాల్పుల్లో ఖమ్మం యువకుడు మృతి చెందాడు. ఉన్నత చదువు కోసం ఐదు నెలల క్రితమే విదేశానికి వెళ్లిన కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంలోని 60వ డివిజన్ రామన్నపేటకు చెందిన నుకారపు కోటేశ్వరరావు, వాణి దంపతులు పట్టణంలోని రాపర్తినగర్‌లో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు సాయితేజ(22) ఖమ్మంలో బీటెక్ పూర్తి చేశాడు. అమెరికాలో ఎంబీఏ చదివేందుకు జూన్ 23న వెళ్లాడు. విస్కాన్సిన్ రాష్ట్రంలో ఇద్దరు స్నేహితులతో కలిసి ఉంటూ కాన్కర్డియా యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతున్నాడు. ఆర్థిక అవసరాల కోసం సమీపంలోని షాపింగ్‌మాల్‌లో స్టోర్ మేనేజర్‌గా పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో భారత కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు దుండగులు డబ్బు కోసం మాల్‌లో కాల్పులు జరిపారు. కౌంటర్‌లో డబ్బులను కాజేసి, సాయితేజ జేబులోని పైసలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సాయితేజ డబ్బులు ఇచ్చేశాడు. అంతటితో ఆగక దుండగులు అతడిపై కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, సాయితేజ మృతిపై విదేశాంగ మంత్రి జైశంకర్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని షికాగోలోని భారత కాన్సులేట్ జనరల్ డిమాండ్ చేశారు. సాయితేజ మృతదేహాన్ని ఖమ్మం పంపించేందుకు తానా ప్రతినిధులు కృషి చేస్తున్నారు. కాగా, కోటేశ్వరరావు కుమార్తె స్ఫూర్తి ప్రియ న్యూజెర్సీలో చదువు పూర్తి చేసి ఉద్యోగం చేస్తోంది.

పెంచుకుంటున్నవారికే

దత్తత ఇవ్వొచ్చు కదా?



ఇందుకు చట్టబద్ధంగా ఉన్న అవకాశాలను పరిశీలించండి

- » పెంపుడు తల్లిదండ్రులు చేసుకున్న అర్జీలపై నిర్ణయం చెప్పండి: హైకోర్టు
- » 15 మంది చిన్నారుల విషయంలో శిశు సంరక్షణ కమిటీకి కోర్టు ఆదేశం
- » పిల్లల్ని బలవంతంగా స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు లేదని వ్యాఖ్య
- » చిన్నారులను తీసుకోవడానికి రక్తం పంచిన తల్లిదండ్రులు ముందుకురాలేదు..
- » ఈ విషయాన్ని శిశు సంరక్షణ కమిటీ పరిగణనలోకే తీసుకోలేదని ఆక్షేపణ

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ప్రేమ పంచడానికి కన్న తల్లిదండ్రులే కావాలా? అక్కున చేర్చుకొని, గోరుముద్దలు తినిపించి.. ఏడిస్తే లాలించి ఓదార్చేవారెవర్నయినా చిన్నారులు తమ కన్నవారిగానే భావిస్తారు. కొన్నాళ్లకు వారి ఎడబాటును ఆ చిన్నారులు గానీ, ఆ చిన్నారుల ఎడబాటును పెంచినవారు గానీ భరించలేరు. చట్టబద్ధమైన దత్తత కాదంటూ పిల్లలను పెంచుకుంటున్న తల్లిదండ్రుల నుంచి లాగేసుకొని.. దూరంచేస్తే అది ఆ చిన్నారులకు, పెంచుకున్నవారికీ గుండెకోత కాక పోతే మరేమిటి? తమవారు కనిపించకపోవడంతో పొద్దస్తమానం ఏడుస్తూ గడుపుతున్న ఆ చిన్నారులను కన్నవారైనా దయతలిచి అక్కున చేర్చుకుంటే కొన్నిరోజులకు ఆ పసిగుడ్లు పెంపుడు తల్లిదండ్రులను మరిచిపోయేవారేమో! అయితే పేగు తెంచుకొని పుట్టారన్న మమకారం కూడా లేకుండా చిన్నారులను తీసుకునేందుకు ఆ తల్లిదండ్రులు తిరస్కరించారు. మరి.. ఆ చిన్నారుల పరిస్థితి ఏమిటిప్పుడు? ఇదంతా కూడా అక్రమ మార్గంలో పిల్లలను కొనుగోలు చేశారనే ఆరోపణల మీద ఆర్నెల్ల క్రితం పెంపుడు తల్లిదండ్రుల నుంచి దూరం చేసి.. శిశు సంరక్షణ కమిటీ సంరక్షణలో ఉంచిన 15 మంది పిల్లల గురించే! పిల్లలు దూరమై కంటికి మంటికీ ధారగా రోదిస్తున్న ఆ తల్లిదండ్రులకు, శిశు గృహాల్లో మగ్గిపోతున్న పసికూనలకు ఊరట కలిగించేలా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పెంపుడు తల్లిదండ్రులు ఆ పిల్లలను కొనుగోలు చేసిన విషయం వాస్తవమే అయినా వారికే ఆ చిన్నారులను దత్తత ఇచ్చే అవకాశాలను పరిశీలించాలని.. ఆ మేరకు వారు ఇప్పటికే చేసుకున్న దరఖాస్తులపై నాలుగు వారాల్లోగా ఓ నిర్ణయం తీసుకోవాలంటూ శిశు సంరక్షణ కమిటీకి హైకోర్టు ఆదేశించింది. కేసు వివరాల్లోకి వెళితే.. రాచకొండ మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పీర్జాదిగూడ రామకృష్ణ నగర్ కాలనీలో శోభారాణి అనే మహిళ ఓ క్లినిక్‌ను నిర్వహిస్తోంది. సదరు క్లినిక్ ముసుగులో చిన్న పిల్లలను సంతానం లేని దంపతులకు ఆమె విక్రయిస్తోందనే సమాచారం రావడంతో కొందరు విలేకరులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహిచారు. నెలలు కూడా నిండని ఆడపిల్లను రూ.5 లక్షలు, మగపిల్లలను రూ.6 లక్షల ధర నుంచి ఆమె బేరంపెట్టినట్లు తేలింది. విలేకరులు ఆ క్లినిక్‌కు వెళ్లి ఓ ఆడ శిశువును తీసుకుంటామని చెప్పి రూ.4.5 లక్షలకు బేరం కుదుర్చుకుని.. కొందరు పిల్లల ఫొటోలను తీసుకున్నారు. ఈ సమాచారం ఆధారంగా మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు దత్తత నిబంధనలేమీ పాటించకుండా, విక్రయించారనే ఆరోపణలతో గత మే నెల 22వ తేదీన 15 మంది చిన్నారులను స్వాధీనం చేసుకొని శిశు సంరక్షణ కమిటీకి అప్పగించారు. అయితే ఆ పిల్లలను ప్రాణప్రదంగా చూసుకుంటున్న ఆ పెంపుడు తల్లిదండ్రులు హైకోర్టులో తొమ్మిది వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు.

పిల్లలను లాక్కునే అధికారం పోలీసులకెక్కడిది?

పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం.. చిన్నారులను బలవంతంగా స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు లేదని స్పష్టంచేసింది. అక్రమంగా దత్తత తీసుకున్న తల్లిదండ్రులు చట్టప్రకారం అడాప్షన్ డీడ్స్ ఎగ్జిక్యూట్ చేయడం లేదా చట్టంలో అనుమతించిన విధంగా హిందూ సంప్రదాయం ప్రకారం దత్తత హోమం ద్వారా దత్తత తీసుకొని పిల్లలను తమ వద్దే ఉంచుకోవచ్చునని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్, డివిజన్ బెంచ్‌లో రిట్ అప్పీళ్ల ద్వారా సవాల్ చేశారు. ఈ రిట్ అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సమగ్రంగా విచారించింది. జువెనైల్ జస్టిస్ కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ యాక్ట్ - 2015 పేర్కొన్న ప్రక్రియపై చర్చించింది. 'ప్రస్తుత కేసులో పిల్లలను వారి కన్న తల్లిదండ్రులు తీసుకోవడానికి సిద్ధంగా లేరు. పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి పిల్లలను అప్పగించిన తర్వాత చట్టప్రకారం సదరు పిల్లలకు కేర్ అండ్ ప్రొటెక్షన్ అవసరమా? ఎలాంటి అడ్డంకులు లేకుండా న్యాయపరంగా దత్తత ఇవ్వడానికి కన్నవారు సిద్ధంగా ఉన్నారా? అనే అంశాలపై కమిటీ విచారణ నిర్వహించలేదు. చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తిచేయలేదు. మే నెల 22 నుంచి పిల్లలు కమిటీ కస్టడీలోనే ఉంటున్నారు. ప్రస్తుతం సదరు కస్టడీలో మేం జోక్యం చేసుకోవడం లేదు. చట్టప్రకారం అన్ని విచారణలు పూర్తిచేసి.. దత్తత తల్లిదండ్రులకు మళ్లీ చట్టప్రకారం దత్తత ఇచ్చే అంశంపై నాలుగువారాల్లో కమిటీ నిర్ణయం తీసుకోవాలి ' అని ధర్మాసనం పేర్కొంది.

పత్తి చేనులో మళ్లీ పులి గాండ్రింపు

- » పత్తి ఏరుతున్న రైతుపై పంజా.. తీవ్రగాయాలు
- » ఆసిఫాబాద్ జిల్లాలో బెంబేలెత్తిస్తున్న వ్యాఘ్రం
- » డ్రోన్ల సాయంతో ముమ్మర గాలింపు
- » అధికారుల సూచనలు పాటించండి: కొండా సురేఖ



పులిదాడిలో గాయపడిన సురేశ్

సిర్పూరు(టి)/కాగజ్‌నగర్/హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మనిషి రక్తం రుచి మరిగిన పెద్ద పులి.. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాసులను హడలెత్తిస్తోంది. కాగజ్‌నగర్ మండలంలోని ఓ పత్తి చేనులో శుక్రవారం ఓ యువతిని పొట్టనపెట్టుకున్న పెద్ద పులి.. సిర్పూరు టౌన్ దుబ్బగూడ సమీపంలోని పత్తి చేల్లో శనివారం మళ్లీ పంజా విసిరింది. తన పొలంలో పత్తి ఏరుకుంటున్న రౌతు సురేశ్ అనే రైతుపై వెనుక నుంచి దాడి చేసింది. పక్కనే ఉన్న సురేశ్ భార్య వేసిన కేకలకు సమీపంలోని పొలాల్లో ఉన్నవారు కూడా అక్కడి చేరుకుని అరవడంతో పులి పారిపోయింది. శనివారం ఉదయం పది గంటల సమయంలో ఈ దాడి జరగడం గమనార్హం. తీవ్రంగా గాయపడిన సురేశ్‌ను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. సురేశ్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, పెద్ద పులి వరుస దాడులతో ప్రజలు హడలిపోతున్నారు. దీంతో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి దాడి చేసిన ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య మాత్రమే పొ లం పనులకు వెళ్లాలని సూచించారు. శనివారం ఉదయం నుంచి డ్రోన్ల సాయంతో పులి జాడను వెతుకుతున్నారు. పులి దాడుల్లో ఓ యువతి మరణించగా, మరో రైతు తీవ్రం గా గాయపడటంపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. పులి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అధికారుల సూచనలను పాటించాలని పిలుపునిచ్చారు.

ఉసూరుమనిపించిన రైతు పండుగ

అసెంబ్లీలో కాంగ్రెస్ పాలనను ఎండగడతాం: హరీశ్



హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో ఆడంబరంగా నిర్వహించిన రైతు పండు గ యావత్ తెలంగాణ రైతాంగాన్ని ఉసూరుమనిపించిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించా రు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రైతులందరికీ రుణమాఫీ, వానాకాలంతో పాటు యాసంగికి కలిపి ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా ప్రకటిస్తారనుకుంటే మరోసారి మొండిచెయ్యి చూపారన్నారు. కౌలు రైతులు, ఉపాధి కూలీలకు రైతుబంధు అతీగతీ లేకుండా పోయిందని పేర్కొన్నారు. రైతు పండుగలో సీఎం ప్రసంగం చూస్తే రైతుల పట్ల ప్రేమ కంటే గిరిజనుల నుంచి భూసేకరణ చేయడంలో ఘోరంగా విఫలమయ్యామనే ఆవేదనే కనిపించిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధి జరగాలంటే రైతులు నష్టపోవాలని సీఎం చెబుతున్నారని, వారిని బెదిరిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీకి రమ్మని సీఎం తెగ పిలుస్తున్నారని తాము ఆ సమయం కోసమే ఎదురుచూస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన అసలు రంగు బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, మైకులు కట్ చేయకుం డా సమయం కేటాయించే దమ్ముందా అని ప్రశ్నించారు. రైతుబంధు పథకాన్ని శాశ్వతంగా బందుపెట్టే కుట్రకు తెరతీయడం సిగ్గుచేటని విమర్శించారు. రైతుబంధు కంటే సన్నాలకు ఇచ్చే రూ.500 బోనసే మేలు అని రైతులు చెబుతున్నారని వ్యవసాయశాఖ మంత్రి చెప్పడం శోచనీయమన్నారు.

సురేఖకు ఆ అర్హత లేదు..: ఆర్ఎస్ ప్రవీణ్

కొండా సురేఖను తెలంగాణ సమాజం తిరస్కరించిందని, ఆమెకు మంత్రిగా ఉండే అర్హత లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆమె సంస్కారం లేకుండా మాట్లాడుతున్న తీరును ప్రజలు గుర్తించారని, ఆమె కుటుంబం గురించి వరంగల్ ప్రజలకు తెలుసన్నారు. తాను ప్రభుత్వ హాస్టల్‌లో చదువుకుని ఐపీఎస్ అయ్యానని, దేశ సేవ చేయడంతో పాటు ఏడేళ్ల సర్వీస్ వదులుకుని రాజకీయాల్లోకి వచ్చానన్నారు. రాష్ట్రంలో గురుకుల విద్యా వ్యవస్థ కుప్పకూలిందని విమర్శించారు. సంవత్సర కాలంగా విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు లేరని, సమస్యలపై విద్యార్థులు రోడ్డెక్కుతున్నారని పేర్కొన్నారు.

త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్

ఫిర్యాదుల స్వీకరణ.. పరిశీలన.. చర్యలు.. ఆక్రమణలకు పాల్పడితే ఏ ఒక్కరినీ వదలం

- » సంపన్నులు, నాయకుల కబ్జాలే అధికం
- » పట్టణ జీవవైవిధ్య సదస్సులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- » ప్రతి నగరంలో హైడ్రా ఉండేలా సిఫారసు
- » జాతీయ జీవవైవిధ్య సంస్థ చైర్మన్ అచలేందర్



పట్టణ జీవవైవిధ్య సదస్సులో మాట్లాడుతున్న హైడ్రా చీఫ్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తాం. చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలపై ఫిర్యాదులను స్వీకరిస్తాం. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. చెరువుల, పార్కులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు అనేక చట్టాలున్నాయి. వాటిని నిక్కచ్చిగా అమలయ్యేలా హైడ్రా చర్యలు తీసుకుంటుంది' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యాఖ్యానించారు. జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్మెంటల్ ఇనీషియేటివ్ ఆధ్వర్యంలో పట్టణ జీవవైవిధ్యంపై నగరంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని, ప్రసంగించారు. జీవకోటికి ప్రాణాధారమైన జల వనరులను పరిరక్షించి, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు హైడ్రా కృషిచేస్తోందన్నారు. 'ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడంతోపాటు.. చెరువుల పరిరక్షణ, వాటి పునరుద్ధరణ, ప్రజల అవసరాలకు కేటాయించిన స్థలాలు, పార్కులు, రహదారులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను రక్షించడమే హైడ్రా విధి. హైడ్రా ఆవిర్భావం తర్వాత చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లపై ప్రజల్లో చర్చలు జరుగుతున్నాయి. తాము కొనే ఇల్లు బఫర్ జోన్‌లో ఉందా? ప్రభుత్వ స్థలమా? అని ప్రజలు ఆరా తీస్తున్నారు. ఇది మంచి పరిణామం" అని వ్యాఖ్యానించారు. ఆక్రమణలకు పాల్పడితే ఏ ఒక్కరినీ వదలబోమని, జూబ్లీహిల్స్ లోటస్‌పాండ్‌లో ఏకంగా ఎకరం స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నాలు జరగ్గా.. హైడ్రా అడ్డుకుందని గుర్తుచేశారు. నగరంలోని చెరువులు ఇప్పటికే 61% ఆక్రమణలకు గురయ్యాయని, ఇప్పటికైనా పటిష్ఠ చర్యలు చేపట్టకపోతే.. మిగిలిన 39% చెరువులు కూడా 15 ఏళ్లలో కనుమరుగయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ఆర్ఎస్ఏ, సర్వే ఆఫ్ ఇండియా, సర్వే ఆఫ్ తెలంగాణ, నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తదితర విభాగాల సహకారంతో చెరువుల లెక్క తేలుస్తామన్నారు. 'హైడ్రా అంటే కూల్చడం కాదు. చెరువులను పునరుద్ధరించి, చక్కటి వాతావరణాన్ని ఏర్పాటు చేయడం. ఇటీవల కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)తో సమావేశమై.. చెరువుల కలుషితం కాకుండా చూడాలని కోరాం. పారిశ్రామిక వ్యర్థాలను చెరువుల్లోకి రాకుండా చూస్తామని పీసీబీ అధికారులు తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తాం' అని పేర్కొన్నారు. జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ చైర్మన్ అచలేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నగరంలో హైడ్రాలాంటి వ్యవస్థ ఉండేలా కేంద్రానికి సిఫారసు చేస్తామన్నారు.

ఈత కొలనులో మునిగి అమెరికాలో తెలుగు యువకుడి మృతి

రూ.5.4 కోట్ల పరిహారం

» అపార్ట్‌మెంట్‌కు వ్యతిరేకంగా అక్కడి కోర్టు తీర్పు

హైదరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఓ తెలుగు యువకుడి మరణానికి కారణమైన అపార్ట్‌మెంట్‌కు అక్కడి న్యాయస్థానం భారీ జరిమానా విధించింది. బాధిత కుటుంబానికి రూ.5.40 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. హైదరాబాద్‌లోని శామీర్‌పేటకు చెందిన కొల్లి మణిదీప్ ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి అక్కడి కాన్సాస్ రాష్ట్రంలో ఉండేవాడు. అతను నివాసముంటున్న అపార్ట్‌మెంట్ ఈత కొలనులో మునిగి మణిదీప్ గతేడాది మరణించాడు. అయితే, అమెరికాలో ప్రముఖ న్యాయవాది, హైదరాబాద్ మూలాలున్న అబ్దుల్ క్యూ ఆరిఫ్, అక్కడి సామాజికవేత్త విక్రంసాగర్ కలిసి మణిదీప్ మృతి ఘటనపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈత కొలను లోతు తెలియజేసే సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో నీళ్లలోకి దిగిన మణిదీప్ ఊపిరాడక మరణించాడని, ఇందుకు అపార్ట్‌మెంట్‌దే బాధ్యత అని వాదించారు. వారి వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం బాధిత కుటుంబానికి రూ.5.40 కోట్ల పరిహారం చెల్లించాలని అపార్ట్‌మెంట్ నిర్వాహకులను ఆదేశించింది. అయితే, హైదరాబాద్‌లోని టీహబ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పరిహారానికి సంబంధించిన చెక్కును అబ్దుల్ క్యూ ఆరిఫ్, విక్రం సాగర్.. మంత్రి శ్రీధర్ బాబు చేతులమీదుగా మణిదీప్ తల్లిదండ్రులకు అందజేశారు. ఆరిఫ్, విక్రం సాగర్‌ను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. విదేశాల్లో ఉంటున్న భారత విద్యార్థుల హక్కులు, రక్షణకు ఇలాంటి చర్యలు ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. కాగా, అమెరికాలో తెలుగు విద్యార్థికి అనుకూలంగా అక్కడి కోర్టు తీర్పు ఇవ్వడం ఇటీవల కాలంలో ఇదే తొలిసారని అక్కడి తెలుగు సంఘాలు పేర్కొంటున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.